వాసెల్ గతి నారంజ్‌జులై వెబ్‌సైట్‌
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
విజయవాడ
fb.com/vaartha
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
21-1-2025 మంగళవారం సంపుటి: 30 సంచిక: 353 పేజీలు: 12 వెల: 6.50

## ప్రియుడిని హతమార్చిన యువతికి మరణశిక్ష

## శబరిమల అయ్యప్ప ఆలయం మూసివేత

9లో



# ట్రంప్ 2.0 పట్టాభిషేకం

సోమవారం కేపిటల్ రోటుండాలో పదవీ ప్రమాణం చేస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

### అమెరికా 47వ అధ్యక్షుడుగా పదవీప్రమాణం చేసిన ట్రంప్

### ఆయనతో ప్రమాణం చేయించిన సుప్రీం చీఫ్ జస్టిస్ జాన్ రాబర్ట్స్

### ఉపాధ్యక్షుడుగా జెడివాన్స్ ప్రమాణం

### కేపిటల్ రోటుండాలో అట్టహాసంగా జరిగిన వేడుకకు హాజరైన మాజీ అధ్యక్షులు ఒబామా, క్లింటన్, జార్జిబుష్, ప్రపంచ కుబేరుడు ఎలాన్‌మస్క్, మార్క్ జుకర్ బర్గ్ తదితరులు

### భారత్ తరపున హాజరైన విదేశాంగ మంత్రి జైశంకర్

**వాషింగ్టన్‌డీసీ, జనవరి 20:** అమెరికా 47వ అధ్యక్షుడుగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారం చేసారు. డొనాల్డ్‌జాన్ ట్రంప్ అనునేను అమెరికా రాజ్యాంగం పట్ల నిబద్ధతతో వ్యవహరిస్తానని, రాజ్యాంగం నిర్దేశించిన సూత్రాలను పాటిస్తూ అమలుకు చిత్తశుద్ధితోపనిచేస్తానంటూ తన ప్రమాణాన్ని చదివారు. అమెరికా సుప్రీంకోర్టుప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్‌ట్రంప్ చేత ప్రమాణం చేయించారు. ఎడమచేతిని పైకి ఎత్తిచూపుతూ మరో చేతిని బైబిల్‌గ్రంథంపై ఉంచి ట్రంప్ తన ప్రమాణం కొనసాగించారు. 1861లో అబ్రహాం లింకన్‌ప్రమాణ స్వీకారం చేయడానికి ఉపయోగించిన బైబిల్, తన బైబిల్‌ను చేతిలోపట్టుకుని ట్రంప్ ప్రమాణస్వీకారంచేసి బాధ్యతలు స్వీకరిస్తున్నట్లుప్రకటించారు. అంతకు ముందు ఉపాధ్యక్షుడు జెడివాన్స్‌చేత సుప్రీం చీఫ్‌జస్టిస్‌ప్రమాణంచేసారు. క్యాపిటల్ హిల్స్‌లోని రోటుండా హాలులో క్రిక్కిరిసిన అతిథులమధ్య డొనాల్డ్‌ట్రంప్‌ప్రమాణంచేసారు. ఈ కార్యక్రమంలో దేశవిదేశాలనుంచి వచ్చిన అతిథులు, సెనేటర్లు, రిపబ్లికన్ ప్రతినిధులు మొత్తం హాజరు అయ్యారు. అంతకుముందు సాంప్రదాయబద్ధంగా ప్రస్తుత అధ్యక్షుడు జోబైడెన్‌ను కలిసేందుకు శ్వేతసౌధానికి వెళ్లిన ట్రంప్‌కు బైడెన్ దంపతులు సాదరస్వాగతం పలికారు. తేనీటివిందు అనంతరం వాషింగ్టన్‌డీసిలోని క్యాపిటల్‌హిల్ రోటుండా ఇండోర్‌కు ఒకే వాహనంలో బయలుదేరివెళ్లారు. ఈ కార్య క్రమంలో పలువురు మాజీ అధ్యక్షులు సతీసమేతంగా వచ్చారు. బిల్‌క్లింటన్,

>>2

## అమెరికాలో ఇక స్వర్ణయుగం

### 'అమెరికా ఫస్ట్' అనేదే మా నినాదం

### అక్రమ వలసదారుల కట్టడికి మెక్సికో సరిహద్దులో అత్యవసర పరిస్థితి

### అధ్యక్షునిగా తొలి ప్రసంగంలో ట్రంప్

**వాషింగ్టన్‌డీసి, జనవరి 20:** అమెరికాలో స్వర్ణయుగం మళ్లీప్రారంభం అయిందని, చరిత్రలో ఈరోజు ఎంతో ముఖ్యమైనదని ప్రజలకు స్వేఛ్ఛా వాయువులు పీల్చుకునే

>>2



## భారీగా ఐపిఎస్‌ల బదలీ



### ఎపి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్‌గా ఆర్కే మీనా

### శాంతిభద్రతల అదనపు డిజిగా ఎన్. మధుసూదన్ రెడ్డి

### ఫోరెన్సిక్ ల్యాబ్ డైరెక్టర్‌గా పాల్‌రాజు, ఎపిఎస్పీ బెటాలియన్ కమాండెంట్‌గా రాజ్‌కుమారి నియామకం

### గ్రేహౌండ్స్ డిజిగా బాబ్జీ, ఎసిబి డైరెక్టర్‌గా రాజ్యలక్ష్మి

**విజయవాడ,జనవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో భారీగా ఐపిఎస్ అధికారులను ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం బదలీ చేసింది. మొత్తం 27 మంది ఐపిఎస్ అధికారులను బదలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ చైర్మన్‌గా ఆర్కే మీనాను నియమించారు. శాంతి భద్రతల అదనపు డిజిగా ఎన్. మధుసూధన్ రెడ్డిని బదలీ చేశారు. ఆపరేషన్స్ ఐజిపిగా సిహెచ్ శ్రీకాంత్‌ను నియమించారు. ఆయనకు టెక్నికల్ సర్వీసెస్ ఐజిపిగా కూడా ఆయన అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారని జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఏపీ ఫోరెన్సిక్ ల్యాబ్ డైరెక్టర్‌గా పాలరాజు, ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్‌గా రాజ్ కుమారిని నియమించారు. ఇక తిరుపతి ఎస్పీగా హర్షవర్ధన్‌రాజు బాధ్యతలు చేపట్టనున్నారు. అలాగే కర్నూలు జిల్లా ఎస్పీగా విక్రాంత్ పాటిల్, కాకినాడ ఎస్పీగా బింధు మాధవ్, ఎర్రచందనం యాంటి టాస్క్‌ఫోర్స్ ఎస్పీగా సుబ్బారాయుడిని బదలీ చేశారు. మరోవైపు ఇటీవల తిరుపతిలో వైకుంఠ ద్వారా దర్శనం టోకెన్ల జారీ ముందు తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు వ్యక్తులు మరణించారు. ఈ నేపథ్యంలో తిరుపతి ఎస్పీపై బదలీ వేటు పడింది. దాంతో సుబ్బారాయుడుని ఎర్రచందనం

>>2

# ఎపి అభివృద్ధికి కదలండి

### జ్యూరిచ్‌లోని ప్రవాసాంధ్రులను కోరిన సిఎం చంద్రబాబు

### దావోస్ వెళ్తూ జ్యూరిచ్ ఎయిర్‌పోర్టులో దిగిన సిఎం బృందం

### విమానాశ్రయంలోనే తెలంగాణ సిఎం, మంత్రి శ్రీధర్‌బాబుతో భేటీ

### రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధిపై చర్చించిన సిఎం చంద్రబాబు, సిఎం రేవంత్



సోమవారం జ్యూరిచ్ విమానాశ్రయంలో తెలుగు ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు లోకేష్, శ్రీధర్‌బాబు తదితరులు

**విజయవాడ,జనవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** 'బ్రాండ్ ఎపి ప్రమోషన్' నినాదంతో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు సాధించేందుకు దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సుకు హాజరయ్యేం దుకు సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, అధికారుల బృందం జ్యూరిచ్ ఎయిర్ పోర్ట్‌కు చేరుకున్నారు. అక్కడ వారికి యూరప్ టిడిపి ఫోరం సభ్యులు, ప్రవాసాంధ్రులు ఘన స్వాగతం పలికారు. ఈ క్రమంలోనే విమానాశ్ర యంలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలుసు కున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి అక్కడ కాసేపు ముచ్చటించు కున్నారు. రెండు రాష్ట్రాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ పెట్టుబడులపై వారి మధ్య చర్చ జరిగింది. అనంతరం చంద్రబాబు బృందం విమానాశ్రయం నుంచి హిల్టర్ హోటల్‌కు చేరుకు న్నారు. అక్కడ భారత రాయబారి మృదుల్ కుమార్‌తో ఆయన భేటీ అయ్యారు. అనంతరం పలువురు పారిశ్రామిక వేత్తలతో ముఖ్యమంత్రి బృందం సమావేశమైంది. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. తరువాత తెలుగు కమ్యూనిటీ వారితో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో సిఎం పాల్గొననున్నారు. నాలుగు రోజుల పాటు చంద్ర బాబు విదేశీ పర్యటన సాగనుంది. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సిఎం పర్యటన సాగనుంది. ఇప్పటికే ఏపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గూగుల్ వంటి సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తు న్నాయి. కాసేపట్లో పలువురు పారిశ్రామికవేత్తలతో సీఎం బృందం సమావేశం కానుంది. అనంతరం తెలుగువారితో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో జ్యూరిచ్ నుంచి దావోస్‌కి చంద్రబాబు వెళ్లను న్నారు. ఈ క్రమంలో అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం, రాష్ట్రంలో ఉన్న పెట్టుబడుల అవకాశాలను తెలియజేయడంతో పాటు ఇటీవల తీసుకొచ్చిన పాలసీలను దావోస్ వేదికగా తెలియజేయాలని సిఎం భావించారు. అందులో భాగంగానే వరుస సమావేశాల్లో సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు. రోజుకు సుమారు పది సమావేశాల్లో మాట్లాడే విధంగా షెడ్యూల్‌ను సిద్ధం చేశారు. సోమవారం రాత్రి పలువురు పారిశ్రామిక వేత్తలతో డిన్నర్ మీటింగ్‌లో సిఎం పాల్గొంటారు. తరువాత అర్సె ల్లార్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ లక్ష్మీ మిట్టల్‌తో ప్రత్యేక సమావేశంలో పాల్గొంటారు. తొలి రోజు సమావేశాలు ముగించుకుని హోటల్‌కు చేరుకుం టారు. రెండవ రోజు సిఐఐ సెషన్ లో గ్రీన్ హైడ్రోజన్ అంశంపై చర్చలో పాల్గొం టారు. తరువాత సోలార్ ఇంపల్స్,

>>2

## కత్తిపూడి-ఒంగోలు జాతీయ రహదారి విస్తీర్ణం కుదింపు

### కేంద్రంతో అత్యవసర చర్చలు జరుపుతున్న రాష్ట్ర ప్రభుత్వం

**విజయవాడ,జనవరి 20,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి రాజధానికి అనుసంధానం చేసేందుకు నిర్దేశించిన రోడ్డును కుదించేందుకు జాతీయ రహదారి తాజాగా నిర్ణయం తీసుకుంది.ఒక రకంగా ఇది ఎపి ప్రభుత్వానికి షాక్ లాంటి నిర్ణయం. దీంతో ఎపి ప్రభుత్వం ఈ రహదారి విషయంలో కేంద్రంతో అత్యవసర సంప్రదింపులు ప్రారంభించింది. కత్తిపూడి-ఒంగోలు జాతీయ రహదారిని 380.58 కి.మీ.మేర రెండు దశల్లో విస్తరించనున్నారు. ఇది నాలుగు, ఆరువరుసలుగా ఉంటుంది. తొలి దశలో కత్తిపూడి నుంచి మచిలీపట్నం బైపాస్ వరకు 229 కి.మీ. మేర విస్తరించనున్నారు. ఇందుకు సంబంధించిన డిపిఆర్ తయారీకి సలహా సంస్థ ఎంపిక కోసం ఇటీవల టెండర్లు సైతం పిలిచారు. తర్వాత రెండో దశలో మచిలీపట్నం నుంచి ఒంగోలు (త్రోవగుంట) వరకూ హైవే నిర్మించేందుకు టెండర్లు పిలవాలని భావించారు. అయితే మొత్తం ఒకేసారి రహదారికి సంబంధించిన డిపిఆర్ సిద్ధం చేయించాలని కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ తాజాగా ఆదేశాలిచ్చింది. దీంతో ఇప్పటికేపిలిచిన టెండరులో మార్పులు చేసి మొత్తం 380.58 కి.మీ.ల డిపిఆర్‌కు టెండరు ఆహ్వానించారు. ఈ నెల 30 వరకు బిడ్ల దాఖలుకు గడువిచ్చారు.బాపట్ల జిల్లాలోని నిజాంపట్నం హార్బర్ నుంచి గుంటూరు వరకు నిర్మించాల్సిన హైవేలో కోతపెట్టేందుకు ఎన్‌హెచ్‌ఏఐ ప్రయత్నిస్తోంది. నిజాంపట్నం నుంచి గుంటూరు వద్ద కోల్‌కతా చెన్నై జాతీయరహదారి వరకు నిర్మించాల్సి ఉన్న హైవేను కేవలం చందోలు వద్ద కత్తిపూడి ఒంగోలు హైవేకి కలిపితే చాలనే కొత్త ప్రతిపాదన తెర మీదకు తెచ్చింది. దీనివల్ల నిజాంపట్నం హార్బర్‌కు కీలకమైన కోల్‌కతా చెన్నైహైవేతో లింక్ ఉండదు. అలాగే రాజధాని అమరావతికి అనుసం

>>2



## గ్రామ పంచాయతీల క్లస్టర్ వ్యవస్థకు

# కొత్త రూపు

### ఆదాయ ప్రాతిపదికతో పాటు జనాభాను జోడించి కొత్త గ్రేడ్లు

### సిఫార్సులు చేసేందుకు కమిటీ ఏర్పాటు: డిప్యూటీ సిఎం పవన్

**విజయవాడ,జనవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామీణ ప్రజలకు నిరంతరాయంగా పంచాయతీ సేవలు అందేలా చూస్తామని, ఇందుకోసం స్థిరమైన కార్యచరణతో వ్యవహరిస్తామని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ విషయంలో సిబ్బంది లేమి సమస్యను అధిగమించాలని పంచాయతీరాజ్ అధికారులకు ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని గ్రామ పంచాయతీల క్లస్టర్ విధానంలో మార్పులు చేపట్టి, కొత్త మార్గదర్శకాలను రూపొందించాలని ఆదేశించారు. గతంలో పంచాయతీల ఆదాయాన్ని ప్రాతిపదికగా తీసుకొని మాత్రమే చేపట్టిన క్లస్టర్ గ్రేడ్ల విభజన విధానానికి, నూతనంగా జనాభాను కూడా ప్రాతిపదికగా తీసుకొని పంచాయతీల క్లస్టర్ గ్రేడ్లు విభజించాలని సూచించారు. సిబ్బంది నియామకం విషయంలో హెచ్చుతగ్గులు లేకుండా, గ్రామ పంచాయతీల్లో సేవలు నిరంతరాయంగా ప్రజలకు అందాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కల్యాణ్ తన క్యాంపు కార్యాలయంలో గ్రామ పంచాయతీల క్లస్టర్ గ్రేడ్ల విభజనపై సమీక్ష చేశారు. ఆదాయం ఎక్కువగా ఉన్న పంచాయతీల్లో జనాభా తక్కువగా ఉండి, ఆదాయం తక్కువగా ఉన్న పంచాయతీల్లో జనాభాగా ఎక్కువగా ఉండే పరిస్థితుల్లో పాత క్లస్టర్ వ్యవస్థ వల్ల సిబ్బంది నియామకం విషయంలో తలెత్తుతున్న ఇబ్బందులు ఈ సమీక్షలో ప్రస్తావనకు వచ్చాయి. గ్రామ పంచాయతీ, సచివాలయ సిబ్బందిని సమన్వయం చేసుకొని కొత్త క్లస్టర్ గ్రేడ్ల విభజన విధానంలో సిబ్బందిని నియమించుకోవడంపై చర్చించారు.. ఈ విధంగా చేయడం వల్ల మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాలు అమలు, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణతో పాటు గ్రామ పంచాయతీల ప్రాథమిక బాధ్యత అయిన తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, అంతర్గత రోడ్ల నిర్మాణం, పారిశుద్ధ్య మెరుగుదలకు తగినంత మంది సిబ్బంది ఉంటారని, వీటిపై అధ్యయనం చేసి పంచాయతీల్లో పరిపాలన సులభతరం చేసేందుకు అవసరమైన సిఫార్సులు చేసేందుకు కమిటీ వేయాలని ఉపముఖ్యమంత్రి నిర్ణయించారు. కొత్త క్లస్టర్ల విభజన, గ్రేడ్ల కేటాయింపుపై ప్రభుత్వానికి ఈ కమిటీ సిఫార్సులు చేయనుంది. పంచాయతీరాజ్ శాఖ నుంచి నలుగురు ఉన్నతాధికారుల కమిటీ ఏర్పాటవుతుంది.. జిల్లా యూనిట్ ప్రాతిపదికన 26 జిల్లాల్లో ఉన్న పంచాయతీల ఆదాయం, జనాభాను ప్రాతిపదికగా తీసుకొని జిల్లా

>>2



# సంజయ్ రాయ్‌కి జీవిత ఖైదు

### మృతురాలి కుటుంబానికి 17 లక్షల పరిహారం చెల్లించాలని కోర్టు తీర్పు

### కోల్‌కతా హత్యాచారం కేసులో నిందితునికి ఉరిశిక్ష వేయాలి పలువురి డిమాండ్

### అత్యంత అరుదైన కేసు కానందున జీవిత ఖైదుమాత్రమే విధిస్తున్నట్లు తెలిపిన జడ్జి

**కోల్‌కత్తా, జనవరి 20:** నగరంలోని రాధాగోవింద్‌కర్ ఆసుపత్రిలో గత ఏడాది జరిగిన పిజి వైద్యవిద్యార్థిని హత్యాచారం కేసులో ఏకైక నిందితుడు సివిక్ పోలీస్ వలంటీర్‌కు స్థానికకోర్టు జీవితఖైదు శిక్ష విధించింది. ఈకేసు అత్యంత అరుదైన కేసుల కేటగిరీలోకి రానందున నిందితుడికి మరణ

>>2

# వాట్సప్ గవర్నెన్స్ త్వరలో అమలు



### జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు సహా అన్నిరకాల సమాచారం వాట్సప్ ద్వారానే: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

**విజయవాడ,జనవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే ప్రజలకు వాట్సాప్ గవర్నెన్స్ సేవలు అందించనుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ తెలిపారు. ఇందులో భాగంగా వాట్సాప్ ద్వారా ప్రజలకు త్వరలోనే జనన, మరణ ధృవీకరణ పత్రాలు పొందే సదపాయం కూడా కల్పిస్తున్నామన్నారు. దీనికి సంబంధించిన కసరత్తులో భాగంగా ఈ నెలలోనే తెనాలీలో ప్రయోగాత్మకంగా ఈ ప్రక్రియను పరిశీలించనున్నట్లు వెల్లడించారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరులకు జనన, మరణ ధృవీకరణ పత్రాలు పొందే సేవలు కల్పించే ప్రక్రియపైన సోమవారం సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీలో

>>2

## చట్ట సభలు మెరుగుపడాలి

### పాట్నాలో జరిగిన సమావేశంలో లోక్‌సభ స్పీకర్ ఓమ్‌బిర్లా

**పాట్నా, జనవరి20:** శాసనసభల సమావేశాల సంఖ్య తగ్గుతుండడం పట్ల లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లా సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఆ సమస్య పరిష్కారానికి కృషి చేయవలసిందిగా స్పీకర్లకు ఆయన విజ్ఞప్తి చేశారు. బిహార్‌లోని పాట్నాలో సోమవారం 85వ అఖిల భారత సభాపతుల సమ్మేళనం (ఎఐపిఒసి) ప్రారంభ సమావేశంలో బిర్లా ఆ వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ శాసనసభ తన పూర్తి ఐదు సంవత్సరాల హయాంలో కేవలం 74 సమావేశాలు నిర్వహించిందనే వార్తల మధ్య ఆయన ఆ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.పార్లమెంట్,రాష్ట్ర శాసనసభల్లో అంతరాయాల యోచన పట్ల కూడా లోక్‌సభ స్పీకర్ ఆందోళన వ్యక్తం చేశారు. సభ గౌరవాన్ని

>>2

21-01pg2exHMNWJQE.qxd:21-01pg2exHMNWJQE.qxd 01/01/01 10:03 AM Page 1





సోమవారం జ్యూరిచ్‌లో స్విస్ రాయబారి మృదుల్ కుమార్‌తో భేటీ అయిన సిఎం చంద్రబాబు

# ఎపి అభివృద్ధికి కదలండి

>> కోకకోలా, వెల్ స్పన్, ఎల్ జి, కార్ల్స్ బర్గ్, సిస్కో, వాల్ మార్ట్ ఇంటర్ నేషనల్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ వంటి సంస్థల సీఈవోలతో, చైర్మన్ లతో రెండో రోజు ముఖ్యమంత్రి సమావేశం అవుతారు. యుఎఈ ఎకానమీ మినిస్టర్ అబ్దుల్లా బిన్ తో సిఎం సమావేశం అవుతారు. అనంతరం వరల్డ్ ఎకనమిక్ ఫోరం నిర్వహిస్తున్న ఎనర్జీ ట్రాన్సి షన్ వేర్ పబ్లిక్ పాలసీ మీట్స్ ప్రైవేట్ గోల్స్ అనే అంశంపై జరిగే చర్చలో పాల్గొంటారు. అనంతరం ది నెక్స్ట్ వేవ్ ఫైనీరింగ్ ది బ్లూ ఎకానమీ ఆఫ్ టుమోరో అనే చర్చా కార్యక్రమంలో పాల్గొంటారు. రెండో రోజు ఈ భేటీలతో పాటు వివిధ జాతీయ అంతర్జాతీయ మీడియా సంస్థలు నిర్వహించే చర్చా కార్యక్రమాల్లో సిఎం పాల్గొంటారు. బ్లూమ్ బర్గ్ వంటి మీడియా సంస్థలకు ప్రత్యేక ఇంటర్వ్యూలు ఇవ్వడం ద్వారా ఎపి పాలసీల గురించి వివరిస్తారు. మూడవ రోజు కూడా పలు బిజినెస్ టైకూన్‌లతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. రోజుకు కనీసం పదికిపైగా భేటీలు, సమావేశాల్లో చంద్రబాబు పాల్గొనబోతున్నారు. నాలుగవ రోజు ఉదయం దావోస్ నుంచి జ్యూరిచ్‌కు చేరుకుని అక్కడి నుంచి స్వదేశానికి రానున్నారు. షెడ్యూల్ మీటింగ్స్‌తో పాటు... నాలుగు రోజుల సమయంలో పలువురు పారిశ్రామిక దిగ్గజాలతో ప్రత్యేక సమావేశాల్లో ముఖ్యమంత్రి బృందం పాల్గొంటుంది. సిఎం బృందంలో పరిశ్రమల శాఖా మంత్రి టీజీ భరత్, ఐటీ మంత్రి నారా లోకేష్‌తో పాటు ఇండస్ట్రీ శాఖ అధికారులు, ఇడిబి అధికారులు ఉన్నారు. 4 రోజుల దావోస్ పర్యటనలో బ్రాండ్ ఎపి ప్రమోషన్ తో పెద్దఎత్తున పెట్టుబడులకు మార్గం సుగమం చేసేందుకు సిఎం చంద్రబాబు ఆలోచనలు చేస్తున్నారు. దెబ్బతిన్న బ్రాండ్ పునరుద్ధరణతో మళ్లీ రాష్ట్రానికి దేశ, విదేశీ పెట్టుబడులు తెచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్రం ప్రభుత్వం గట్టి ప్రయత్నాలు చేస్తోంది. దీనికి ఈ పర్యటన దోహదం చేస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు జూరిచ్ విమానాశ్రయంలో తనకు స్వాగతం పలికిన యూరప్‌కు చెందిన తెలుగువారికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్‌వేదికగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. దావోస్‌లో తనకు స్వాగతం పలికిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు అంటూ సీఎం ట్వీట్ చేశారు.

**స్విస్ పారిశ్రామికవేత్తలతో సమావేశమైన మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్**

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఏపీలో మ్యానుఫ్యాక్చరింగ్, ఆర్ అండ్ డీ కేంద్రాలు, మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ప్రెసిషన్ ఇన్‌స్ట్రుమెంట్స్ తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని పారిశ్రామికవేత్తలను ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ కోరారు. పరిశ్రమల ఏర్పాటుకు పూర్తి అనుకూల వాతావరణం ఆంధ్రప్రదేశ్‌లో ఉందన్నారు. జ్యూరిచ్ లో స్విస్ పారిశ్రామికవేత్తలతో ఆయన సమావేశమయ్యారు.

ఎపిలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఏడు నెలల క్రితం ఏర్పాటైన ప్రగతిశీల ప్రభుత్వం ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలను అమలు చేస్తోందని లోకేశ్ వెల్లడించారు. దేశంలో మరెక్కడా లేనివిధంగా పారిశ్రామిక ప్రోత్సహకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో యూనిట్లు ఏర్పాటు చేసే సంస్థలకు 15 రోజుల్లో అన్ని అనుమతులు మంజూరు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు ప్రత్యేక వ్యవస్థను సిద్ధం చేసిందని పేర్కొన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు పూర్తి అనుకూలమైన వాతావరణం నెలకొని ఉంది. 1053 కిలోమీటర్ల సుదూర తీరప్రాంతం, విశాలమైన రోడ్లు, ఎయిర్ కనెక్టివిటీ, విశాఖపట్నం, కాకినాడ, కృష్ణపట్నం నౌకాశ్రయాలు ఉన్నాయి. మరో ఏడాదిన్నరలో భోగాపురం, మచిలీపట్నం, రామాయపట్నం పోర్టులు అందుబాటులోకి వస్తాయి. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డీప్‌టెక్ రంగాల్లో అధునాతన ఆవిష్కరణల కోసం ఎపి విశ్వవిద్యాలయాలతో కలిసి స్విస్ పరిశోధన సంస్థలు కలిసి పని చేయాలని విజ్ఞప్తి చేస్తున్నానని మంత్రి లోకేశ్ అన్నారు.ఏపీలో స్టార్టప్‌లను ప్రోత్సహించడం, సాంకేతికత బదిలీల కోసం ఇన్నోవేషన్ హబ్, ఇంక్యుబేటర్లు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని లోకేశ్ పారిశ్రామికవేత్తలను కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో స్విస్ వెకేషనల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ మోడల్ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసి రాష్ట్ర యువత నైపుణ్యాభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పుణేలో గెబిరిట్ తరహాలో ప్లంబింగ్ ల్యాబ్‌లు, శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని లోకేశ్ సూచించారు.

# పట్టుదలే అస్త్రంగా రెండోసారి పదవిలోకి ట్రంప్

**వాషింగ్టన్, జనవరి 20:** ఎన్నో ఆటుపోట్లు ఓటమి చవిచూసినా మళ్లీ ఓడినచోటే గెలవాలన్న ధైర్యం, కసి పట్టుదలతో రిపబ్లికన్ నాయకుడు డొనాల్డ్‌ట్రంప్ రెండోసారి అధ్యక్షుడుగా బాధ్యతలు స్వీకరించారు. ప్రచారంలోనూ వివాదాస్పద ప్రకటనలు, హామీలతో ట్రంప్ నిరంతరం వార్తల్లో నిలిచారు. మెక్సికో, కెనడాలపై 25శాతం సుంకాలు, మెక్సికోతో సరిహద్దు గోడనిర్మాణం, అక్రమ వలసలను కట్టడిచేస్తానని, గ్రీన్‌లాండ్‌ను కొనేస్తామని, కెనడా అమెరికాలో 51వ రాష్ట్రంగాచేరాలని ఇలా విభిన్న ప్రకటనలతో నిత్యం వార్తల్లో నిలిచిన ట్రంప్ ఎట్టకేలకు భారీ మెజార్టీతో గెలిచి రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా శ్వేతసౌధంలోకి అడుగుపెట్టారు. మంచి వ్యాపార వేత్తగా కూడా పేరున్న డొనాల్డ్ ట్రంప్ కుటుంబ నేపథ్యంకూడా విచిత్రంగానే ఉంది. న్యూయార్క్‌లోని క్వీన్స్‌లో మేరీ, ఫ్రెడ్ దంపతులకు 1946 జూన్ 14వతేదీ ట్రంప్ జన్మించారు. తండ్రి ఫ్రెడ్‌ట్రంప్ ఒక ప్రముఖ రియల్‌ఎస్టేట్ వ్యాపారి. ఐదుగురు సంతానంలో ట్రంప్ నాలుగో కుమారుడు. యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియాలోని వార్టన్‌స్కూల్ ఆఫ్ ఫైనాన్స్ అండ్ కామర్స్‌లో 1968లో పట్టా పొందారు. తండ్రికంపెనీలోనే 1971లో బాధ్యతలు స్వీకరించిన ట్రంప్ అనంతరం ట్రంప్ ఆర్గనైజేషన్‌గాపేరుమార్చారు. హోటల్స్, రిసార్టులు, నిర్మాణ రంగం, క్యాసినోలు, గోల్ఫ్‌కోర్సుల్లో ప్రవే శించి తన వ్యాపార సామ్రాజ్యం దశదిశలా విస్తరించారు. 2004లో ది అప్రెంటిస్ రియాల్టీ టివిషోతో దేశంమొత్తం పాపులర్ అయిపోయారు. క్రీడాకారిణి మోడల్ ఇవానాజెలింకోవాను మొదట పెళ్లిచేసు కున్న ట్రంప్ 1990లో ఆమెకువిడాకులిచ్చారు. వీరికి డొనాల్డ్ జూనియర్, ఇవాంకా, ఎరిక్‌లు సంతానం. ఆ తర్వాత నటి మార్లా మార్పెల్స్‌ను 1993లో పెళ్లిచేసుకున్న ట్రంప్ 1999లో ఆమెతో విడాకులు తీసుకున్నారు. వీరి కుమార్తె టిఫానీట్రంప్. స్లోవేనియాకు చెందిన మాజీ మెడల్ మెలాని యాను 2005లో ట్రంప్ పెళ్లాడారు. వీరికుమారుడు బారన్ విలియమ్‌ట్రంప్. కాగారిపబ్లికన్ పార్టీ తరపున 2016 అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేసిన ట్రంప్ డెమొక్రటిక్ నేత హిల్లరీ క్లింటన్‌పై విజయం సాధించారు. 2020 ఎన్నికల్లో బైడెన్ చేతిలో ఓటమి చెందినట్రంప్ 2024లోనూ బరిలోకి దిగారు. డెమొక్రట్ అభ్యర్థి ఉపాధ్యక్షురాలు కమలా హానయరిస్‌పై విజయం సాధించి రెండోసారి అధ్యక్షపీఠం కైవసంచేసుకున్నారు.

## దిగిపోతూ కూడా క్షమాభిక్ష ప్రసాదించిన బైడెన్

**వాషింగ్టన్, జనవరి 20:** అమెరికా అధ్యక్షపదవీకాలం మరికొన్ని గంటల్లో ముగుస్తున్న వేళ జోబైడెన్ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ట్రంప్ పదవిలోకి వచ్చిన తర్వాత బైడెన్ హయాంలోపనిచేసిన వారిపై కక్షసాధింపు చర్యలకు దిగకుండా పదవినుంచి దిగిపోయే కొన్ని గంటలముందుకూడా ఉత్తర్వులపై జోబైడెన్ సంతకాలుచేసారు. గతంలో ట్రంప్‌ను విమర్శించిన అమెరికా వైద్యనిపుణుడు డాక్టర్ ఆంటోని ఫౌచీ, రిటైర్డ్ జనరల్ మార్క్ మిల్లే తదితరులకు ముందస్తుక్షమాభిక్ష ఆదేశాలు జారీచేసారు. వీరితోపాటు క్యాపిటల్ హిల్ దాడులపై విచారణజరిపిన హౌస్‌కమిటీసభ్యులకూ ఉపశమనం కల్పించారు.

## అమెరికా అధ్యక్షుని వార్షిక వేతనం నాలుగు లక్షల డాలర్లు

**వాషింగ్టన్, జనవరి 20:** ప్రపంచదేశాలకు పెద్దన్నగా వ్యవహరిస్తున్న అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్‌ట్రంప్ ప్రమాణస్వీకారం చేసిన తర్వాత ఇపుడు ఆయన జీతభత్యాలపై అందరికీ ఉత్కంఠపెరిగింది సోషల్‌మీడియా సైట్లలోకూడా వీటిపైనే ఎక్కువ సెర్చింగ్‌కనిపిస్తోంది. అధ్యక్షుడికి వచ్చే జీతభత్యాలు, ఇతర అలవెన్సులపై నెట్టింట సెర్చింజన్లు ఖాళీలేకుండా కొనసాగుతున్నాయి. దేశాధ్యక్షపదవి చేపట్టిన వారికి ఏడాదికి నాలుగు లక్షల డాలర్లుగా జీతం వస్తుంది. అంటే భారత కరెన్సీలో 3.36 కోట్లరూపాయలు. నెలకు 28 లక్షలరూపాయలు వేతనంగా అధ్యక్షుడికి లభిస్తుంది. ఇతర ఖర్చులకింద మరో 50 వేల డాలర్లు అంటే రూ.42 లక్షలరూపాయలు లభిస్తుంది. ప్రయాణ ఖర్చులుగా లక్షడాలర్లు అంటే సుమారు 84 లక్షలు వినోదంకోసం 19 వేల డాలర్లు అంటే రూ.16 లక్షలు దేశాధ్యక్షుడికి చెల్లిస్తారు. అధ్యక్షుడుగా ఎన్నికైన వెంటనే కొత్త అధ్యక్షుడు వైట్‌హౌస్ అధికారిక నివాసంలోకి మారతారు. వారికి నచ్చినవిధంగా మార్చుకోడానికి ప్రభుత్వం లక్షడాలర్లు అంటే భారత కరెన్సీలో రూ.84 లక్షలుచెల్లిస్తుంది. ఇక అధ్యక్షుడి అధికారిక పర్యటనలకోసం ఆధునిక సాంకేతికత, భద్రత కలిగిన ది బీస్ట్‌కారు, మెరైన్‌వన్ హెలికాప్టర్, ఎయిర్‌ఫోర్స్‌వన్ విమానాన్ని ఉపయోగిస్తారు. దేశాధ్యక్షుడికి వంటచేసి పెట్టేందుకు ఎగ్జిక్యూటివ్ చెఫ్ ఉంటారు. ప్లంబర్, ఫ్లోరిస్ట్ హౌస్‌కీపింగ్ ఇలా ఇతర పనులుచేసేందుకు కనీసం 100 మందిసహాయకులు కూడా ఉంటారు. ఇక అధ్యక్షుడి పదవీకాలం పూర్తి అయినతర్వాత మాజీ అధ్యక్షులకు ఏటా 2.30 లక్షల డాలర్లు అంటే సుమారు రూ.1.93 కోట్లు భారత కరెన్సీలోచూస్తే ఆ మొత్తం డాలర్లలో చెల్లిస్తారు. అది కేవలం పింఛన్ మాత్రమే. దీనితోపాటు ఆరోగ్యబీమా, ప్రయాణసౌకర్యాలు లభిస్తాయి. ఇక దేశ ఉపాధ్యక్షుడుగా వచ్చిన నాయకుడికి 2.35 లక్షల డాలర్లు అంటే భారత కరెన్సీలో రూ.1.97 కోట్లు వార్షికవేతనం లభిస్తుంది.



అమెరికా అధ్యక్షుడిగా పదవీ విరమణ చేసిన బైడెన్ దంపతులతో కొత్త అధ్యక్షుడు ట్రంప్ దంపతులు

# అమెరికాలో ఇక స్వర్ణయుగం

>> రోజు వచ్చిందని రెండోసారి అధ్యక్షపదవిని చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అమెరికాను ప్రపంచ వేదికపై మరింత గొప్పదేశంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యమని, అమెరికా ఫస్ట్ మా నినాదం ఎప్పటికీ మారదని ట్రంప్ అన్నారు. తాను ప్రమాణస్వీకారంచేసిన రోజును జాతీయ విముక్తిదినోత్సవంగా ఆయన అభివర్ణించారు. అనేక ఆటుపోట్లను తట్టుకుని మనదేశం నిలిచిందని,సమస్యలు సవాళ్లు అనేకం ఎదురయినా తట్టుకుని ధైర్యంగా నిలిచామన్నారు. నేటినుంచి అమెరికా ప్రజలకుస్వర్ణయుగం ప్రారంభం అయిందన్నారు. అమెరికా ఇక ప్రపంచదేశాలనుంచి మరింత గౌరవం పొందుతుందని, ముందు దక్షిణ అమెరికా సరిహద్దుల్లో జాతీయ అత్యవసరపరిస్థితిని ప్రకటిస్తున్నట్లు ప్రకటించారు. అక్రమ వలసలను అరికట్టి పత్రాలు లేని అక్రమవలసదారులందరినీ ఎంతటి ఒత్తిడి వచ్చినా సరే వెనక్కి పంపించేస్తామని, పత్రాలు లేనివారు అమెరికాలో నేరస్తులేనని నేరస్తులకు ఇక్కడ తావులేదన్నారు. విద్యా ఆరోగ్యరంగాల్లో అనేకసంస్కరణలు తీసుకురావాల్సి ఉందన్నారు. నేరాలు చేస్తున్న ముఠాలతో మరింత కఠినంగా చర్యలుచేపడతామన్నారు. ఇకపై రెస్టారెంట్లలో కూడా కాల్పులు ఘటనలు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలుంటాయన్నారు. ఉత్పత్తిరంగం ఏదేశ అభివృద్ధికి అయినా కీలకంగా ఉంటుందని, ద్రవ్యోల్బణంఅరికట్టి, దేశ ఆర్థికవృద్ధిని మరింతగాపెంపొందించేందుకు ఉత్పత్తి రంగానికి మరింత వెన్నుదన్నుగా నిలుస్తామని, దేశంలో విద్యుత్ వాహనాల తయారీని మరింతగా పెంచుతామన్నారు. ప్రతిభావంతులకు మాప్రోత్సాహం ఎంతోఉంటుందని, ఎలాంటి వివక్షను చూపించబోనన్నారు. పర్యావరక్షణ పరిరక్షణ, వాతావరణంలో కాలుష్యఉద్గారాలు తగ్గింపుదిశగానే వెళతామని, ఆదిశగానే విద్యుత్ వాహన తయారీని చేపడతామన్నారు. అలాగే దేశం ఇంధనరంగపరంగా స్వయంసమృద్ధిని సాధించడంతోపాటు ప్రపంచ దేశాలకు అమెరికానుంచే చమురు, సహజవాయు ఎగుమతులు సాగే విధంగా మన ప్రణాళికలు ఉంటాయని, దిగుమతులకు చెక్‌పెట్టి ఎగుమతిచేసే స్థాయికి మన ఉత్పత్తులు ఉండేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ముందుగా అందరూ ఊహించనట్లుగానే ప్రపంచస్థాయిలో పది ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ల జారీని ప్రస్తావించారు. అమెరికాలో కేవలం రెండేరెండు వర్గాలు కొనసాగుతాయని, పురుషులు, మహిళలని మరో లింగ ఉత్పత్తికి తావులేదన్నారు. క్రీడల్లో ట్రాన్స్‌జెండర్లను మహిళా క్రీడలకు అనుమతించనన్నారు. దేశరక్షణరంగాన్ని మరింతగా బలోపేతంచేస్తానని శపథంచేసారు. న్యాయవ్యవస్థనుప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని, ఆ వ్యవస్థను కొందరు దుర్వినియోగంచేసారన్నారు. అందరికీ సమన్యాయం పద్ధతిలో సంస్కరణలు తెస్తామనిచెప్పారు. ఆ భగవంతుడు, అమెరికాప్రజల ఆశీస్సులతోనే ప్రాణాలనుంచి బయ టపడగలిగానని, అమెరికా ప్రజలమద్దతుతోమరిన్ని సంస్కరణల దిశగా దేశాన్ని ముందుకు నడిపిస్తానన్నారు.

ముందు అత్యవసరంగా మెక్సికో సరిహద్దుల్లో జాతీయ అత్యవసర్థితిని ప్రకటిస్తు న్నట్లు ట్రంప్ అన్నారు. ఆప్రాంతానికి సాయుధ బలగాలను పంపిస్తామని, కోర్టు విచారణ తేదీలకు వేచి ఉండాలని, ఆశ్రయం పొందేవారికి హుకుం జారీ అవుతుందని అన్నారు. అలాగే బర్త్‌రైట్ పౌరసత్వం కూడా రద్దుచేస్తామని, న్యాయనిపుణుల సలహాలు తీసుకుని ఈజన్మతహ పౌరసత్వ నిర్ధారణపై కార్యాచరణకు వెళతామన్నారు. ముందుగా అమెరికా పారిస్ వాతావరణ ఒప్పందంనుంచి బయటకు వస్తామన్నారు. విదేశీ ఉత్పత్తులపై సుంకాలు తప్పవని అమెరికా పాలసీ ప్రకారం కేవలం రెండేరెండు లింగనిష్పత్తులకు గుర్తింపు ఉంటుందన్నారు. చమురు సహజవాయు ఉత్పత్తికిగాను జాతీయ ఇందన అత్యవసర స్థితిని కూడా అమలులోకి తెస్తామన్నారు. ఇప్పటికిప్పుడు గల్ఫ్ ఆఫ్ మెక్సికోను గల్ఫ్‌ఆఫ్ అమెరికాగా నామకరణంచేస్తామని స్పష్టంచేసారు. అదేవిధంగా పనామాకాలువ, గ్రీన్‌ల్యాండ్‌లను వెనక్కితీసుకుంటామని ప్రకటించారు. అభివృద్ధిలో అమెరికా క్షీణతకు ఇక కాలం చెల్లిందని అతివాద, అవినీతి వ్యవస్థలను పూర్తిగాప్రక్షాళన చేసి అభివృద్ధిలో ముందుకు నడిపిస్తామని ట్రంప్ ప్రకటించారు.

## ట్రంప్ 2.0 పట్టాభిషేకం

>> హిల్లరీ క్లింటన్, జార్జిడబ్ల్యుబుష్, లారాబుష్ తదితరులు హాజరుకాగా బరాక్ ఒబామా హాజరయినప్పటికీ మిషెల్లీ ఒబామా మాత్రం ఈ వేడుకకు రావడంలేదని ముందేప్రకటించారు. ప్రమాణస్వీకారం సందర్భంగా ముందుగా సంగీతకచేరిలు, మిలిటరీ పెరేడ్‌లు, ట్రంప్ మద్దతుదారుల ర్యాలీలతో క్యాపిటల్‌హిల్స్ మార్గాలన్నీనిండిపోయాయి.

# క్లస్టర్ వ్యవస్థకు కొత్త రూపు

>> కలెక్టర్లు ఇచ్చే నివేదికలను రాష్ట్ర కమిటీ పరిశీలించిన తర్వాత పంచాయతీల క్లస్టర్ గ్రేడ్లను ప్రభుత్వానికి నివేదిస్తుంది. గ్రేడ్ల ఆధారంగా పంచాయతీ, సచివాలయ సిబ్బందిని పంపిణీ చేయడానికి మార్గదర్శకాలను రూపొందిస్తారు.గ్రామ పంచాయతీ, సచివాలయ సిబ్బందిని సమన్వయం చేసుకొని కొత్త క్లస్టర్ గ్రేడ్ల విభజన విధానంలో సిబ్బందిని నియమించుకోవడంపై పవన్ అధికారులతో చర్చించారు. ఈ విధంగా చేయడం వల్ల మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాలు అమలు, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణతో పాటు గ్రామ పంచాయతీల ప్రాథమిక బాధ్యత అయిన తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, అంతర్గత రోడ్ల నిర్మాణం, పారిశుద్ధ్య మెరుగుదలకు తగినంత మంది సిబ్బంది ఉంటారన్నారు. వీటిపై అధ్యయనం చేసి పంచాయతీల్లో పరిపాలన సులభతరం చేసేందుకు అవసరమైన సిఫార్సులు చేసేందుకు కమిటీ వేయాలని పవన్ నిర్ణయించారు. కొత్త క్లస్టర్ల విభజన, గ్రేడ్ల కేటాయింపుపై ప్రభుత్వానికి ఈ కమిటీ సిఫార్సులు చేయనుంది. పంచాయతీల్లో సిబ్బంది నియామకం విషయంలో హెచ్చుతగ్గులు లేకుండా, సేవలు నిరంతరాయంగా ప్రజలకు అందేలా చూడాలని అధికారులకు పవన్ ఆదేశాలు ఇచ్చారు. ఆదాయం ఎక్కువగా ఉన్న పంచాయతీల్లో జనాభా తక్కువగా ఉండి, ఆదాయం తక్కువగా ఉన్న పంచాయతీల్లో జనాభాగా ఎక్కువగా ఉండే పరిస్థితుల్లో పాత క్లస్టర్ వ్యవస్థ వల్ల సిబ్బంది నియామకం విషయంలో తలెత్తుతున్న ఇబ్బందులపై పవన్ చర్చించారు.ఈ సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, కమిషనర్ కృష్ణ తేజ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు

## జాతీయ రహదారి విస్తీర్ణం కుదింపు

>> ధానం కూడా ఉండదు. రాష్ట్రంలోని ఫిషింగ్ హార్బర్లు, నౌకాశ్రయాలను జాతీయ రహదారులతో అనుసంధానించే ప్రాజెక్టులను ఎన్‌హెచ్‌ఏఐ మంజూరుచేస్తోంది. ఇందులోభాగంగానే నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ నుంచి చందోలు, నారాకోడూరు మీదుగా గుంటూరు శివారులో ఉన్న బుడంపాడు వద్ద కోల్‌కతా చెన్నై జాతీయరహదారి వరకు మొత్తం 53 కి.మీ. హైవే నిర్మించేందుకు సంబంధిత అధికారులు ఎలైన్‌మెంట్‌ను సైతం సిద్ధం చేశారు. ఇది నాలుగు వరుసల హైవేగా ఉంటుంది. ఇంతలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) కొత్త మెలికపెట్టింది. హార్బర్ నుంచి విబీలకు కలపడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇందుకోసం దగ్గరలో ఉన్న కత్తిపూడి ఒంగోలు ఎన్‌హెచ్‌లోని చందోలు వరకు 18 కి.మీ. హైవే నిర్మిస్తే చాలని సూచించింది. దీంతో ప్రస్తుతం ఈ ఎలైన్‌మెంట్ ప్రతిపాదననూ సైతం అధికారులు సిద్ధం చేశారు. అయితే ఈ రెండింటిలో ఎన్‌హెచ్‌ఏఐ దేనికి మొగ్గుచూపుతుందనేది కీలకం కానుంది.

# వాట్సప్ గవర్నెన్స్ త్వరలో అమలు

>> సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు పౌరులకు మరింత సులభతరం చేయాలనే సదాశయంతో ముఖ్యమంత్రి వాట్సాప్ గవర్నెన్స్ సదుపాయాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంకల్పించారన్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన ఆర్టీజీఎస్ అధికారులను సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. వాట్సాప్ గవర్నెన్స్‌లో భాగంగా జనన మరణ ధృవీకరణ పత్రాల సేవలు కల్పించడమనేది కీలకమైందని, దీనికి సంబంధించిన పనులు త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ సేవలను పగడ్బందీగా ప్రజలకు అందిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. తెనాలీలో ముందుగా దీన్ని ప్రయోగాత్మకంగా పరిశీలించాలని సూచించారు. అక్కడ క్షేత్రస్థాయిలో ఎదురయ్యే ఇబ్బందులు, సాంకేతికంగా ఎదురయ్యే ఇబ్బందులను సునిశితంగా పరిశీలించి అధ్యయనం చేసి తదనుగుణంగా ఈ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. దీనికి కావాల్సిన అన్ని విధాల సహకారాన్ని పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖ, పురపాలక శాఖలు ఆర్టీజీఎస్ అధికారులకు అందించాలని సూచించారు. ఆర్టీజీ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ మాట్లాడుతూ వాట్సాప్ గవర్నెన్స్‌ను అమలు చేయడానికి కావాల్సిన ఏర్పాట్లన్నీ ఆర్టీజీఎస్ సిద్ధం చేసిందన్నారు. జనన మరణ ధృవీకరణ పత్రాలు వాట్సాప్ ద్వారా జారీ చేసే ప్రక్రియ కూడా క్షేత్రస్థాయిలో ఎలాంటి లోపాలకు తావివ్వకుండా చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆర్టీజీఎస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కె. దినేష్ కుమార్ మాట్లాడుతూ ఈ నెలలోనే తెనాలీ మండలంలోని మొత్తం పంచాయతీల్లో, తెనాలీ పురపాలక సంఘంలో వాట్సాప్ ద్వారా జనన మరణ ధృవీకరణ పత్రాల జారీకి సంబంధించిన సాంకేతిక ప్రక్రియను ప్రయోగాత్మకంగా పరిశీలించి చూస్తామన్నారు. వాట్సాప్ ద్వారా ఈ సర్టిఫికెట్ల జారీ కొరకు ఆర్టీజీఎస్ ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ పేరిట ఒక పోర్టల్‌ను రూపొందించామన్నారు. ఇందులో జనన మరణ నమోదు డేటా మొత్తం అనుసంధానం చేస్తున్నామని తెలిపారు. డాటా లేక్ ఏర్పాటు పనులు కూడా చురుగ్గా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఒకసారి జనన, మరణ ధృవీకరణ పత్రం జనరేట్ అయితే ఆ వెంటనే సంబంధిత పౌరుల వాట్సాప్‌కు సందేశం పంపడంతో పాటు, ఆ వెంటనే వాట్సాప్ ద్వారానే ఈ పత్రాలు డౌనులోడు చేసుకునే సదుపాయం కూడా కల్పిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, పురపాలక శాఖ కార్యదర్శి కె. కన్నబాబు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ. సూర్యకుమారి, పంచాయతీరాజ్ శాఖ సంచాలకులు కృష్ణ తేజ, గ్రామవార్డు సచివాలయ శాఖ సంచాలకులు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఐపిఎస్‌ల బదలీ

>> యాంటి టాస్క్‌ఫోర్స్ ఎస్పీగా నియమించారు. గ్రేహౌండ్స్ డిజిగా బాబ్జీ, ఎసిబి డైరెక్టర్‌గా రాజ్యలక్ష్మి, అల్లూరి సీతారామరాజు అదనపు ఎస్పీగా ధీరజ్, సిఐడి ఎస్పీగా శ్రీదేవిరావు చక్రవర్తి, లీగల్, హ్యూమన్‌రైట్స్ కో ఆర్డినేషన్ ఎస్పీగా సుబ్బారెడ్డి, ఇంటెలిజెన్స్ ఎస్పీగా రామ్మోహన్‌రావు, స్పోర్ట్స్ అండ్ వెల్ఫేర్ డీఐజీగా అంబురాజన్‌లను బదిలీ చేశారు.

## ఎన్‌కౌంటర్‌లో తప్పించుకున్న బడే చొక్కారావు

**హైదరాబాద్, జనవరి 20, ప్రభాతవార్త:** ఛత్తీస్‌ఘడ్‌లోని బీజాపూర్ జిల్లా పూజారి కాంకెర్‌లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ అగ్రనేత పార్టీ తెలంగాణ కార్యదర్శి బడే చొక్కారావు తప్పించుకున్నట్లు ఛత్తీస్‌ఘడ్‌తో పాటు తెలంగాణ పోలీసులకు సమాచారం అందినట్లు తెలిసింది. మొదట ఈ ఎన్‌కౌంటర్‌లో చొక్కారావు మ రణించినట్లు వార్తలు రావడం తెలిసిందే. అయితే దీనిని తెలంగాణ పోలీసులు ధృవీకరించకపోగా ఛత్తీస్‌ఘడ్ పోలీసులు మౌనం వహించారు. కాగా ఈ ఎన్‌కౌంటర్‌లో చొక్కారావు పోలీసులకు దొరకకుండా తప్పించుకున్నట్లు తాజాగా ఇరు రాష్ట్రాల పోలీసులకు సమాచారం అందినట్లు తెలిసింది. దీంతో చొక్కారావు మరణించాడన్న ఊహాగానాలకు పుల్‌స్టాప్ పడింది.

# చట్ట సభలు మెరుగుపడాలి

>> పరిరక్షించేందుకు మార్గదర్శక సూత్రాలు రూపొందించవలసిందిగా రాజకీయ పార్టీలకు ఆయన విజ్ఞప్తి చేశారు. స్టాండింగ్ కమిటీలు మినీ పార్లమెంట్‌లు. వాటి పని తీరును పటిష్ఠం చేయవలసిన ఆవశ్యకత ఉంద్ది అని ఓమ్ బిర్లా సూచించారు. 85వ ఎఐపిఒసికి రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ్, బీహార్ అసెంబ్లీ స్పీకర్ నంద్ కిశోర్ యాదవ్, బీహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి, దేశం అంతటి నుంచి రాష్ట్ర శాసనసభల అధిపతులు హాజరయ్యారు. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ సోమవారం ఉదయం ఓమ్ బిర్లాతో భేటీ అయ్యారు. కానీ '75వ రాజ్యాంగ వార్షికోత్సవం' రాజ్యాంగ విలువల పటిష్ఠతలో పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల కృషి అంశంపై రెండు రోజుల సమ్మేళనానికి ఆయన విచిత్రంగా గైర్‌హాజరయ్యారు. పిఆర్‌ఎస్ లెజిస్లేటివ్ అధ్యయనం ప్రకారం, కాలపరిమితి ముగుస్తున్న ఢిల్లీ శాసనసభ తన ఐదు సంవత్సరాల హయాంలో 74 సమావేశాలు నిర్వహించింది. అంటే సగటున ఏడాదికి 15 రోజుల సమావేశం అయిందని చెప్పారు. సభ సమావేశమైన రోజుల్లో అది సగటున మూడు గంటలు భేటీ అయింది. సభ తన హయాంలో కేవలం 14 బిల్లులు ఆమోదించింది. పూర్తి కాలం పనిచేసిన గత ఏ అసెంబ్లీకైనా అది అత్యల్ప సంఖ్య అని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా పాట్నాలో జరుగుతున్న 85వ ఆల్ ఇండియా ప్రిసైడింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ (ఎఐపిఒసి)లో తెలంగాణ శాసన బృందంపాల్గొంటున్నది. అఖిల భారత సభాపతుల సమ్మేళనంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, లేజిస్లేచర్ సెక్రటరీ డా. వి.నరసింహాచార్యులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సమ్మేళనం ప్రారంభానికి ముందు లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ శాసన బృందాలు మర్యాదపూర్వకంగా కలిశాయి.

# సంజయ్ రాయ్‌కి జీవిత ఖైదు

>> శిక్ష వర్తించదని న్యాయమూర్తి అనిర్బన్‌దాస్ అన్నారు. అలాగే పశ్చిమబెంగాల్‌ప్రభుత్వం రూ.17 లక్షలరూపాయలు మృతురాలి తల్లితండ్రులకు ఇవ్వాలని ఆదేశించింది. అయితే కోర్టురూమ్‌లోనే ఉన్న ఆమె తల్లితండ్రులు ముకుళిత హస్తాలతో తమకు పరిహారం వద్దని న్యాయం కావాలని కోరారు. చట్టప్రకారం ఉన్న అంశాలను పరిగణనలోనికి తీసుకుని ఆదేశాలిచ్చామని ఎప్పుడు అవసరం అనిపించినా ఆ సొమ్ము వాడుకోవచ్చన్నారు. అయితే జడ్జి మరోవివరణ ఇస్తూ మృతురాలి కుటుంబం ఈ మొత్తం తమ కుమార్తె హత్యాచారానికి పరిహారంగా ఇస్తున్న సొమ్ముగా భావించవద్దనిసూచించారు. భారతీయ న్యాయసంహిత పరిధిలో అత్యాచారం హత్య సెక్షన్లకింద విచారణజరిపి శిక్ష విధించారు. అంతకుముందు కోర్టులో రాయ్ తరపున తుదివిడత వాదనలు విన్నారు. తానీ నేరం చేయలేదని, తనను ఈ కేసులో ఇరికించారని, అనేక అంశాలను, సాక్ష్యాలను ధ్వంసంచేసారని, తానేకనుక ఈ నేరం చేసి ఉన్నట్లయితే నా రుద్రాక్షమాల తెగిపోయి ఉండేదని, నన్ను ఇరికించింది లేనిదీ మీరే నిర్ణయించాలని కోర్టుకు రాయ్ నివేదించాడు. తనతో బలవంతంగా సంతకాలుచేయించుకున్నారని కూడా చెప్పాడు. నాకు వచ్చిన సాక్ష్యాధారాల ఆధారంగా నేను ఇపుడు తీర్పు ఇవ్వడానికి సిద్ధం అయ్యానని, నేను మీ వాదనను మూడు గంటలపాటు విన్నానని, మీన్యాయవాది మీకేసును వాదించారని, మీపై అభియోగాలు రుజువయ్యాయని, శిక్షపై మీ అభిప్రాయం మాత్రమే నేను వింటానని న్యాయమూర్తి అన్నారు. కోల్‌కత్తా పోలీసులనుంచి కేసును స్వీకరించి దర్యాప్తుచేపట్టిన తర్వాత సిబిఐ రాయ్‌కు మరణశిక్ష విధించాలని డిమాండ్‌చేసింది. ఆసుపత్రికి తరచూ వస్తూపోతూ ఉండే సివిక్ వలంటీర్ అని సిబిఐ తరపున వాదించిన న్యాయవాది తన వాదనల్లో ఇది అత్యంత అరుదైన కేసుల్లోనే అరుదైనదని అందువల్ల రాయ్‌కి మరణశిక్ష వేయాలనికోరారు. డాక్టర్లు, సిబ్బంది, మానవహక్కుల సంఘాల ప్రతినిదులు ఇతర అనేకమంది అన్నివర్గాలకు చెందినవారితో కోర్టు ఆవరణ మొత్తం నిండిపోయింది. పోలీసులు భారీ ఎత్తున బందోబస్తు ఏర్పాటుచేసారు. కోర్టు హాలులో మృతురాలి తల్లితండ్రులు మాట్లాడుతూ సిబిఐ దర్యాప్తుతో తమకు సంతృప్తిలేదని మరికొందరు కుట్రదారులను వెలికితీయలేదని న్యాయంముందుకు వారుసైతం రావాల్సిందేనని అన్నారు. కేవలం ఒకే ఒక్క వ్యక్తి ఈసంఘటనలో పాల్గొనలేదని సిబిఐ ఇతరులను పట్టుకోవడంలో విఫలం అయిందని అన్నారు. ఇలాంటి నేరస్తులకు జీవించే హక్కులేదని, అందువల్లనే ఇలాంటినేరాలు సొసైటీలో పునరావృతం కాకుండా మనం నిరోధించాలని మృతురాలి తల్లి అన్నారు. 34 ఏళ్ల పోస్టుగ్రాడ్యుయేట్ ట్రైనీ డాక్టర్ ఆసుపత్రిలోని సెమినార్ హాలులో విగత జీవిగా అర్ధనగ్నంగా పడింది. ఈసంఘటన దేశవ్యాప్తంగా నిరసనలకు దారితీసింది. వైద్యులు, సిబ్బంది నిరవధిక సమ్మెలకు సైతం దిగారు. కాగా ఈకేసులో అరెస్టు అయిన కళాశాల మాజీ ప్రిన్సిపాల్ పాండే, కళాశాల వద్ద ఉన్న పోలీస్ ఎస్‌హెచ్‌ఒ అభిజిత్‌మోండల్‌ను పోలీసులు అరెస్టుచేసినా తర్వాత 90 రోజుల్లోపు ఛార్జిషీటు దాఖలుచేయకపోవడంతో వారికి బెయిల్ మంజూరయింది.

## వారం - వర్జ్యం

తేది : 21-01-2025, మంగళవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
పుష్యమాసం, ఉత్తరాయణం,
హేమంత ఋతువు, కృష్ణపక్షం,
సప్తమి మ.12.40
చిత్త రా.11.36
వర్జ్యం : ఉ.5.53-7.41
దు.ఉ.9.04-9.49, 2) రా.10.34-11.19
శుభసమయం: ఉ.7.45-8.15
సా.4.50-5.30
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** గృహప్రవేశాది శుభకార్యాలను అనుకున్న విధంగా పూర్తి చేయగలుగుతారు. వస్తులాభం.

**వృషభం:** ఆదాయ వ్యయాలు సరిసమానంగా ఉంటాయి. పుణ్య క్షేత్రాలను సందర్శిస్తారు. మిత్రుల కలయిక.

**మిథునం:** ఉన్నతాధికారులతో మాట్లాడేటప్పుడు సంయమనం పాటించండి. విదేశీ పర్యటనలు.

**కర్కాటకం :** కొన్ని సందర్భాలలో అభిప్రాయ భేదాలు చోటు చేసుకునే సూచనలున్నా యి. ధనలాభం.

**సింహం:** అన్యభావాలు నేర్చుకోవాలనుకునే మీ అభిలాష ప్రయత్నం మీద సానుకూల పడుతుంది.

**కన్య :** వృథా ఖర్చులను సూచిస్తోంది. సేవా కార్యక్రమాలలో పాలుపంచుకుంటారు. వాహన సౌఖ్యం

**తుల :** క్లిష్టతరమైన కార్యక్రమాలు మినహా తేలికగా సాగేటటువంటి వ్యవహారాల పైన దృష్టిని సారిస్తారు.

**వృశ్చికం:** కుటుంబ సభ్యుల సహాయ సహకారాలను సంపూర్ణంగా అందుకుంటారు. విందు, వినోదాలు.

**ధనుస్సు:** వ్యాపారస్థులకు మధ్యస్థ ఫలితాలు గోచరిస్తున్నాయి. నూతన అవకాశాలు లభిస్తాయి.

**మకరం:** కీలకమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు నిష్ణాతుల సలహాలను పరిగణలోనికి తీసుకోండి.

**కుంభం:** అగ్రిమెంట్లు ముఖ్యమైన సంతకాలు చేసేటప్పుడు సాంకేతిక లోపాలు చోటు చేసుకోకుండా జాగ్రత్త పడండి.

**మీనం :** కీడెంచి మేలెంచమన్న విధంగా ఆలోచనా శైలి ఉంటుంది. ఆరోగ్యం పట్ల జాగ్రత్త.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

21-01Pg3exHMNWJQEPK.qxd:21-01Pg3exHMNWJQEPK.qxd 01/01/01 8:53 AM Page 1



# హెచ్ఐవి నివారణలో 'రెడ్ రన్'

**విజయవాడ జనవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి నుండి హెచ్ఐవి నివారణలో భాగంగా అందరికీ అవగాహన కల్పించాలని గత అక్టోబరు నెలలో రెడ్ రన్ కార్యక్రమం నిర్వహించారు అందులో గెలుపొందిన విజేతలను గోవాలో నిన్న 18 న జరిగిన జాతీయస్థాయి రెడ్ రన్ పోటీలకు పంపించడం జరిగింది. అందులో ఎం.నరేష్ రెండవ బహుమతిని టి/జి కేటగిరీలో గెలుపొందడం జరిగింది. డాక్టర్. ఎ.సిరి ఐఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి చేతుల మీదుగా 35000. బహుమతి నీ మెమోంటో ను అందించడం జరిగింది. డాక్టర్. సరస్వతీ దేవి. ఎపిడి, డాక్టర్ టి.మంజుల జెడి ఐఇసి డాక్టర్. కామేశ్వర ప్రసాద్ జెడి బిఎస్డి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ అభినందనలు తెలియజేశారు.

## జనసేన కార్యాలయంపై డ్రోన్ అది ప్రభుత్వానిదే!

**విజయవాడ జనవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి:** మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంపై ఎగిరిన డ్రోన్ కేసు వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆ డ్రోన్‌ను పోలీసులు గుర్తించారు. అది ఏపీ ఫైబర్ నెట్ సంస్థదిగా తేల్చారు. రెండ్రోజులుగా ఈ కేసులో పోలీసులు లోతుగా విచారణ చేపట్టారు. ట్రాఫిక్, పారిశుద్ధ్య కాల్వల నిర్వహణ, రహదారుల స్థితిగతులపై ప్రభుత్వం అధ్యయనం చేపడుతోంది. పైలట్ ప్రాజెక్టులో భాగంగా మంగళగిరిలో అధ్యయనం చేస్తోంది. పలు రకాల సర్వేలకు డ్రోన్లను వినియోగిస్తున్నారు. ఇందులో భాగంగానే డ్రోన్ ఎగిరినట్లు గుర్తించారు.



పశువైద్యశిబిరంలో మంత్రి అచ్చెన్నాయుడు

# పశుసంవర్ధకాభివృద్ధికి కృషి

## వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ జనవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి:** పశువుల సంక్లిష్ట వ్యాధులకు గురి కాకుండా వాటి కోసం ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ పశుసంవర్ధక శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం చిర్రావురు గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు రాష్ట్ర వ్యవసాయ పశుసంవర్ధక శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వ హిస్తున్నట్లు వెల్లడించిన మంత్రి అచ్చెన్నా యుడు. నట్టల నివారణ మందుల పంపిణీ, గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, పశువ్యాది నిర్ధారణ పరీక్షలు వ్యాధి నిరోధక టీకాలు, శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు మంత్రి అచ్చెన్నా యుడు. పేర్కొన్నారు. పశువుల సంరక్షణ పూర్తి స్ధాయిలో చర్యలు తీసు కుంటున్నట్లు తెలిపారు.

వ్యవసాయం. పశు సంవర్ధకంశాలపై సీఎం చంద్రబాబు పూర్తి స్ధాయిలో దృష్టి కేంద్రీకరించినట్లు తెలిపారు. పశువుల మంచి బ్రిడింగ్‌కు ప్రోత్సా హం ఇస్తామన్నారు. సంచార పశు వైద్యశాలలను పెంచుతున్నామన్నారు. రైతు సేవా సంస్థల ద్వారా అన్నదాతలకు అండగా ఉంటామన్నారు.

# జగన్ బెయిల్ రద్దుపై రఘురామ పిటిషన్..

## సుప్రీంకోర్టులో విచారణ..

**విజయవాడ జనవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి:** సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటు చేసుకుంది. వైకాపా అధ్యక్షుడు జగన్ బెయిల్ రద్దు , కేసుల ట్రయల్ విచారణ ధర్మాసనం మార్పు చేయాలని కోరుతూ ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు రిజస్ట్రీ నిర్ణయం తీసుకుంది. గతంలో విచారించిన జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్ ధర్మాసనం నుంచి జస్టిస్ బీవీ నాగరత్న జస్టిస్ సతీష్ చంద్రశర్మ ధర్మాసనానికి రిజిస్ట్రీ మార్చింది. ఈ నేపథ్యంలో జస్టిస్ బీవీ నాగరత్న జస్టిస్ సతీష్ చంద్రశర్మ ధర్మాసనం ముందు రఘురామ జగన్, సీబీఐ తరపున వాదనలు జరిగాయి. గత 12 ఏళ్లుగా ట్రయల్ ఒక్క అడుగు కూడా ముందుకు కదల్లేదని ఒక్క డిశ్చార్జ్ అప్లికేషన్ కూడా డిస్పోజ్ చేయలేదని రఘురామ తరపు న్యాయవాది బాలాజీ సుబ్రహ్మణ్యం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంలో సీబీఐ, నిందితులు కుమ్మక్కయారని పేర్కొన్నారు. డిశ్చార్జ్ పిటిషన్లపై వాదనలు విని వాటిపై ఎలాంటి నిర్ణయం వెలువరించకుండానే ఐదుగురు జడ్జీలు బదిలీ అయ్యారని తెలిపారు. ఒక్క డిశ్చార్జ అప్లికేషన్‌పైనా తుది నిర్ణయం వెలువడకుండా బదిలీ అవ్వడంలో కుట్రకోణం దాగి ఉందన్నారు. ఆ ఉద్దేశంతోనే తాము ట్రయల్ బదిలీ చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశామని పేర్కొన్నారు. బదిలీ సాధ్యం కాదని సుప్రీంకోర్టు గత విచారణలోనే చెప్పిందని తాము ఇప్పుడు కేసు మానిటరింగ్ పూర్తి స్థాయిలో జరగాలని కోరుతున్నామని తెలిపారు. సీబీఐ కేసుల వివరాలు, ప్రస్తుత పరిస్థితిని వివరిస్తూ సీబీఐ అఫిడవిట్ దాఖలు చేసిందని దర్యాప్తు సంస్థ తరపు న్యాయవాది పేర్కొన్నారు. ఈ కేసును హైకోర్టు మానిటర్ చేస్తోందని ఇంకా కేసు అక్కడ పెండింగ్‌లో ఉందని జగన్ తరపు న్యాయవాది ముకుల్ రోహత్గీ తెలిపారు. గత పదేళ్లుగా జగన్ బెయిల్‌పై ఉన్నారని సుప్రీంకోర్టు హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా ట్రయల్‌లో జాప్యం కొనసాగుతూనే ఉందని రఘురామ తరపు న్యాయవాది పేర్కొన్నారు. ఈ కేసులో వాదనలు వినిపించేందుకు కొంత సమయం కావాలని సీబీఐ తరపు న్యాయవాది కోరారు. అదనపు సొలిసిటర్ జనరల్ మరో కేసులో వాదనలు వినిపిస్తున్నందున వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై వచ్చే సోమవారం విచారణ చేపడతామని జస్టిస్ బీవీ నాగరత్న జస్టిస్ సతీశ్ చంద్రశర్మ ధర్మాసనం తెలిపింది.

# ప్రజలకు వాస్తవాలు తెలుసు: తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి

### టిడిపి క్రమశిక్షణ కమిటీ ఎదుట హాజరై వివరణను ఇచ్చిన ఎమ్మెల్యే కొలికపూడి



**విజయవాడ జనవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఈనెల 11న జరిగిన ఘటనపై తెదేపా క్రమశిక్షణ కమిటీ సభ్యులకు నేరుగా రాతపూర్వకంగా తన వివరణ ఇచ్చానని తిరువూరు ఎమ్మెల్యే కొలికపుడి శ్రీనివాసరావు తెలిపారు. క్రమశిక్షణ కమిటీ ఎదుట హాజరైన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియాలో వచ్చేది వేరు. జరిగిన వాస్తవం వేరు. కంచె తొలగింపు ఘటన యాదృచ్ఛికంగా జరిగింది. కంచె ఉన్న విషయం అక్కడికి వెళ్లే వరకు తెలియదు. నాపై ఫిర్యాదు చేసిన వాళ్లే ఇవాళ నాతో కలిసి పనిచేస్తున్నారు. పార్టీ కోసం పనిచేసే వాళ్లను ఎవరూ దూరం పెట్టరు. తిరువూరు ప్రజలకు వాస్తవాలన్నీ తెలుసు అని కొలికపూడి అన్నారు. ఈ నెల 11న కొలికపూడి ఎ.కొండూరు మండలం గోపాలపురంలోని తెదేపా గ్రామ కార్యదర్శి భూక్యా రాంబాబు ఇంటికి వెళ్లారు. ఆ గ్రామంలో రాంబాబుకి ఆయనకు వరుసకు సోదరుడయ్యే వైకాపా నాయుకుడు భూక్యా కృష్ణకు ఎప్పటి నుంచో ఆస్తి తగాదా ఉంది ఇటీవల గ్రామంలో సీసీ రోడ్డు వేశారు. ఆ రోడ్డు తన స్థలంలోనే వేశారని వివాదం తేలేవరకు రోడ్డుని ఎవరూ వినియోగించడానికి వీల్లేదని కృష్ణ దానిపై కంచె వేశారు. రాంబాబు ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆ రోడ్డు దగ్గరకు వెళ్లి కృష్ణ, ఆయన భార్య భూక్యా చంటిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ,ఆయన అనుచరులు తమ ఇంట్లోకి వచ్చి తన భర్తను తనను కొట్టారంటూ భూక్యా చంటి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. తెదేపాలోని మెజార్టీ వర్గాలు కూడా ఎమ్మెల్యే వ్యవహారశైలిపై అసంతృప్తితో ఉన్నాయి. దీంతో నేడు ఎమ్మెల్యేను క్రమశిక్షణ సంఘం ముందుకు పిలిపించారు. ఈ కమిటీలో సభ్యులుగా ఉన్న పార్టీ సీనియర్ నేత, ప్రభుత్వ న ల వ శో దా ర ం ఎంఏ షరీఫ్ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, ఎమ్మెల్యే పంచుమర్తి అనురాధ ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణకు కొలికపూడి వివరణ ఇచ్చారు. తెదేపాలో ఎవరైనా క్రమశిక్షణ పాటించాల్సిందేనని పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. అమరావతిలో మీడియాతో ఆయన మాట్లాడారు. పార్టీలో కార్యకర్త ఎమ్మెల్యే ఎవరైనా ఒకటేనని చెప్పారు. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి పార్టీ లైన్ దాటుతున్నట్లు తెలుస్తోందని వ్యాఖ్యానించారు.

# కూటమి నిర్ణయం నా నిర్ణయం

## ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

**ఉమ్మడితూర్పు గోదావరి జిల్లా బ్యూరో జనవరి 20, ప్రభాతవార్త..** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్న మద్దతు తెలిపు మెదటి శాసనసభ్యుడు తానేనని రాజమహేంద్రవరం శాసనసభ్యుడు ఆదిరెడ్డి శ్రీనివాసు అన్నారు. నగరంలో ఒకిటొవ డివిజన్‌లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, మాజీ ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో కలిసి సోమవారం పర్యటించారు. తారకరామా నగర్, బాలాజీ నగర్ సీసీ రోడ్లు, డ్రైనేజీ, కల్వర్టులను పనులపై ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాలను అంచనాలు తయారు చేసి పనులు ప్రారంభించాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలిరోజు నుండి నగరాభివృద్ధిపై దృష్టి పెట్టామన్నారు. నగరంలో మేజర్ డ్రైన్లపై దృష్టి పెట్టి సిల్టును తొలగించామని, దీంతో వర్షం డ్రైనేజీల్లో ప్రవహించి నగరంలో రోడ్డు నీట మునగలేదన్నారు. గత పాలకులు నిధులు దోచుకొని పైపై మెరుగులతో నగరాన్ని రాళ్ల ముక్కలను అంటించారు ఈ పనుల వల్ల నగర ప్రజలు ఎంత ఇబ్బంది పెడుతున్నారంటూ కనీస అవగాహన లేకుండా అభివృద్ధి పనులు చేశారని మండిపడ్డారు. దీనిలో టీడీపీ నాయకులు, నగర పాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు. రైటప్..ఒకిటో డివిజన్ లో అధికారులకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

# అమిత్ షా వ్యాఖ్యలకు ఊసరవెల్లి సైతం సిగ్గుపడుతుంది

## - ఎపిసిసి చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి



**విజయవాడ, జనవరి20, ప్రభాత వార్తప్రతినిధి:** కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలు చూస్తుంటే ఊసరవెల్లి సైతం సిగ్గుపడుతుందని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి అన్నారు. వైకాంగ్రెస్ పార్టీ ఐదేళ్ల పాలన ఓ విపత్తు అని అమిత్ షా అన్నారని, మరి ఐదేళ్ల పాటు విధ్వంసం జరుగుతుంటే ఏం చేశారని షర్మిల మండిపడ్డారు. ఆ ఐదేళ్లు కేంద్రంలో ఉన్నది ఎన్డీయేనే కదా మరి ఢిల్లీలో కూర్చొని వేడుక చూశారా? అంటూ ధ్వజ మెత్తారు. రివర్స్ టెండరింగ్ పేరుతో పోలవరం పనులను ఆపితే ఒక్కనాడైనా మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని ప్రశ్నించారా? అంటూ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు.రాజధాని లేని రాష్ట్రంగా ఏపీని వైసీపీ ఐదేళ్లపాటు పాలిస్తుంటే కేంద్రానికి కనిపించలేదా? అని షర్మిల మండిపడ్డారు. ఇష్టారాజ్యంగా రూ.10 లక్షల కోట్లు అప్పులు చేస్తుంటే విధ్వంసం జరుగుతున్నట్లు అనిపించలేదా? అని విమర్శించారు. సొంత బాబాయి హత్యకేసులో ఢిల్లీ స్థాయిలో న్యాయం కోసం పోరాటం చేస్తుంటే కేంద్ర హోంశాఖ మంత్రిగా ఎందుకు మోనంగా ఉన్నారంటూ అమిత్ షాను ఆమె ప్రశ్నించారు. భారీస్థాయిలో అవినీతి జరుగుతుంటే ఒక్కటైనా బయట పెట్టారా? అంటూ అమిత్ షాపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా అమిత్ షాపై షర్మిల ఘాటుగా స్పందించారు. ఈ సందర్భంగా వైఎస్ షర్మిల వ్యాఖ్యానిస్తూ ఐదేళ్ల పాటు జగన్ మీకు దత్తపుత్రుడు. ఆడించినట్లు ఆడే తోలుబొమ్మ. పార్లమెంట్‌లో మీ బిల్లులకు మద్దతు పలికే రబ్బర్ స్టాంప్. ఏపీలో సహజ వనరులను ఖిమోదానీఖికి దోచిపెట్టే ఏజెంట్. మీ ఇష్టారాజ్యంగా ఐదేళ్లు వైసీపీని వాడుకొని, రాష్ట్ర సంపద దోచుకొని, ఇప్పుడు విధ్వంసం జరిగిందని మొసలి కన్నీరు కార్చితే నమ్మే అమాయకులు రాష్ట్ర ప్రజలు కారు. 20192024 మధ్య జరిగిన విధ్వంసంలో కర్త జగన్.

# తిరుమల సమాచారం

## ఉత్తరాదిభక్తులకు శ్రీవారి దర్శనం

### - ధర్మప్రచారం ఏర్పాట్లు అభినందనీయం -టిటిడి ఛైర్మన్ నాయుడు



**తిరుమల,జనవరి 20ప్రభాత వార్త ప్రతినిధి:** ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళా సందర్భంగా అక్కడ శ్రీవారి నమూనా ఆలయం ఏర్పాటుచేసి,భక్తులకు స్వామివారి దర్శనంతోబాటు సేవలు వీక్షించే భాగ్యం కల్పించడం ఆనందంగా ఉందని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు తెలిపారు. ఇప్పటికే ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళాలో భక్తులు స్వామివారిని దర్శించుకునేలా 250మంది టిటిడి సిబ్బంది సేవలందించడం బావుందన్నారు. ఉత్తరాదిలో ధర్మప్రచారం కోసం చక్కటి ఏర్పాట్లు చేసిన హెచ్‌డిపిపి సిబ్బంది పనితీరు అద్భుతమన్నారు. సరయూనదీతీరంలో స్వామివారికి స్నప నతిరుమంజనం నిర్వహించారన్నారు. సోమవారం ఉదయం ఛైర్మన్ బిఆర్‌నాయుడు దంపతులు నమూనా ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ఏర్పాట్లపై సంతోషం వ్యక్తం చేశారు.

## భక్తులకు మరింత నాణ్యమైన సేవలు

### - కొన్ని సేవలు ఇకనుండి వాట్సాప్‌ద్వారా సమాచారం

### - టిటిడిలో ఆధునికసాంకేతికత వినియోగం

**తిరుమల,జనవరి 20ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం...వడ్డీకాసుల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు దేశవిదేశాల నుండి రోజువారీగా లక్షమందివరకు వస్తున్న భక్తులకు తిరుమలలో దర్శనం సమయం, గదుల లభ్యత తదితర వివరాలు మరింత త్వరగా,నాణ్యమైన సేవలందించేందుకు టిటిడి సాంకేతికతకను వినియోగించుకునే దిశగా సిద్దమైంది. సామాన్యభక్తులకు మరింత తాజా సమాచారం అందించేందుకు అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం ద్వారా భక్తులు ఇబ్బంది పడే అవకాశం లేకుండా చూడనుంది. పాలనాపరమైన సంస్కరణలు చేపట్టి కొండపై అనూహ్యంగా భక్తుల రద్దీ పెరిగినా రద్దీనియంత్రణ మరింత మెరుగ్గా ఉండేలా చూడనున్నారు. ఇప్పటికే ఈ విషయాలపై టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి కూడా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్ళారు. ఆయన కూడా సానుకూలంగా స్పందించడంతో ఇప్పుడు అమలుచేయడానికి టిటిడి అధికారులు సిద్దమయ్యారు. భక్తులు,పేదప్రజల సౌకర్యార్థం విద్యవైద్య రంగాల్లోకూడా విశేషసేవలందిస్తున్న టిటిడికి పలు రకాలుగా విరాళాలిచ్చే దాతల విభాగాన్ని పూర్తిగా ఆడిట్‌చేయించాలని బోర్డులో నిర్ణయించారు. అర్హులైన దాతలకు అందించే సేవలు, మధ్యవర్తులు,దళారులను పూర్తిగా అరికట్టేలా చర్యలు మొదలుపెట్టారు. పారదర్శకంగా సేవలందించేలా ,మానవ జోక్యాన్ని తగ్గించి భక్తులకు త్వరితగతిన తిరుమలేశుని దర్శనం, వసతి సౌకర్యం కల్పించాలని యోచిస్తున్నారు. ప్రస్తుతం సిఫార్సులేఖలపై జారీచేస్తున్న విఐపి బ్రేక్ దర్శనాలు కూడా ఆన్‌లైన్‌ద్వారా అందించేందుకు ఆ విఐపిలకరు ఒక కోడ్‌నంబర్ ఇవ్వాలని దానిద్వారా వెసలుబాటును బట్టి బ్రేక్ దర్శనాలు బుక్‌చేసుకునే సౌలభ్యం కల్పించేలా చూడనున్నారు. ఆన్‌లైన్‌ద్వారా గదులు బుక్‌చేసుకున్న భక్తులకు వాట్సాప్‌ద్వారా సమాచారం అందించేందుకు కసరత్తు మొదలుపెట్టారు. వాట్సాప్‌ద్వారా సేవలను భక్తులకు తెలిసేలా చూడనున్నారు. దీనివల్ల పాలనపరమైన సంస్కరణలతోబాటు భక్తులకు ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు. ప్రస్తుతం తిరుమలలో రాజ్యాంగపరిధిలోని ప్రముఖుల సిఫార్సులేఖలపై పద్మావతి విచారణ కార్యాలయం, ఎంబిసి, టిబి కౌంటర్ ద్వారా గదులు పొందే సదుపాయం లభిస్తోంది. ఆన్‌లైన్‌ద్వారా గదులు బుక్‌చేసుకునే సదుపాయం కూడా ఇప్పటికే అందుబాటులో ఉంది. ఇక రానున్న రోజుల్లో వాట్సాప్‌ద్వారా సమాచారం కీలకం కానుంది.

## నెయ్యినాణ్యత పరీక్షించే అధునాతన యంత్రాలు వచ్చాయ్!

### - ఎన్‌డిడిబి ద్వారా తిరుమలకు ల్యాబ్ పరికరాలు

**తిరుమల,జనవరి 20ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలేశుని లడ్డూప్రసాదాల తయారీలో వినియోగించే కిలోలకొద్దీ నెయ్యి నాణ్యత పరీక్షించేందుకు 80లక్షలు రూపాయలు విలువైన అధునాతన పరీక్షించే యంత్రాలు టిటిడికి చేరాయి. ఈ యంత్రాలు నెయ్యినాణ్యతను కొన్ని నిమిషాల్లోనే తేల్చేసి ఏమేరకు స్వచ్ఛమైన నెయ్యిఅనేది తెలియజేస్తుంది. ఈ మేరకు తిరుమలలో అవసరమైన అధునాతన పరిశోధన శాలను కూడా టిటిడి సిద్దం చేసింది. గుజరాత్‌లోని ఎన్‌డిడిబి నుండి గ్యాస్‌క్రోమోటోగ్రఫీ, హైఫర్ఫామెన్స్‌లిక్విడ్ క్రోమోటోగ్రఫీ రెండు యంత్రాలు చేరాయి. వీటిద్వారా నెయ్యిలోని నాణ్యత, నిత్యావసరసరుకుల నాణ్యత ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనల ప్రకారం ఉన్నాయోలేదో తెలిసిపోతుంది. ఇప్పటికే తిరుమలలో నెయ్యినాణ్యత ప్రాదమికంగా పరీక్షించే పాతల్యాబ్ ఉన్నా గతంలో చోటుచేసుకున్న వివాదాలు, ఆరోపణల నేపథ్యంలో టిటిడి అధునాతన పరిశోధనశాల ఏర్పాటుచేసి అవసరమైన ఆదునిక సాంకేతిక యంత్రాలను తెప్పించుకుంది. వీటిని త్వరలోనే ఏర్పాటుచేసి పరీక్షచేసేందుకు చర్యలు తీసుకుంటోంది. గతంలో కల్తీ నెయ్యితో లడ్డూలు తయారుచేశారని బలమైన ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై సిబిఐ సిట్ తిరుమలకు చేరుకుని విచారణ చేసింది. దర్యాప్తు నివేదికలు సిద్ధం చేసింది. టెండర్లు దక్కించుకున్న డైరీలు సరఫరా చేసే నెయ్యిని పరీక్షించేలా ఇప్పుడు అధునాతన యంత్రాలు తీసుకురావడంతో కల్తీఅనే మాట వినపడదు.

# కృష్ణానదీ యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని విజయవాడలోనే ఏర్పాటు చేయండి

### కృష్ణా జలాల కేటాయింపుల్లో ఆంధ్రా నీటి హక్కులను కాపాడాలి

### ఎపి సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు



హైదరాబాద్ జలసౌధలోని కెఆర్ఎంబి కార్యాలయంలో బోర్డు ఛైర్మన్ అతుల్ జైన్‌ను కలిసి వినతిపత్రం ఇస్తున్న ఆళ్ల వెంకటగోపాలకృష్ణారావు తదితరులు

**హైదరాబాద్, జనవరి 20, ప్రభాతవార్త :** కృష్ణానదీ యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని వైసిపి ప్రభుత్వం విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలన్న అసంబద్ధ నిర్ణయాన్ని పునఃసమీక్షించి కృష్ణా బేసిన్ విజయవాడలోనే ఏర్పాటు చేయాలని రాష్ట్ర జల వనరుల శాఖ ఎపెక్స్ కమిటీ మాజీ సభ్యుడు, నాగార్జునసాగర్ ఎడమకాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన హైదరాబాద్ జలసౌధలోని కెఆర్ఎంబి కార్యాలయంలో బోర్డు ఛైర్మన్ అతుల్ జైన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 ప్రకారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్లోని కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంలో అన్ని రకాల మానిటరింగ్ చేయటానికి ఏర్పాటు చేయగానే 2018 జనవరిలో విజయవాడలోని ఇబ్రహీంపట్నం ప్రాంతంలో భవనాలను కూడా పరిశీలించారని ఆయన వివరించారు. 2020 అక్టోబరులో కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో జరిగిన 2వ ఎపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కె.ఆర్. ఎం.బి కార్యాలయం ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో ఏర్పాటుపై తెలుగు రాష్ట్రాల అధికారులు చర్చించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. కృష్ణా నదిపై నిర్మించిన బహుళార్థ సాధక ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రకాశం బ్యారేజిపై ఆధారపడి ఉమ్మడి కర్నూలు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లో 30 లక్షల ఎకరాల ఆయకట్టు ఉందని కృష్ణానది ఒడ్డున ఉండే విజయవాడ కెఆర్ఎంబికి సరైన స్థలం అని ఆయన తెలిపారు. విజయవాడకు రైలు, రోడ్డు, విమాన సౌకర్యం కలిగి ఉందని ఆయన తెలిపారు. ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వ అధికారులు, తెలంగాణ ప్రభుత్వ అధికారులు, ఆయకట్టుదారులు, నీటి సంఘాల ప్రతినిధులు తమ సమస్యలను కె.ఆర్.ఎం.బి దృష్టికి తీసుకురావటానికి అనుకూలంగా విజయవాడ ఉంటుందన్నారు. ఇన్ని సానుకూల అంశాలు ఉన్న విజయవాడలో కాకుండా కృష్ణా డెల్టాకు 400 కి.మీ, ఎన్.ఎస్.పి కి 700 కి.మీ, శ్రీశైలంకు 800 కి.మీ లకు దూరంగా గోదావరి బేసిన్ అవతల వున్న విశాఖపట్నంలో మూడు రాజధా నుల్లో భాగంగా కార్య నిర్వాహక రాజధాని నెపంతో కె.ఆర్.ఎం.బి కార్యాలయాన్ని ఎలా ఏర్పాటు చేస్తారని గత వై.సి.పి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గతంలో కేంద్ర జలశక్తి శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2014–2019, 2019–2024 మధ్య జరిగిన నిర్ణయాలను పరిగణనలోనికి తీసుకుని విజయవాడలోనే కార్యా లయాన్ని ఏర్పాటు చేయటానికి అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కె.ఆర్.ఎం.బి ఛైర్మన్ అతుల్ జైన్‌కు విజ్ఞప్తి చేశారు.

## లోకేష్‌కు డిప్యూటీ సీఎం అంశంపై చర్చలొద్దు

### -ఆదేశించిన టిడిపి అధిష్టానం

**విజయవాడ,జనవరి20,ప్రభాతవార్త పతినిధి:** ఏపీలో ఈ మధ్య డిప్యూటీ సీఎం అంశం ప్రధాన రాజకీయ చర్చాంశంగా మారింది. పవన్‌కు ప్రత్యామ్నాయంగా మంత్రి లోకేష్‌కు ఉప ముఖ్యమంత్రి ఇవ్వాలనే వాదన తెరమీదకు వచ్చింది. మహాసేన రాజేష్ ఈ అంశాన్ని తెరపైకి తీసుకుని వచ్చారు. సామాజిక మాధ్యమాల్లో టీడీపీ, జెఎస్పీ కేడర్లు నడుమ సామాజిక మాధ్యమాల్లో ప్రచ్ఛన్న యుద్దానికి దారి తీసింది. ఇది క్రమంలో సామాజిక వర్గీయుల నడుమ సున్నిత పరిస్థితులకు ఆజ్యం వేసే దిశగా మారింది. సామాజిక మాధ్యమాలు కొన్ని పవన్ ఏకంగా టీడీపీపై అలిగి తన పదవికి రాజీనామా చేసారనే వార్తలువచ్చాయి. దీనికి తోడుగా మంత్రి నారా లోకేశ్ కి డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలనే డిమాండ్ తెలుగుదేశం పార్టీ వర్గాల్లో ఎక్కువగా వినిపిస్తోంది. వీరిలో అత్యధికులు నామినేటెడ్ పోస్టులు ,ఇతర పదవులు ఆశించి భంగపడిన వారు కావడం విశేషం, ఈ క్రమంలో లోకేష్ డిప్యూటీ సీఎం అంశంపై ఇప్పటికే పలువురు నాయకులు స్పందించారు. ఈ విషయంపై టీడీపీ హైకమాండ్ దృష్టి సారించింది.

భారత ప్రభుత్వం

**పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ**

**జాతీయ జీవ వైవిధ్య అథారిటీ, ఛైర్‌పర్సన్ ఉద్యోగ భర్తీ నిమిత్తం ప్రకటన**

**ప్రకటన నం. J-22018/12/2003-CSC(BC)Vol.III**

పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ (రాష్ట్రీయ జీవ వివిధాతా ప్రధికరణ్) యొక్క ఛైర్‌పర్సన్ ఉద్యోగ భర్తీ చేయవలసి ఉంది. జీవ వైవిధ్య చట్టం 2002 (2003 యొక్క 18) యొక్క సెక్షన్ 8 యొక్క ఉప-సెక్షన్ (1) మరియు (4)చే సంక్రమించబడిన అధికారాలను వినియోగిస్తూ గెజిట్ ప్రకటన నం.906 ద్వారా అక్టోబర్ 1, 2003న ఆ అథారిటీ నెలకొల్పబడింది. ఆ అథారిటీ ఒక కార్పోరేట్ సంస్థగా చెన్నై వద్ద కేంద్ర కార్యాలయం కలిగి ఉంది.

2024 జీవి వైవిధ్య నిబంధనలు యొక్క 3(2) నిబంధన ప్రకారం, ఛైర్‌పర్సన్ యొక్క నియామకం సంక్షిప్త-గడువు కలిపిన ఆధారిత కాంట్రాక్ట్ డిప్యుటేషన్ పైన గానీ లేదా ప్రభుత్వం బయట నుండి గానీ చేయవలసి ఉంది. ఒకవేళ నియామకం, ప్రభుత్వం నుండి డిప్యుటేషన్ ద్వారా లేదా సంక్షిప్త-గడువు కాంట్రాక్ట్ అయినట్లయితే దరఖాస్తుదారుడు భారత ప్రభుత్వానికి అడిషనల్ సెక్రటరీ యొక్క ర్యాంక్ క్రింద వారై ఉండకూడదు.

జీవి వైవిధ్య చట్టం 2002 యొక్క 8(4)(a) సెక్షన్ ప్రకారం ఛైర్‌పర్సన్ సరిపడే జ్ఞానం, నైపుణ్యం మరియు జీవ వైవిధ్యం యొక్క స్థిర వినియోగం మరియు సంరక్షణలో అనుభవం కలిగి ఉండి మరియు ప్రయోజనాల సమప్రతిపత్తి భాగస్వామ్యం మరియు పారదర్శకలో సంబంధిత ప్రముఖ వ్యక్తి అయిఉండవలెను. 2002 జీవ వైవిధ్య చట్టం యొక్క సెక్షన్ 10 ప్రకారం ఛైర్‌పర్సన్ జాతీయ స్థాయి జీవ వైవిధ్య అథారిటీ యొక్క చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా మరియు నిర్దేశించబడిన అటువంటి విధులు నిర్వర్తించటం మరియు అటువంటి అధికారాలను వినియోగించగలిగి ఉండవలెను.

నియామకం యొక్క ప్రచురణ తేదీ నుండి 3 సంవత్సరాలు కాలానికి ఛైర్‌పర్సన్ కార్యాలయాన్ని నిర్వర్తించవలసి ఉంటుంది. మరియు అతనికి అరవై-ఐదు సంవత్సరాల వయస్సు వచ్చిన తర్వాత గానీ లేదా అతని ఉద్యోగ కాలం పూర్తయితే, ఏది అయితే ముందు వస్తుందో దాని ప్రకారం ఆ విధంగా ఏ ఛైర్‌పర్సన్ ఉద్యోగ బాధ్యతలో లేనట్లయితే అతనికి తిరిగి నియామకానికి అర్హత ఉంటుంది. ఛైర్‌పర్సన్‌గా నియమింపబడినట్లయితే, జాతీయ జీవ వైవిధ్య అథారిటీ ప్రభుత్వం నుండి డిప్యుటేషన్‌పై లేదా సంక్షిప్త గడువు కాంట్రాక్ట్‌పై, ఉద్యోగ కాలం మూడు సంవత్సరాలు లేదా పదవీ విరమణ వయస్సు యొక్క తేదీ వరకు ఏది ముందైతే దాని ప్రకారం ఉంటుంది.

2024 జీవి వైవిధ్య నిబంధనలు యొక్క నిబంధన 5 ప్రకారం ఛైర్‌పర్సన్ జీతం, భారత ప్రభుత్వం యొక్క సెక్రటరీతో సమానంగా పొందే చట్టపరమైన హక్కు ఉంటుంది. ఒకవేళ ఛైర్‌పర్సన్‌గా పదవీ విరమణ పొందిన వ్యక్తి నియమింపబడితే, అటువంటి వ్యక్తులకు వర్తించే కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల సంబంధిత అనుగుణంగా జీతం నిర్ణయించబడుతుంది.

అభ్యర్థులు కనీసం ఒక పోస్ట్-గ్రాడ్యుయేట్ డిగ్రీ కలిగి ఉండి మరియు ప్రభుత్వ సంస్థల సౌరధ్యంతో కలుపుకొని సీనియర్ స్థాయిలో కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వంలో పని చేసిన కనీసం 5 సంవత్సరాల అనుభవంతో సైన్స్ మరియు సోషల్ సైన్స్‌లలోని అంశాలతో వ్యవహరించగల 30 సంవత్సరాల అనుభవం కలిగి ఉండవలెను. అతనికి పాలనా వ్యవహారాల అనుభవం కలిగి మరియు వివిధ సంబంధిత అంతర్జాతీయ ఆహారం క్రింద లబ్ధి వాటా పొందగల మరియు వర్తమాన అభివృద్ధి సంబంధిత సామీప్యంతో మంచి సాన్నిహిత్యం కలిగి ఉండవలెను. జీవ వైవిధ్య రంగంలో వివిధ స్టేక్ హోల్డర్‌లతో పనిచేసిన అనుభవం, అంతర్జాతీయ సంప్రదింపులలో పాల్గొన్న అనుభవం మరియు చట్టసంబంధిత అంశాలపై బాధ్యత వహించగలగడం వంటిది అవసరమై ఉన్నాయి.

అసాధారణ సామర్థ్యం గల అభ్యర్థి అయినట్లయితే ప్రభుత్వంపై పేర్కొనబడిన యోగ్యతల యొక్క ఒకటి లేదా ఎక్కువ అవసరాలను ప్రభుత్వ నిర్ణయాధికారం పై మినహాయించవచ్చును.

దరఖాస్తులు మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్ www.moef.gov.in ఆన్‌లైన్‌పై 28.02.2025న (అర్ధరాత్రి) లేదా ముందు దాఖలు చేయవలెను.

అడ్వైజర్ / సైంటిస్ట్ 'G'

CS-III (బయోడైవర్సిటీ) డివిజన్

పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ

ఇందిరా పర్యావరణ భవన్, జోర్ బాగ్ రోడ్, అలిగంజ్, న్యూఢిల్లీ-110003

CBC 13101/11/0020/2425

స్నేహం నిదానంగా వికసించేది. నెమ్మదిగా వర్ధిల్లేది. ఒకరినొకరు అర్థం చేసుకోవడం వల్ల, త్యాగం చేసుకోవడం వల్ల విస్తరించేది.

-నెపోలియన్

# ట్రంప్ తొలి అడుగులపై ఉత్కంఠ!

ప్రపంచదేశాలు ఎంతో ఉత్కంఠతో ఎదురు చూస్తున్న తరుణం రానే వచ్చింది. అమెరికా 47వ అధ్యక్షుడుగా రిపబ్లికన్‌నేత డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారం చేసారు. అందులో కొత్తేమీ లేదు. ఎన్నికైన అధ్యక్షుడు ప్రమాణంచేసి శ్వేతసౌధంలోకి అధికార లాంఛనాలతో అడుగుపెడతారు. అయితే ఎటొచ్చీ పదవీబాధ్యతలు తీసుకున్న మరుక్షణంలోనే కొత్త అధ్యక్షుడు చేసే సంతకాలపైనే ఇపుడు అన్ని వర్గాల ఫోకస్ అంతా. అందులోనూ రిపబ్లికన్ నేత డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడుగా ఎన్నికైన తర్వాత తీసుకునే నిర్ణయాలపైనే ఇపుడు ప్రపంచదేశాలు దృష్టి సారిస్తున్నాయి. అన్నింటికంటే వీటిలో అక్రమవలసల కట్టడి అంశం చర్చకు వస్తోంది. వీటితోపాటు తనముందున్న అధినేత జో బైడెన్ జారీచేసిన ఉత్తర్వులన్నింటినీ రద్దుచేస్తానని ప్రకటించిన ట్రంప్ అధ్యక్షుడుగా తొలి సంతకం చేసిన తర్వాత సుమారు 200కిపైగా ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులపై సంతకాలు చేస్తారని అంచనా. వీటిలో ముందుగా పది ఉత్తర్వులు ఇపుడు ప్రజల్లో నలుగుతున్నాయి. అన్నింటి కంటే అత్యంత విస్తృత స్థాయిలో ప్రచారంలోకి వచ్చింది సామూహిక అక్రమ వలసదారుల కట్టడి. అక్రమ పత్రాలతో అమెరికాలో నివసించే అర్హతలేని వారందరినీ వెనక్కి పంపించేస్తామని, అవసరమైతే ఇందుకు ప్రత్యేక బలగాలను నియమించి కూడా అక్రమవలసలు నిర్మూలిస్తామని తెగేసి చెపుతున్నారు. ఇప్పటికే అనేక సార్లు స్పష్టం చేసిన ట్రంప్ ఇపుడు ఈ సామూహిక అక్రమ వలసల కట్టడి నిర్ణయం ఏకపక్షంగా చేస్తున్నారన్న విమర్శలు తలెత్తుతున్నాయి. ట్రంప్ మొదటిసారిగా అధ్యక్షుడుగా కొనసాగిన సమయంలో కూడా అమెరికా ఫస్ట్, అమెరికన్ ఫస్ట్ నినాదంతో భారీ మెజార్టీతో గెలిచారు. అలాగే ఇపుడు రెండోసారి కూడా మేడిన్ అమెరికా నినాదాన్ని కూడా ప్రచారంలోకి తెస్తున్నారు. అక్రమవలసల నిరోధం పేరిట కఠిన చర్యలు ప్రారంభిస్తే ముందుగా మెక్సికో, కెనడా, చైనా, ఇతర గల్ఫ్‌దేశాలకు చెందిన వారిపై ప్రభావం పడుతుందని అంచనా. ఈకోవలో భారతీయులపైనా ఈ ప్రభావం పడుతుంది. ఇక అక్రమ వలసలతోపాటు జన్మతహ పౌరసత్వ విధానాన్ని కూడా రద్దు చేస్తామని ప్రకటించారు. దీనివల్ల అమెరికాలో పుట్టిన విదేశీ పిల్లల తల్లితండ్రులకు ఇపుడు చిక్కులు ఎదురయ్యే ప్రమాదాలు మెండుగా ఉన్నాయి. వీటితోపాటు ట్రాన్స్ జెండర్లను మహిళా క్రీడల్లో అనుమతించే ప్రశ్నేలేదని, వారిని కేవలం పురుషులకు సంబంధించిన క్రీడల్లోనే అనుమతించేవిధంగా రూపొందించిన కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకాలు చేస్తామని ప్రమాణస్వీకారానికి ముందు నుంచే ట్రంప్ చెపుతూ వస్తున్నారు. అంతటితో ఆగలేదు. అమెరికన్లలో విశ్వాసం మరింత పెంచుకునే దిశగా ట్రంప్ అడుగులు వేస్తున్నారు. అమెరికా మాజీ అధ్యక్షులు జాన్‌ఎఫ్ కెనడీ, రాబర్ట్ ఎఫ్‌కెడనీ, మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్‌ల హత్యకేసు ఫైళ్లను బహిర్గతం చేస్తానని ప్రకటించారు. ప్రభుత్వంలో పారదర్శకత పేరిట ట్రంప్ అనుసరిస్తున్న వ్యూహం భారీ ప్రయోజనాలే చేకూరుస్తుందని అంచనా. మెక్సికో, కెనడా దిగుమతులపై 25శాతం సుంకాలు తప్పవని అదే దిశగా మరికొన్ని దేశాలపైనా సుంకాల విధింపు ఉంటుందని ముందుగానే హెచ్చరించిన ట్రంప్ కచ్చితంగా అమలు చేస్తారన్న భయాలు కూడా పెరిగాయి. వీటితోపాటుగా మూడో ప్రపంచ యుద్ధం రాకుండా అడ్డుకట్ట వేస్తానన్నారు. ప్రమాణ స్వీకారం చేసిన గంటలోపే ప్రస్తుత అధ్యక్షుడు జోబైడెన్ జారీచేసిన ఉత్తర్వులు అమలుకాకుండా చూస్తామన్నారు. రెండోసారి ఎన్నికల్లో తన ఓటమిపై ఆగ్రహం వ్యక్తం చేసిన మద్దతుదారులు క్యాపిటల్ హిల్స్‌పై దాడులు చేసారు. ఈ దాడుల్లో ఇప్పటికీ నిందితులుగా ట్రంప్ మద్దతుదారులు జైళ్లలో ఉన్నారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే ముందు 1500 మందికిపైగా మద్దతుదారులకు క్షమాభిక్ష ప్రసాదించాలని నిర్ణయించారు. విదేశీ కంపెనీలు ఏవైనా సరే కనీసం 50శాతం వాటా అమెరికా ఇన్వెస్టర్ల చేతుల్లో ఉండాలన్న షరతులు విధిస్తూ ప్రత్యేక ఉత్తర్వులు తీసుకువస్తున్నారు. అలాగైనా కూడా కొన్ని విదేశీ కంపెనీలు అమెరికాలో సేవలకు ముందుకు వస్తున్నాయి. వాటిలో చైనాకు సంబంధించి టిక్‌టాక్ ప్రధానంగా నిలిచింది. వీటితోపాటు ట్రంప్ తన తొలి విడత హయాం నుంచి కూడా క్రిప్టోకరెన్సీపై మక్కువ చూపించారు. అందుకు అనుగుణంగా ఆయన సతీమణి మెలానియా ట్రంప్ సొంతంగా మీమ్ కాయిన్‌ను విడుదల చేస్తున్నారు. అప్పటికే ట్రంప్‌కు సొంత మీమ్ కాయిన్ ఉంది. అధ్యక్షుడుగా ప్రమాణస్వీకారం చేసిన తరుణంలో ఈ బిట్‌కాయిన్ విలువలు గణనీయంగా పెరిగాయి. అలాగే ఇంధన దిగుమతులకు చెక్‌పెట్టాలని నిర్ణయించిన ట్రంప్ స్వదేశంలో చమురు వెలికితీతను మరింత విస్తృతంచేయాలని నిర్ణయించారు. సొంతంగానే చమురు నిల్వలను పెంచుకుంటే దిగుమతి వ్యయం తగ్గుతుందని, వృధా ఖర్చును తగ్గించుకోగలుగుతామని ట్రంప్ చెపుతూ వస్తున్నారు. అన్నీ సవ్యంగా జరిగితే ట్రంప్ అనుకున్నట్లుగా కేవలం 100 మాత్రమే కాదు బైడెన్ పాలనలో జారీ అయిన కార్యనిర్వాహక ఉత్తర్వులన్నీ కలుపుకుంటే సుమారు 200కిపైగా ఉత్తర్వులపై సంతకాలు చేయవచ్చని శ్వేతసౌధం అధికారులే పేర్కొంటున్నారు. పదవి చేపట్టకముందే ఏడాదిగా జరుగుతున్న మారణహోమానికి అడ్డుకట్టవేయగలిగారు. ఇజ్రాయెల్ పాలస్తీనా యుద్ధకాండకు తెరపడింది. అదేవిధంగా ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్రను కూడా నిలిపివేయగలిగితే ట్రంప్‌పై ప్రపంచదేశాల్లో కూడా గౌరవం మరింత పెరుగుతుంది. బాధ్యతలు చేపట్టిన తొలివారంలోనే ట్రంప్ ఈ రెండుదేశాలపై దృష్టిసారిస్తే మరో మారణహోమానికి ఫుల్‌స్టాప్ పెట్టిన వారవుతారని నిస్సందేహంగా చెప్పవచ్చు.

జీవితం అంతకంతకూ తన్మయత్వం నొందించే సాహస కార్యంలా కనిపిస్తుంటుంది. అందులో మనం నేర్చుకోవలసింది, చేయవలసింది ఎంతో ఉంది.



నెహ్రూ

ఇతరులకు మంచి చేసే వ్యక్తి, తనకు తాను మంచి చేసుకున్న వాడు అవుతాడు.



సెనెకా

## ప్రజావాక్కు



### పరిస్థితి చేయి దాటిపోతుంది!

తెలుగు దేశంపార్టీ సభ్యత్వనమోదు కోటిమందికి చేరుకున్న సందర్భంగా పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్, కార్యకర్తే అధినేత, కార్యకర్తలు పార్టీకి వెన్నుదన్నుగా నిలిచారుఅని కీర్తించారు. అయితే ఇదే సందర్భంలో కొంతమంది ఎమ్మెల్యేలు తప్పులు చేస్తున్నారు అనికూడా చెప్పటం జరిగింది. క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే కార్యకర్తల పరిస్థితి దయనీయంగా ఉంది. ముఖ్యంగా ఎన్నికల ముందు,తర్వాత పార్టీ కండువా కప్పుకున్న ఇతర పార్టీలనేతలు కార్యకర్తలతో సఖ్యతగా ఉండకపోగా వారినే వేధింపులకు గురి చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మరల 2019 ఫలితాలు పునరావృతం అవుతుంది! కనీసం మండల స్థాయిలో కార్యకర్తల సమావేశాలు నిర్వహించి వాస్తవాలు తెలుసుకుంటే నష్ట నివారణకు అవకాశం ఉంటుంది!

-జి.రామకృష్ణ, ముస్తాబాద, కృష్ణాజిల్లా

### యుద్ధానికి ముగింపెప్పుడు?

ఇజ్రాయెల్ పాలన, రష్యా ఉక్రెయిన్ యుద్ధాలు ముగిసి శాంతి నెలకొంటున్ననేపథ్యంలో ఒకశాంతి రేఖ వీస్తుంది. అది ప్రపంచ ఆహార సరఫరా గొలుసులు పైన పాజిటివ్ లైన్‌లో ప్రయాణంచేయాలి.ఈశాంతి రేఖలువల్లఇండియా మిడిల్ ఈస్ట్ ఎకనామిక్ కారిడార్ అభివృద్ధిలోకి రావచ్చు. అయితే యుద్ధం వల్ల ఇండియా ఆడిబుల్ ఆయిల్ మిషన్ ప్రారంభించింది. కానీ యుద్ధం మూలంగా ఆ నాలుగు దేశాలు కోల్పోయిన మానవ వనరులు అపారం అయినవి. ఆయిల్‌కొరతతో ఆఫ్రికా యూరప్‌దేశాలు అవస్థలు పడుతున్న నేపథ్యంలో ఇప్పటికైన శాంతి వెల్లివిరియాలి.

- భారత అవినాష్, జనగామ

### రేషన్ కార్డులలో పిల్లల పేర్లు చేర్చండి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఇవ్వబోయే రేషన్ కార్డులలో పిల్లల పేర్లు చేర్చండి. గత 10 సంవత్సరాల క్రితంనుండి దరఖాస్తు చేసిన పిల్లలపేర్లు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. పిల్లల పేర్లు రేషన్‌కార్డులలో లేకపోవడం వలన కులం సర్టిఫికెట్, ఆదాయం సర్టిఫికెట్, నివాసం సర్టిఫికెట్,ఇతర స్టడీఅవసరాల నిమిత్తం చాలా ఇబ్బందులు కలుగుతున్నాయి. పెండింగ్‌లోఉన్న పిల్లలపేర్లు చేర్చి నూతన రేషన్ కార్డులను ఇవ్వాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### మూడో శనివారం హాలిడే?

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతి మూడవ శనివారం అన్ని ఆఫీసులకూ నోవర్కింగ్ డేఅని స్కూల్స్ కూడా నో టీచింగ్ డే అని పరిశుభ్రతకే ప్రాధాన్యత ఇవ్వాలని అందరూ ఉద్యోగులు కూడా పరిశుభ్రతను పాటించాలని, మొత్తం చెత్తను తీసివేయాలని, ఒక మంచి సందేశాన్ని ఇచ్చారు. ఇది చాలా సంతోషించదగ్గవిషయం. అయితే ప్రైవేటు పాఠశాలలో ఈఅంశాన్ని పాటించరు. ఎందుకంటే ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న పిల్లలు పరిశుభ్రంగా ఉంటారు. వారు డబ్బున్నవారు.చెత్తనితీయడానికి అక్కడ యాజమాన్యం ఆయాలను పని మనుషులని పెడతారు.ప్రభుత్వ పాఠశాలకు వస్తున్న పిల్లలు చేత చెత్తను ఎత్తడం, చదువు చెప్పకుండా వారి చేత ఈ పనులు చేయించడం కొంచెం బాధాకరంగా అనిపిస్తుంది.

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### ఉరే సరి

గత కొన్ని నెలల కిందట కోలకత్తాలో జూనియర్ వైద్యురాలు దారుణ హత్యాచారానికి గురై మరణించింది. ఆమె మరణానికి కారకుడైన నిందితుడికి కోర్టు తీర్పు ఇవ్వబోతుంది. దేశ ప్రజలు ఈ తీర్పు కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నిందితుడికి ఉరి శిక్ష విధించాలని దేశం మొత్తం కోరుతుంది. మహిళలపై ఎక్కడ మరోసారి ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా కోర్టు తీర్పు ఇవ్వాలని దేశంలో మహిళలంతా ఆశగా ఎదురుచూస్తున్నారు. తీర్పు కాస్త ఆలస్యమైనా కానీ నిందితుడు కచ్చితంగా చట్టం చేసిన శిక్షలను తప్పించుకోలేదు. అని ఈ తీర్పు నేరస్తులకు భయం కలిగించాలి.

-శ్రిష్టి శేషగిరి, సికిందరాబాద్

### సోమరులను తయారు చేయకూడదు

ఫిబ్రవరి నెలలో ఢిల్లీలో జరగబోయే ఎన్నికలలో ఇటు ఆప్ పార్టీ, అటు బి.జె.పి, కాంగ్రెసు పార్టీలు పోటా పోటీగా విచక్షణారహితంగా ఉచితాల మీద ఉచితాలను,ఇతర సదుపాయాలను యిస్తామని వాగ్దానాలను ప్రవహింపజేస్తున్నారు.ఇవి పూర్తిగా లంచాల వంటివే. ఇవి పన్నుల రూపేణా చెల్లించే ప్రజల సొమ్ము. ఈ ఉచితాలను నిత్యం విమర్శించే బి.జె.పి. కూడా ఈ రొంపిలోకి దిగిపోయింది. ఏంచేస్తాం? ఈ ఉచితాల వాగ్దానాల మీదనే కదా రాజకీయ నాయకులు తమ ప్రభుత్వాలను నిర్మించుకొనిఆపైప్రజలను లంచాలతో పీడించుకుతినేది.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: tpage@vaartha.com)

# ఇజ్రాయెల్-గాజా కాల్పుల ఒడంబడిక ఫలించేనా?

అరబ్-ఇజ్రాయిల్ దేశాల మధ్య ముఖ్యంగా ఇజ్రాయిల్-లెబనాన్‌ల మధ్య శాంతి తీరాలు సుదూరాన కూడా కనపడటంలేదు. ఎడతెగని దాడులు, ఎన్నిసార్లు ఒడంబడికలు జరిగినా ఇరువైపు లా జరుగుతూనే ఉంటాయి. ఈ నిరంతరం నిప్పుల కొలిమిని ఆర్పేదెవరు? అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో బాటు రష్యా, చైనా, ఇండియా లాంటి దేశాల అధినేతలు,అరబ్బు దేశాలు- ఇజ్రాయిల్ లెబనాన్ దేశాల మధ్య అంతర్జాతీయంగా యు.ఎన్ ఆర్గనైజేషన్‌ను బరిలోకి దింపి ఏకాగ్రతతో, రాజకీయాలనూ, పాతవైరాలనూ దూరంపెట్టి నిజమైన, కొన్నేళ్లపాటు నిలిచిపోయే శాంతి మార్గాన్ని ఏర్పరుస్తేనే ఈ జాతుల వైరం సమిసిపోయే అవకాశం ఉంది. అంతటి మహత్తరమైన అసాధారణ ప్రయత్నం అంతర్జాతీయంగా సాధ్యపడుతుందా? ఈ మిలియన్ డాలర్ల ప్రశ్నకు జవాబు ప్రస్తుతానికి కనపడటం లేదు. అయినా సరే ఆశను ఆవిరి కానివ్వకుండా నిరంతరం శ్రమిస్తూ ప్రయత్నించక తప్పదు.



రావులపాటి సీతారాంరావు

పాలస్తీనీయన్లు గాజాలో పండుగ సంరంభాలు జరుపుకోవడానికి కారణం ఇజ్రాయిల్-హమాస్ మధ్య సీజ్‌ఫైర్ ఒడంబడిక జరగడం వల్ల. గాజా ప్రాంతంలో కనీసం కొన్నాళ్లయినా శాంతితో సుఖంగా బాంబులూ, రాకెట్ల గొడవ లేకుండా ప్రాణాలు క్షణాల్లో గాలిలో కలిసిపోకుండా బతకొచ్చని! బతుకు విలువ తెలిసిన గాజా ప్రాంత వాసులకు అంతకంటెగొప్పవరం ఏముంటుంది? అమెరికా ప్రసిడెంట్ ట్రంప్, అధ్యక్ష పీఠాన్ని అలంకరించబోయే ముందు అంటే జనవరి 15, 2025 నాడు ఈ ఒడంబడిక సాధ్యపడేలా చేశారు. పదవి నుంచి దిగబోతున్న జోబైడెన్ పూర్తి సహకారం అందించడం వల్లనే ఈసంధి కుదిరిందని అభిజ్ఞుల భోగట్టా! ఖతార్ స్టేట్ మధ్యవర్తిత్వంతో చర్చలు ఒక రకంగా ఫలవంతమయ్యాయి. అందుకనే జనవరి 19 నుంచి ఈ ఒడంబడిక అమలులోకి వస్తుందని ఖతార్ ప్రకటించింది. పట్టుబడ్డ ఇజ్రాయిలీ వాసులనూ, పాలస్తీనీ ఖైదీలను ఇచ్చి పుచ్చుకోవటాలు జరగటమే ఈ ఒడంబడిక మరొక ముఖ్యాంశంగా భావించాలి. 2023 సంవత్సరంలో మొదలైన ఇజ్రాయిల్ దాడి-హమాస్ దాడులకు ప్రతిగా, దాదాపు 15 నెలల తర్వాత ఆగిపోయే సూచనలు ఈ ఒడంబడిక ద్వారా కనపడుతున్నాయి. ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి బెంజిమెన్ నెతన్యాహు ఒక విధంగా ట్రంప్ ధోరణి వల్ల ఆశాభంగం పొందక తప్పలేదు. ట్రంప్ అధికారంలోకి వస్తే హమాస్‌పై దాడులను వ్యతిరేకించడని నెతన్యాహూ ఆశించాడు. కానీ ట్రంప్ తన రాజకీయ అవసరాల దృష్ట్యా నెతన్యాహు ఆశించిన విధంగా ఈ దాడులను కొనసాగించడానికి ఒప్పుకున్నట్లు లేదు. బైడెన్ బలహీన ధోరణి వల్ల ఇజ్రాయిల్ ఈ దాడులను కొనసాగించిందని రాజకీయ వర్గాలు నమ్మాయి. తర్వాత ట్రంప్ నిర్ణయం ఒక విధంగా ఈ ప్రాంతంలో శాంతికి దారితీసిందిగా భావించవచ్చు. ఎన్నాళ్లు ఈ ప్రశాంతత పాలస్తీనీయులకు దక్కుతుందో కాలమే నిర్ణయిస్తుంది. నెతన్యాహూ రాజకీయంగా నష్టాన్ని ఎదుర్కొన్నాడనే చెప్పాలి. హమాస్‌ను పూర్తిగా అణచివేయడంలో ట్రంప్ సహకరిస్తాడని ఆశించాడు. కానీ అలా జరగకపోవడం వల్ల అతని దేశంలో తీవ్ర వ్యతిరేకతను కొద్ది రోజుల్లో ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఎదురయ్యే అవకాశాలు కూడా ఉండొచ్చు. ఇజ్రాయిల్ చిన్నదేశమైనా, అమెరికా లాంటి రాజ్యాల అండతో మదమతిప్పని విధంగా పాలస్తీనీయుల పట్ల, గాజా పట్ల దాడులతో బాంబులతో, ఆధునిక ఆయుధ సంపత్తితో విపరీత నష్టాన్ని కలగచేసింది. పూర్తిగా అణిచివేసే ప్రయత్నం ట్రంప్ రాజకీయ ఎత్తుగడతో ప్రస్తుతానికి భగ్నమయింది. అయితే లెబనాన్‌లోని హెజబొల్లా, హమాస్ బలం,బలగాలు పెద్దఎత్తున ఈసంవత్సర కాలంలో ఇజ్రాయిల్ చేతిలో చాలావరకు దెబ్బతిన్నాయి. కానీ ఇజ్రాయిల్ ఈ సీజ్‌ఫైర్ ఒడంబడికతో పూర్తిగా శత్రువులను రాజకీయంగా మట్టుపెట్టలేకపోయింది. దీనివల్ల ఏనాటికైనా గాజా కూడగట్టుకున్న బలగాలతో, సానుభూతి పరులతో హమాస్, పాలస్తీనా రాజకీయాలను ప్రభావితం చేసే అవకాశం ఉంది. శాంతి పూర్తిగా సాధ్యపడుతుందని నమ్మటం అందువల్ల కుదరకపోవచ్చు. రెండు రాజ్యాల ఏర్పాటుకు హమాస్, ఇజ్రాయిల్ ఒప్పుకొనే అవకాశాలు



చాలా తక్కువ. ప్రపంచ దేశాలు ఎంతగా ప్రయత్నించినా శాంతికోసం ఎన్నిపాట్లు పడ్డా ఈ పరిస్థితి ప్రస్తుత పరిస్థితులలో సుగమం కాకపోవచ్చు. ఒకవేళ హమాస్ వైపు నుంచి దాడులు మొదలవుతే ఇజ్రాయిల్ ఆ నెపంతో సీజ్‌ఫైర్‌ను కాదని తెగింపు ధోరణితో ప్రతిదాడులు పెద్దఎత్తున చేయొచ్చు. హమాస్ దాడుల సాకుతో ట్రంప్ సపోర్టును ఇజ్రాయిల్ సాధించి, ప్రతీకారం తీసుకొనే అవకాశాలు కూడా ఉన్నాయి. హమాస్ పట్టుబడ్డ ఇజ్రాయిలీలను (అందులో ఎక్కువ మంది అమెరికన్లు ఉన్నారు) వదలకపోతే ప్రసిడెంట్‌కాక ముందు ట్రంప్, హమాస్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరిక చేయడం అంత తేలిగ్గా మర్చిపోవడం కష్టం. హమాస్ (హరకత్ అల్-ముఖ్వామా అల్ ఇస్లామియా) పాలస్తీనా ప్రాంతంలోని మిలిటెంట్ గ్రూప్. గాజా ప్రాంతంలోని పడమర భాగాన్ని హస్తగతం చేసుకొని ఇజ్రాయిల్‌తో పాలస్తీనీయుల తరపున దాడులు చేస్తున్న మిలిటెంట్ సంస్థగా భావించవచ్చు. ఇజ్రాయిల్ రాజ్యాన్ని డిఫాక్టోగా గుర్తిస్తుందని కొందరు చెబుతున్నా పాలస్తీనీయులను, గాజాను పూర్తిగా విముక్తి చేయడానికే తీవ్రంగా పాటుపడుతున్నది. ఖతార్ ఆర్థిక సహకారాన్ని హమాస్‌కు అందిస్తుందనే సమాచారం నమ్ముతున్నారు. అంతేగాదు ఎంతవరకు నిజమోకానీ ఖతార్‌కు అమెరికా గుట్టుచప్పుడు కాకుండా ఆర్థిక సహకారాన్ని అందిస్తుందని కూడా అంటారు. విదేశాంగ విధానాలూ, ఎత్తుగడలూ దౌత్యసంబంధాలు సామాన్యులకు ఒకపట్టాన అంతుపట్టవు. అందుకనే ఎవరు ఏ దేశానికి సహకారం అందిస్తున్నారో ఎవరు ఎవరికోసం పోరాడుతున్నారో మామూలు జనానికి అర్థంకావు. అయితే ఒకటి మాత్రం నిజం. ఇస్లామిక్ దేశాలతో ఇజ్రాయిల్‌కూ- ఇజ్రాయిల్‌తో - ఇస్లామిక్ దేశాలకూ ఏళ్లతరబడి శత్రుత్వం ఉన్న మాటవాస్తవం. అమెరికా యూరప్ దేశాలు ప్రపంచ శాంతి పేరుతో కొన్నాళ్లు తటస్థంగా, యుద్ధాల నివారణకు జోక్యం అవసరమని మరి కొన్నాళ్లు ఇలాంటి దేశాల మధ్య పొగరాజేస్తుంటారు. సీజ్‌ఫైర్ పేరిట సంధి ఒడంబడికలు కొన్నాళ్లు నిప్పును ఆర్పేస్తూనే ఉంటారు. రాజకీయాలు శాశ్వతం కానీ శత్రుత్వాలు శాశ్వతం కావని అంతర్జాతీయ వ్యవహారాలలో నమ్మక తప్పదు. హమాస్ ఇజ్రాయిల్ కనుక రెండు దేశాల ఏర్పాటులో సహకరిస్తేనే శాశ్వతంగా ఈ పోరాటాలకు విముక్తి కలుగుతుంది. రాజకీయ అవసరాలూ, దేశాలమధ్య ఏర్పడుతున్న అనేక ఇబ్బందులు ప్రక్కనపెట్టి నిజాయితీతో ఈ దురదృష్ట ప్రజల అవస్థలు, రెండువైపుల నుంచీ గమనిస్తే హృదయ విదారకమైన దారుణాలతోపాటు, కన్నీరు తెప్పించే వాస్తవాలు బయటకు వస్తాయి. గాజా ప్రాంతంలోని ప్రజలు తిండికి మొహం వాచి అల్లలాడుతున్నారు. ఆరోగ్య సమస్యలతో బాధపడ్తున్నారు. రోగాల బారిన పడి దేవుడా మాకెవరు దిక్కు అని విలపిస్తున్నారు. పాలస్తీనా ప్రాంతంలోని ప్రజలకు ఏదో ఒక విధంగా ప్రపంచ దేశాలు దారి చూపించకపోతే ఈ సీజ్‌ఫైర్‌లూ, శాంతిమాటలు కల్లిబొల్లి కబుర్లుగానే మిగిలిపోతాయి. యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్ బలమైన దేశాలమాటకు కట్టుబడిన సంస్థగానే మిగిలిపోతుంది. ఎప్పుడో ఏమూలనో యు.యన్ తరపున వ్యవహరించే యు.యన్ పీస్ కీపింగ్ ఫోర్స్ నామమాత్రంగానే సహాయపడ్తుంది.అరబ్-ఇజ్రాయిల్ దేశాల మధ్య ముఖ్యంగా ఇజ్రాయిల్-లెబనాన్‌ల మధ్య శాంతి తీరాలు సుదూరాన కూడా కనపడటంలేదు. ఎడతెగని దాడులు, ఎన్నిసార్లు ఒడంబడికలు జరిగినా ఇరువైపులా జరుగుతూనే ఉంటాయి. ఈ నిరంతరం నిప్పుల కొలిమిని ఆర్పేదెవరు? అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో బాటు రష్యా, చైనా, ఇండియా లాంటి దేశాల అధినేతలు,అరబ్బు దేశాలు- ఇజ్రాయిల్ లెబనాన్ దేశాల మధ్య అంతర్జాతీయంగా యు.ఎన్ ఆర్గనైజేషన్‌ను బరిలోకి దింపి ఏకాగ్రతతో, రాజకీయాలనూ, పాతవైరాలనూ దూరం పెట్టి నిజమైన, కొన్నేళ్లపాటు నిలిచిపోయే శాంతి మార్గాన్ని ఏర్పరుస్తేనే ఈ జాతుల వైరం సమిసిపోయే అవకాశంఉంది. అంతటి మహత్తరమైన అసాధారణ ప్రయత్నం అంతర్జాతీయంగా సాధ్యపడుతుందా? ఈ మిలియన్ డాలర్ల ప్రశ్నకు జవాబు ప్రస్తుతానికి కనపడటం లేదు. అయినా సరే ఆశను ఆవిరి కానివ్వకుండా నిరంతరం శ్రమిస్తూ ప్రయత్నించక తప్పదు. ●

# వ్యాపార ప్రయోజనాలు..ఉద్యోగుల ఆరోగ్యాలపై నిర్లక్ష్యం

మహమ్మద్ ఆరిఫ్

ఉద్యోగులు వారానికి 90 గంటలు పనిచేయాలని, ఆదివారాలు కూడా డ్యూటీకి వెళ్లాలని ఎల్ అండ్‌టీ ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఎంతసేపు ఇంట్లో కూర్చుంటారు? ఎంతసేపు భార్యలను చూస్తూ ఉండగలరు? అని ప్రశ్నించారు. గతంలో ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి, ఓలా సీఈఓ భవిష్ అగర్వాల్ సైతంఇలాంటి వ్యాఖ్యలే చేశారు. వారానికి 70గంటలు పనిచేయాలనిచెప్పుకొచ్చారు. అంతేకాకుండా 'బాగా తినండి. దృఢంగా ఉండి. అలాగే, రోజుకు 18 గంటలు పనిచేయండి' అంటూ బాంబే షేవింగ్ కంపెనీ సీఈఓ శంతను దేశ్‌పాండే గతంలో లింక్డిన్‌లో పోస్ట్ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడు సుబ్రహ్మణ్యన్ వ్యాఖ్యలపై తీవ్ర దుమారం అవుతున్నది. ఉద్యోగుల ఆరోగ్యాల గురించి పట్టించుకోకుండా కేవలం లాభాన్నే పరమావధిగా భావించి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే 55 గంటలకంటే ఎక్కువ పని చేయడం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఏడాదికి ఎనిమిది లక్షల మంది మృతిచెందుతున్నట్లు డబ్ల్యూహెచ్ఓ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.సుబ్రహ్మణ్యం వ్యాఖ్యలపై తీవ్ర వ్యతిరేకత 90గంటలు పని చేయాలన్న సుబ్రహ్మణ్యం వ్యాఖ్యలపై తీవ్ర వ్యతిరేకత వస్తున్నది. మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యమని బాలివుడ్ కథనాయిక దీపిక పదుకొణె పేర్కొన్నారు. సుబ్రహ్మణ్యం వ్యాఖ్యలను, కంపెనీ వివరణను తప్పుపట్టారు. 90 గంటలు పని చేయాలనే ఆలోచన మాత్రం ఆమోదయోగ్యం కాదని పారిశ్రామిక వేత్త హర్ష్ గోయెంకా స్పందించారు. పనిని,వ్యక్తిగత జీవితాన్ని సమతుల్యం చేయాల్సిన అవసరముందన్నారు. ఎక్కువ గంటలు పని చేసినంత మాత్రాన ఉత్పాదకత ఏమీపెరగదని, కుటుంబం, మానసిక ఆరోగ్యం ప్రతీ వ్యక్తికి ముఖ్యమని ఎడెల్‌వీస్ మ్యూచువల్ ఫండ్ సీఈఓ,ఎండీ రాధికా గుప్తా అన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ స్పందిస్తూ వర్క్‌లైఫ్ బ్యాలెన్స్ విషయంలో అనుసరిస్తున్న విధానాలను ఇతరులపైకి రుద్దొద్దని ప్రముఖులకు సూచించారు. ఎక్కువసేపుపనిలో నిమగ్నమైతే భార్యకూడా పారిపోతుందని పేర్కొన్నారు. ఇక్కడ ఎవరూ శాశ్వతంగా ఉండిపోవడానికి రాలేదని, ఈ విషయం అర్థమైనప్పుడు మన జీవితం సరళంగా మారుతుందన్నారు. కేవలం అభివృద్ధి, వ్యాపార ప్రయోజనాల కోసం కార్మికులు, ఉద్యోగుల ఆరోగ్యాలపై పడే ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోకపోవడం సరికాదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఎన్ని గంటలు పని చేశామనేది కాదు. ఎంత క్వాలిటీగా పని చేశామనేది ముఖ్యమని ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా అభిప్రాయపడ్డారు. క్వాంటిటీ కన్నా క్వాలిటీయే ముఖ్యమని, ఆదివారాలుతనను చూస్తూ ఉండడమే తన భార్యకు ఇష్టమని సీరమ్ ఇనిస్టిట్యూట్ సీఈఓ అదర్ పూనావాలా పేర్కొన్నారు. పనితో పాటు జీవితాన్ని బ్యాలెన్స్ చేసుకోవాలని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. విద్యావంతులు, ప్రముఖ కంపెనీల్లో ఉన్నత స్థాయిలో ఉన్నవ్యక్తులే ఇలా మాట్లాడడం సబబు కాదని మాజీ బ్యాడ్మింటన్ స్టార్ గుత్తా జ్వాలా పేర్కొన్నారు. వారానికి 90 గంటలు అంటే ప్రతి రోజు 12 గంటల పాటు పని చేయాల్సిందే. ఒక్కరోజు కూడా సెలవుకూడా ఉండదు. అదే సండే లాంటి రోజుల్లో సెలవుతీసుకొని 90గంటలు భర్తీ చేయాలంటే ఆరురోజుల పాటు13గంటలు పనిచేయాలి. వారానికి 70గంటలు పని చేయాలంటే ఏడు రోజులపాటుసెలవు తీసుకోకుండా రోజుకు పదిగంటలపాటు పనిచేయాల్సి ఉంటుంది. ఆరు రోజుల్లో 70 గంటలు పనిచేస్తే రోజుకు దాదాపు 12 గంటలు పని చేయాల్సిఉంటుంది. అదే ప్రైవేట్ కార్యాలయాల్లో రోజుకు పది గంటల పనితో వారానికి 60 గంటలు పని చేయిస్తున్నారనే చర్చఉన్నది. వారానికి 70 గంటలు పనిచేస్తే అనేక తీవ్రమైన వ్యాధులు వస్తాయని, అకాల మరణం ముప్పు పెరుగుతుందని న్యూరా లజిస్టులు హెచ్చరిస్తున్నారు. 55 లేదా అంతకంటే ఎక్కువ గంటలు పని చేయడం వల్ల హార్ట్‌స్ట్రోక్ వచ్చే ప్రమాదం 35 శాతం పెరుగుతుందని చెబుతున్నారు. అంతేకాకుండా అధికబరువు, ప్రీడయాబెటిస్, టైప్ 2 మధుమేహంవంటి ప్రమాదంకూడా ఉంటుందని పేర్కొంటున్నారు. అంతేకాకుండా అధిక పని గంటలు అమలు చేస్తే మహిళా కార్మికులపై ఇంకా తీవ్ర ఒత్తిడి పెరిగే అవకాశముంది. ●

# ఉద్యోగ అవకాశాలపై సంక్షోభాల ప్రభావం

డి జె మోహన రావు

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగమనంలో ఉందని కార్మిక మార్కెట్లు పూర్తిగా కోలుకోవడం కష్టమని జనవరి 16వ తేదీనాడు విడుదల చేసిన ప్రపంచ ఉపాధి సామాజిక దృక్పథం పోకడలు 2025 నివేదిక తెలిపింది. ప్రపంచ ఆర్థిక, భౌగోళిక రాజకీయ సంక్షోభాలను అతివ్యాప్తి చేయడం వల్ల ఏర్పడే కార్మిక మార్కెట్ అంతరాయ పరిధి పరిణామాలను నివేదిక కవర్ చేస్తుంది. కార్మికుల సమూహాలలో ప్రపంచ నమూనాలు, ప్రాంతీయ వ్యత్యాసాలు ఫలితాలను విశ్లేషిస్తుంది. ఉత్పాదకత,ఉద్యోగ నాణ్యత, ఉద్యోగ అవకాశాలపై వివిధ సంక్షోభాల ప్రభావం ఈ పోకడలు ప్రపంచవ్యాప్తంగా సామాజిక న్యాయాన్ని ఎలా దెబ్బతీస్తాయనే దానిపై నివేదిక ప్రత్యేక శ్రద్ధచూపుతుంది. 2024లో శ్రామిక శక్తికి అనుగుణంగా ప్రపంచ ఉపాధివృద్ధి చెందిందని,నిరుద్యోగ రేటును 5శాతంగా ఉందని నివేదిక పేర్కొంది. యువత నిరుద్యోగం స్వల్పంగా మెరుగుపడి 12.6 శాతంగా ఉంది. అనధికారిక పని, పని పేదరికం మహమ్మారి పూర్వ స్థాయికి తిరిగి వచ్చాయి. తక్కువ ఆదాయ దేశాలు మంచి ఉద్యోగాలను సృష్టించడంలో చాలా ఇబ్బందులను ఎదుర్కొన్నాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, పెరుగుతున్న వాతావరణ మార్పుల వ్యయాలు, అపరిష్కృత రుణసమస్యలు వంటి సవాళ్లను నివేదిక ఎత్తిచూపింది, ఇవి కార్మిక మార్కెట్లను ఒత్తిడికి గురిచేస్తున్నాయి. 2023, 2022లో వరుసగా 3.3, 3.6 శాతంగా ఉన్న ఆర్థికవృద్ధి 2024లో 3.2శాతానికి పడిపోయింది. 2025లో కూడా ఇదే స్థాయిలో వృద్ధి నమోదవుతుందని మధ్యకాలికంగా క్రమంగా క్షీణత నమోదవుతుందని అంచనా వేస్తున్నారు. ద్రవ్యోల్బణం తగ్గినప్పటికీ అది ఎక్కువగానే ఉంది. వేతనాల విలువను తగ్గిస్తుంది, నివేదిక కనుగొంటుంది. వాస్తవ వేతనాలు కొన్ని అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల్లో మాత్రమే పెరిగాయి. చాలా దేశాలు ఇప్పటికీ మహమ్మారి ద్రవ్యోల్బణం ప్రభావాల నుండి కోలుకుంటున్నాయి. ద్రవ్యోల్బణం తగ్గినప్పటికీ అది ఎక్కువగానే ఉందని ఇది వేతనాల విలువను తగ్గిస్తుందని నివేదిక పేర్కొంది. కొన్ని అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలలో నిజమైన వేతనాలు మాత్రమే పెరిగాయి. చాలా దేశాలు మహమ్మారి, ద్రవ్యోల్బణం ప్రభావాల నుండి ఇంకా కోలుకుంటున్నాయి. తక్కువ ఆదాయ దేశాలలో కార్మిక శక్తి భాగస్వామ్య రేట్లు తగ్గాయని, అధిక ఆదాయ దేశాలలో, ప్రధానంగా వృద్ధ కార్మికులు, మహిళల్లో పెరుగుతున్నాయని నివేదిక కనుగొంది. ఏదేమైనా, లింగ అంతరాలు విస్తృతంగా ఉన్నాయి. శ్రామిక శక్తిలో తక్కువ మంది మహిళలు ఉన్నారు. ఇది జీవన ప్రమాణాలలో పురోగతిని పరిమితం




చేస్తుంది. యువతలో భాగస్వామ్యం గణనీయంగా పడిపోయింది. చాలా మంది విద్య, ఉపాధి,శిక్షణ (నీట్)లో లేరు. ఈ ధోరణి ముఖ్యంగా అల్పాదాయ దేశాలలో స్పష్టంగా కనిపిస్తుంది. ఇక్కడ యువకుల నీట్ రేట్లు మహమ్మారికి ముందు చారిత్రక సగటు కంటే దాదాపు 4శాతం పాయింట్లు పెరిగాయి. ఇది వారిని ఆర్థిక సవాళ్లకు గురిచేస్తుంది. తక్కువ ఆదాయ దేశాలలో నీట్ రేట్లు 2024లో పెరిగాయి. యువకులు 15.8 మిలియన్లు (20.4 శాతం), యువతులు 28.2మిలియన్లు (37.0 శాతం) చేరుకున్నారు. ఇది 2023 నుండి వరుసగా 5 లక్షలు,7లక్షలు, పెరుగుదలను సూచిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా 2024లో 8.58 కోట్ల యువకులు (13.1 శాతం), 17.33 కోట్ల యువతులు (28.2 శాతం) నీట్‌కు హాజరయ్యారు. పని చేయాలనుకుని ఉన్నా కానీ ఉద్యోగం లేని వ్యక్తుల అంచనా సంఖ్య 2024లో 40.2 కోట్లకు చేరుకుంది. వీరిలో 18.6 కోట్ల మంది నిరుద్యోగులు, 13.7 కోట్ల మంది తాత్కాలికంగా పనికి అందుబాటులో లేనివారు,7.9 కోట్ల మంది నిరుత్సాహపరులైన కార్మికులు ఉద్యోగాల కోసం వెతకడం మానేశారు. మహమ్మారి తర్వాత ఈ అంతరం క్రమంగా తగ్గుతున్నప్పటికీ వచ్చే రెండేళ్లలో ఇది స్థిరపడుతుందని భావిస్తున్నారు. గ్రీన్ ఎనర్జీ,డిజిటల్ టెక్నాలజీల్లో ఉద్యోగ వృద్ధికి ఉన్న అవకాశాలను ఈ అధ్యయనం గుర్తించింది. సోలార్, హైడ్రోజన్ విద్యుత్ పెట్టుబడులతో ప్రపంచవ్యాప్తంగా పునరుత్పాదక ఇంధన ఉద్యోగాలు 1.62కోట్లకు పెరిగాయి. ఏదేమైనా ఈ ఉద్యోగాలు అసమానంగా పంపిణీ చేయబడ్డాయి. దాదాపు సగం తూర్పు ఆసియాలో ఉన్నారు. డిజిటల్ టెక్నాలజీలు కూడా అవకాశాలను అందిస్తున్నాయని,అయితే ఈ పురోగతి నుండి పూర్తిగా ప్రయోజనం పొందడానికి చాలా దేశాలకు మౌలిక సదుపాయాలు, నైపుణ్యాలు లేవని నివేదిక పేర్కొంది.సామాజిక న్యాయం, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు గౌరవప్రదమైన పని, ఉత్పాదక ఉపాధి అవసరమనిఐఎల్వో పేర్కొంది. ఇప్పటికే దెబ్బతిన్న సామాజిక ఐక్యత, పెరుగుతున్న వాతావరణ ప్రభావాలు, పెరుగుతున్న అప్పులను నివారించడానికి, కార్మికమార్కెట్ సవాళ్లను ఎదుర్కోవడానికి, న్యాయమైన, మరింత సుస్థిరమైన భవిష్యత్తును సృష్టించడానికి ఇప్పుడు చర్యలు తీసుకోవాలి అని తెలిపింది. ఆర్థిక వృద్ధి, ఉద్యోగాల కల్పనకు తోడ్పడేందుకు నైపుణ్య శిక్షణ, విద్య, మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు పెట్టాలి. అసమానతలను తగ్గించడానికి సామాజిక భద్రత, సురక్షితమైన పని పరిస్థితులకు మెరుగైన ప్రాప్యతను అందించాలి. తక్కువ ఆదాయ దేశాలు స్థానిక అభివృద్ధికి మద్దతు ఇవ్వడానికి రెమిటెన్స్‌లు, దయాస్పోరా నిధులనుఉపయోగించుకోవచ్చు. దక్షిణాసియాలో సాపేక్షంగా అధిక వృద్ధి రేట్లను సూచిస్తూ నివేదిక భారతదేశవృద్ధి పనితీరు ద్వారా నడపబడుతుందని పేర్కొంది. 2024లో జీడీపీ 6.2శాతం, 2025లో 5.8 శాతం వృద్ధి నమోదవుతుందని అంచనా వేసిన దక్షిణాసియాలో జీడీపీ పనితీరుకు భారత్ వృద్ధి ఊతమిస్తోంది అని తెలిపింది.2024లో 6.9శాతంగా, 2025లో 6.4 శాతంగా నమోదవుతుందని అంచనా వేసింది. మానిటరీ పాలసీ సడలింపు, బలమైన దేశీయ డిమాండ్, ప్రభుత్వ పెట్టుబడులే భారత్ వృద్ధికి కారణమని అంతర్జాతీయ మానిటరింగ్ ఫండ్ వంటి అంతర్జాతీయ సంస్థల అధ్యయనాలను ఉటంకిస్తూ నివేదిక పేర్కొంది. ●

## తెలుగు ప్రజల గుండెల్లో కొలువై ఉన్న తెలుగు జాతీయ దినపత్రిక వార్త

### -ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య

**నందిగామ జనవరి 20 ప్రభాతవార్త:** వార్త తెలుగు డైలీ జాతీయ దినపత్రిక 2025 క్యాలెండర్ను నందిగామ కాకాని నగర్లో గల టిడిపి పార్టీ కార్యాలయంలో నందిగామ శాసన సభ్యురాలు ప్రభుత్వ




విప్ తంగిరాల సౌమ్య చేతుల మీదుగా వార్త తెలుగు డైలీ జాతీయ దినపత్రిక 2025 క్యాలెండర్ను సోమవారం ఆవిష్కరించడం జరిగినది. ఈ సందర్భంగా నందిగామ శాసనసభ్యురాలు ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ఎప్పటికప్పుడు నూతన ఉత్తేజాన్ని పెంపొందించే మంచి మంచి వార్తలను ప్రచురిస్తూ గత 30 ఏళ్లగా 23 రాష్ట్రాల్లో వార్త తెలుగు జాతీయ దినపత్రిక ప్రజల మన్ననలను పొందిన ఏకైక జాతీయ తెలుగు వార్త దినపత్రిక ఒక్కటేనని అని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్త స్టేట్ బ్యూరో గంటా విజయ్కుమార్ నందిగామ నియోజకవర్గ ఇన్చార్జ్ జిల్లేపల్లి బుజ్జిబాబు కంచికచర్ల మండలం రిపోర్టర్ ఒంటి పులి ప్రసాద్ మరియు విలేకరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశాని కలిసిన నాగార్జున సాగర్ లాల్ బహుదూర్ కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కోట వీరబాబు

**చందర్లపాడు జనవరి 20 ప్రభాతవార్త:** ఈరోజు విజయవాడలో జరిగిన ప్రజా సమస్యలు పరిష్కార వేదికలో ఎన్టీఆర్, జిల్లా కలెక్టర్ గౌరవనీయులు లక్ష్మీశా ని కలిసిన నాగార్జునసాగర్ లాల్ బహుదూర్ కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కోట వీరబాబు. చందర్లపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు



మేకల సుధాకర్ చందర్లపాడు మండల తెలుగుదేశం నాయకులు బొందల రామకృష్ణ , షేక్ సైదా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 1 విజయవాడలో ప్రాజెక్టు కమిటీ కార్యాలయం ఏర్పాటు చేయాలని 2 నందిగామలో డిస్ట్రిబ్యూటర్ కమిటీ కార్యాలయాల నిర్మాణమునకు నిధులు మంజూరు చేయాలని 3 నందిగామలో రైతు శిక్షణ కేంద్రానికి నిదులు మంజూరు చేయాలని మరియు 4 చందర్లపాడు గ్రామంలో డ్రైనేజీ ల నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ని కోరిన నాయకులు.

# విజయవాడ వార్త

## ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికకు 12 పిర్యాదులు

**విజయవాడ కార్పొరేషన్,జనవరి 20,ప్రభాతవార్త:** సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అధికారులు 12 ఫిర్యాదులను అందుకున్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం లోని కమాండ్ కంట్రోల్ రూంలో ఇన్ఛార్జి కమీషనర్ డి.చంద్రశేఖర్ ఈ వేదికను నిర్వహించారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అత్యధికంగా పట్టణ ప్రణాళికా విభాగంలో-5



అందుకున్నారు. ప్రజారోగ్యానికి సంబంధించిన -1 ఇంజనీరింగ్-5,రెవిన్యూ విభాగం-1,ఫిర్యాదులను అధికారులు అందుకున్నారు. ఈ పరిష్కార వేదికలో చీఫ్ ఇంజనీర్ శ్రీనాథ్,సిటీ ప్లానర్ జి.విజిఎస్వి ప్రసాద్,డిప్యూటీ కమీషనర్(రెవిన్యూ)జి.సృజన,అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్,సూపరింటెండింగ్ ఇంజనీర్లు, పి.సత్య న్నారాయణ,పి.సత్యకుమారి,డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్,డిఎఫ్ఓ మాల్యాద్రి,వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బిఎస్ఎస్ సోమశేఖర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు జంపని షరీఫ్లో బడేపీర్ మహాత్ముల జెండా గంధ మహోత్సవం

**అమరావతి, జనవరి 20, ప్రభాతవార్త :** సుల్తాన్ ఉల్ ఔలియా గౌసె సమ్దాని మెహబూబ్ ఏ సుభాని సయ్యదినా షైఖ్ అబ్దుల్ ఖాదిర్ జీలాని మహాత్ముల వారి జెండా గంధ మహాత్ముల వారి జెండా గంధ మహోత్సవం ఈ నెల 21న మంగళవారం గుంటూరు జిల్లా వేమూరు నియోజకవర్గం జంపని ఎబిఎస్టిఎ దర్బార్ షరీఫ్లో ఘనంగా నిర్వహిస్తున్నట్లు సజ్జాదా అల్ ఖాదరియా అతా ముహమ్మద్ నిజాముద్దీన్ నిజామిషా తాజ్ ఖాదరీ ఆస్తాన అతా ఏ బాగ్ ఏ సర్కార్ తాజుల్ ఔలియా దర్బార్లో ఏక్షామ్ గౌసె ఆజం కేనామ్ లంగర్ ఏ ఆమ్ బడేపీర్ కే నామ్ మహాదివ్య అన్న సమారాధన పాల్గొనే బాబా వారి భక్తులకుకులమతాల కతీతంగా నిర్వహిస్తున్నట్లు అతా నిజాంబాబా సోమవారం మీడియాకు తెలిపారు.

## స్టేడియం పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలి : సిపి రాజశేఖరబాబు



**విజయవాడ క్రైం,జనవరి 20,ప్రభాతవార్త :** గణతంత్ర వేడుకల్లో పాల్గొనడానికి రాష్ట్ర గవర్నర్,సిఎం,మంత్రులు, వివిఐపిలు, విఐపిలు,ప్రజలు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంకు విచ్చేయనున్న దృష్ట్యా స్టేడియం పరిసర ప్రాంతాల్లో భద్రతాపరంగా ఎటువంటి లోపాలు లేకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సిపి రాజశేఖరబాబు ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 26న ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగనున్న దృష్ట్యా వాటి భద్రతా ఏర్పాట్ల గురించి సోమవారం సిపి రాజశేఖరబాబు,జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశాల అధ్వర్యంలో పోలీసు అధికారులు,జిల్లా అధికారులతో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆయా శాఖల అధికారులు చేసే ఏర్పాట్లపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన కంటింజెన్సీ బృందాల కవాతు ఏర్పాట్ల గురించి, ట్రాఫిక్ ఏర్పాట్ల గురించి కూలంకుషంగా చర్చించారు. స్టేడియంలోను,పరిసర ప్రాంతాల్లోను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అన్ని శాఖల అధికారుల సమన్వ యంతో అప్రమత్తంగా పటిష్టమైన బందోబస్థు ఏర్పాట్లుపై ఇతర ప్రయాణీకులకు వారి ప్రయాణంలో ఎటువంటి ఇబ్బందులుయ లేకుండా అవసరమైన ఇతర మార్గాలను నిర్ధేశించే విధంగా వాహనాల రద్దీ ఏర్పడకుండా పటిష్టంగా బందోబస్థును నిర్వహించాలని అధికారులతో సమీక్షా సమావేశంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఐజి ఐఎస్డబ్ల్యూ కె.ఆరిఫ్ హాఫీజ్,డిసిపి గౌతమి షాలి,ఎస్విడి ప్రసాద్,ఏడిసిటూ గవర్నర్ ఎన్వి రామాంజనేయులు,సబ్ కలెక్టర్ కె.చైతన్య,మున్సిపల్ అడిషనల్ కమీషనర్ డి.చంద్రశేఖర్,ఏడిసిపిలు ఎవిఎల్ ప్రసన్న కుమార్, కె.కోటేశ్వరరావు, కెవిఎంవిఆర్ ప్రసాద్,ఎస్వి రమణ,ఏసిపిలు,ఇతర శాఖ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## 24గంటల్లో రైతుల విద్యుత్ సమస్య పరిష్కారం

### - ఎంపి కేశినేని శివనాద్ (చిన్ని) చొరవతో రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా పెంపు

**ఎ కొండూరు, జనవరి 20, ప్రభాతవార్త :** ఎన్టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలం కోడూరు గ్రామానికి చెందిన రైతులు వ్యవసాయ భూముల్లో పంటలకు ఉచిత విద్యుత్ సరఫరా విషయంలో ఎదురొ్కంటున్న ఇబ్బందులను సన్న చిన్నకారు రైతులు విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) దృష్టికి తీసుకొనివెళ్లారు. ఈ ఉచిత విద్యుత్ సరఫరా విషయంలో రైతులకు జరుగుతున్న అన్యాయంపై వెంటనే స్పందించిన కేశినేని చిన్ని నూజివీడు డివిజన్ విద్యుత్ డిఈఈ సత్యనారాయణతో ఫోన్లో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. ఈ కోడూరు గ్రామంలో చెరువులు ఎన్ఎస్పి కాల్వలు అందుబాటులో లేకపోవడంతో 2400 ఎకరాలకు 876 వ్యవసాయ విద్యుత్ మోటార్ల ద్వారా పంటలు సాగు చేస్తున్నారు. ఆ గ్రామ రైతులు వ్యవసాయ విద్యుత్ మోటార్లపై ఆధారపడి వరి మొక్కజొన్న తదితర పంటలు సాగు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ విద్యుత్ మోటార్లకు 7 గంటల పాటు మాత్రమే సరఫరా చేస్తున్నారని దాన్ని మరో 2 గంటలు పెంచి విద్యుత్ సరఫరా చేయాలని దాని వల్ల పంటలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని కోడూరు గ్రామ రతులు ఎంపి చిన్ని దృష్టికి తీసుకువెళ్లగా తక్షణమే నూజివీడు డివిజన్ డిఈఈ సత్యనారాయణతో మాట్లాడి అధనంగా మరో 2 గంటలు విద్యుత్ సరఫరా చేయాలని డిఈఈని ఆదేశించారు. 24 గంటల్లోనే తమ సమస్య పరిష్కరించిన కోడూరు గ్రామ రైతులు హర్షం ప్రకటించడంతో పాటు విజయవాడ ఎంపి కేశినేని శివనాద్ (చిన్ని)కి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ,పెట్రోలు బంకు,సినిమా థియేటర్లను పరిశీలించిన తాహశీల్దార్


**కంచికచర్ల జనవరి 20 ప్రభాతవార్త:** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం తాహసిల్దార్ పీ జాహ్నవి సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జాహ్నవి మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పేషంట్లకి అవసరమైన అన్ని సదుపాయాలు ఉన్నాయా. సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా లేదా వారి డ్యూటీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. తప్పనిసరిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వచ్చే పేషెంట్ల కోసం సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాత్రి సమయంలో కూడా తప్పనిసరిగా డ్యూటీలో ఉండాలని సిబ్బందికి తెలియజేశారు. అనంతరం కంచికచర్లలో ఉన్న ఆయిల్ సిబ్బందికి తెలియజేశారు. అనంతరం కంచికచర్లలో ఉన్న ఆయిల్ పెట్రోల్ బంకుల్లో



తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలు ఆయిల్ బంకులో ఆయిల్ ఫిల్లింగ్ కరెక్ట్గా జరుగుతుందా లేదా డెన్సిటీ కరెక్ట్గా ఉందా లేదా తనిఖీ నిర్వహించారు. వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆయిల్లో ఎటువంటి తేడా లేకుండా డెన్సిటీ కరెక్ట్గా ఉండే విధంగా చూసుకోవాలని బంకు యాజమాన్యానికి సూచించారు. అనంతరం స్థానిక సినిమా హాలల్లో నియమ నిబంధనలు పాటిస్తున్నారా లేదా అని తనికెళ్లి నిర్వహించారు. సినిమా థియేటర్లో ప్రభుత్వ నిబంధనలకు అనుకూలంగా పైరు మరియు సిట్టింగ్ కెపాసిటీ టికెట్ల ధర వివరాలు పరిశీలించారు. ఆయిల్ బంకుల్లో సినిమా దియేటర్లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వంనిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. థియేటర్లలో టికెట్ ధర ప్రభుత్వ నిర్ణయించిన ధరలకే అమ్మాలని అంతకుమించి టికెట్లు ధర పెంచి అమ్మితే థియేటర్ యజమానిపై చర్య తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వీఆర్వో ఆర్ఐ రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 23న చీమలపాడు అతావుల్లా బాబా దర్బార్లో రజ్జబ్ ఉత్సవం

**ఎ కొండూరు, జనవరి 20, ప్రభాతవార్త :** సగె ఖాక్పాయె ఔలియా వనఖీబుల్ ఔలియా సూఫీ ఖ్వాజా ముహమ్మద్ అతావుల్లా షరీఫ్ షాహ్ తాజ్ ఖాదరి బాగ్దాఇ బాబా వలి అల్లా వారి దివ్య ఆశీస్సులతో ఎన్టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం చీమలపాడు ఎఎంటికె దర్బార్ బాబె ఎ బాగ్దాద్ దర్బార్ అండ్ దర్గా షరీఫ్లో ఈ నెల 23 గురువారం రజ్జబ్ నెల ఉత్సవాల సందర్భంగా అత్యంత భక్తి శ్రద్దలతో సాంప్రదాయబద్దంగా ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఎఎంటికె దర్బార్ పీఠాధిపతి, పీర్జాదా ముహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ షరీఫ్ షాతాజ్ ఖాదరీ, చీమలపాడు షరీఫ్ బాబా ఆదివారం మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ హుజూర్ హజరత్ సయ్యదిన ఇమామె జాఫర్ సాదిఖ్ (ర.అ) వారి దివ్య సమరాధన (ఖీర్పూరి ప్రసాదం కజ్జికాయల పంపిణీ వైభవోపేతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం ఈ ప్రసాదం పంపిణీ కార్యక్రమం ఉదయం 6 గంటలకు ఫాతెహాఖాని (నైవేద్యం) జరిపి సాయంత్రం 6 గంటల వరకు కులమతాల కతీతంగా నిరాటంకంటం ఖీర్పూరీ ప్రసాదం వేలాది మంది బాబా వారి భక్తులకు పంపిణీ చేస్తున్నట్లు, అలాగే లంగర్ షరీఫ్ అన్నదానం నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి పీర్జాదా ముహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ షాతాజ్ ఖాదరీ బాబా తెలిపారు. ఈ సమావేశంలో ఎండి జాఫర్ షరీఫ్ బొగ్దాది తాజ్ ఖాదరి బాబు పాల్గొన్నారు.



## నందిగామలో జాతీయ రహదారిపై లక్ష్మీ ప్రసన్న థియేటర్ వద్ద స్పీడ్ బ్రేకర్ను ఏర్పాటు చేయాలి

**నందిగామ జనవరి 20 ప్రభాతవార్త:** నందిగామలో జాతీయ రహదారిపై లక్ష్మీ ప్రసన్న థియేటర్ వద్ద స్పీడ్ బ్రేకర్ను ఏర్పాటు చేయాలని రైతు కూలీ సంఘం మున్సిపల్ కమిషనర్ కు విజ్ఞప్తి చేస్తోంది. ఇది ఆరు రోడ్ల జంక్షన్ గా ఉండటం వలన నిరంతరం రాకపోకలు స్పీడుగా జరుగుతుండటంతో రోడ్డు క్రాసింగ్ చేసే సమయంలో వృద్ధులు బాలలు, మహిళలు చిన్న వాహనదారులు రోడ్లు దాటడం చాలా కష్టంగా ఉన్నందున వెంటనే స్పీడ్ బ్రేకర్ ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ , పాలక వర్గం దీనిపై దృష్టి పెట్టి తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

## గొట్టుముక్కల గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరం

**కంచికచర్ల జనవరి 20 ప్రభాతవార్త:** కంచికచర్ల మండల పరిధిలోని గొట్టుముక్కల గ్రామంలో సోమవారం ఉదయం ఎన్టీఆర్ జిల్లా పశు జంతు సంరక్షక శాఖ సంయుక్త సంచారకులు డాక్టర్ ఎం హనుమంతురావు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఈ పశు ఆరోగ్య శిబిరాలను ప్రారంభించారు. ఈ




సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సోదరులకు పశు సంరక్షక శాఖ నుండి గోకులాలు, బహు వార్షిక పశుగ్రాస పెంపకము , మేలు జాతి పెయ్య దూడలను పుట్టించడం కోసం అందుబాటులోకి తీసుకొచ్చిన లింగ నిర్ధారిత వీర్యం సరఫరా, పశు కిసాన్ క్రెడిట్ కార్డులు పంపిణీ, సైలేజీ ఉత్పత్తి నిమిత్తం 50 శాతం మిని సైలేజీ యూనిట్లను రైతులకు అందజేయుట గురించి రైతు సోదరులకు వివరంగా తెలియజేశారు. ఈ పశు వైద్య ఆరోగ్యం శిబిరం కార్యక్రమంలో 24 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స 80 దూడలకు నట్టల నివారణ, 150 గొర్రెలు మరియు మేకలకు నట్టల నివారణ 600 పశువులకు వ్యాది నిరోధక టీకాలు వేయడమైనది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తుళ్ళిమల్లి రాజ్ కుమార్ . ఉప సర్పంచ్ గోగినేని అమర్నాథ్ , ఎంపీటీసీ గుదే సత్యవతి రంగారావు గోగినేని శ్రీనివాసరావు ఉప సంచారకులు డాక్టర్ మోజేష్, వెస్లీ, డాక్టర్ యు జి కృష్ణమూర్తి సహాయ సంచారకులు డాక్టర్ కె వెంకటరావు ఎం నవీన్ కుమార్ అనిల్ కుమార్, పశు ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ట్రిబుల్ ఐటి సీటు సాధించిన విజ్ఞాన్ విద్యార్థిని మూడావత్ వెన్నెలకు అభినందన

**జగ్గయ్యపేట, జనవరి 20, ప్రభాతవార్త :** జగ్గయ్యపేట పట్టణంలోని విజ్ఞాన్ విద్యాలయ విద్యార్థిని మూడావత్ వెన్నెల ట్రిబుల్ ఐటి సీటు సాధించిన సందర్భంగా సోమవారం వైఎస్ఆర్సిపి నియోజకవర్గ సమన్వయకర్త, విజ్ఞాన్ విద్యాలయ వ్యవస్థాపకులు తన్నీరు నాగేశ్వరరావు, డైరెక్టర్ తన్నీరు సుధారాణి అభినందిస్తూ చిరు సన్మానం చేశారు. వెన్నెల ఇడుపులపాయ బ్రాంచిలో ట్రిబుల్ ఐటి సీటు సాధించటం ఎంతో గర్వకారణమని ప్రశంసించారు. భవిష్యత్లో మరిన్ని విజయాలను సొంతం చేసుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. డైరెక్టర్ సుధారాణి మాట్లాడుతూ తమ విద్యాసంస్థ ఎన్సిసి కలిగి ఉండటం వలన ఇటువంటి ప్రతిష్టాత్మక సీట్లు సాధించటం సులభతరం అవుతుందన్నారు.




## ఆర్థిక పెట్టుబడుల పై విద్యార్థులకు అవగాహన సదస్సు

**విజయవాడ, జనవరి 20, ప్రభాతవార్త :** భారతదేశంలోని పెట్టుబడిదారులకు ఆర్థిక పెట్టుబడుల పట్ల అవగాహన కల్పించి ప్రోత్సహించేలా నిర్దేశించిన సెంట్రల్ డిపాజిట్ సర్వీసెస్ లిమిటెడ్ యొక్క ఇన్వెస్టర్స్ ప్రొటెక్షన్ ఫండ్ ఏలూరులోని సిఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో విద్యార్దులకు అవగాహన కల్పించారు. ప్రధానంగా



తెలుగులో వక్తలు అందరికీ అర్థం అయ్యేలా నిర్వహించడంతో పెట్టుబడిదారులకు అత్యంత సులభంగా పెట్టుబడులు, డిపాజిటరీ సేవల ప్రాథమిక అంశాలు అర్థమయ్యేలా వివరించారు. సుమారు 1.45లక్షల పెట్టుబడిదారులకు ప్రాంతీయ భాషల్లో నిర్వహించి అవగాహన కల్పించామని నిర్వహకులు తెలిపారు. ఆత్మనిర్భర్ పెట్టుబడిదారునిగా తీర్చిదిద్దడానికి కావాల్సిన పరిజ్ఞానం, నైపుణ్యాలను అందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున విద్యార్దులు పాల్గొన్నారు.

## దాసన్నకు ఘన స్వాగతం పలికి వైకాపా శ్రేణులు

**ఎ కొండూరు, జనవరి 20, ప్రభాతవార్త :** ఎన్టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వైసిపి ఇన్చార్జ్ నల్లగట్ల స్వామిదాస్ అమెరికా పర్యటన విజయవంతంగా ముగించుకుని స్వదేశానికి



చేరుకుని స్వంత గడ్డ తిరువూరు వచ్చిన సందర్భంగా వైసిపి నియోజకవర్గ నేతలు కార్యకర్తలు స్వామిదాస్కు పెద్ద ఎత్తున తిరువూరులో మర్యాదపూర్వకంగా కలుసుకుని ఘన స్వాగతం పలికారు. ఎ కొండూరు మండల వైసిపి యూత్ అధ్యక్షుడు కాలసాని చెన్నారావు (రాడ్) నాయకత్వంలో తిరువూరు నియోజకవర్గం సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు తేళ్లూరి సురేష్, జరబల పెద్దబాబు చిమట రామకృష్ణ (రేజా) కె.వైకుంఠరావు, బద్దు నాయక్, చినబాబు పిఏసిఎస్ మాజీ చైర్పర్సన్ ఎ వెంకటరెడ్డి వెంకటేశ్వరరావు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిదాస్ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చములు అందజేసి శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్వామిదాస్కు వైసిపి శ్రేణులు నాయకులు కార్యకర్తలు చెన్నారావు క్రిస్మస్ నూతన సంవత్సరం సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

## 25నుండి సిద్ధాంత పండిత సభ

**విజయవాడ, జనవరి 20, ప్రభాతవార్త :** ఈనెల 25, 26 తేదీల్లో కొలనుకొండలోని కంచికామకోటి సిద్ధాంత పండిత సభ నిర్వహిస్తున్నట్లు కంచికామకోటి సర్వజ్ఞపీఠ ఆస్థాన సిద్ధాంతి విజయ సుబ్రహ్మణ్య సిద్ధాంతి తెలిపారు. శ్రీ కంచికామకోటి పీఠం జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి ఆదేశానుసారం నిర్వహించే ఈ సభలో ప్రధానంగా ఉత్తరాయణ ఆరంభ నిరూపణం అనే అంశంపై చర్చిస్తారన్నారు. ఏపి, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్నాటక, ముంబై తదితర రాష్ట్రాల నుండి కొందరు ప్రత్యక్షంగానూ, మరికొందరు ఆన్లైన్ద్వారా పాల్గొంటారన్నారు. జ్యోతిష్య ఖగోళ పరిశోధనలపై ఆసక్తి కలిగిన పండితులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని లక్కావఝుల విజయ సుబ్రహ్మణ్య సిద్ధాంతి పిలుపునిచ్చారు.

## పరిశుభ్రత జీవన విధానంలో భాగం కావాలి

### -స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్లో సర్పంచ్ మోర్ల వెల్లడి

**ఎ కొండూరు, జనవరి 20, ప్రభాతవార్త :** పరిశుభ్రత మన జీవన విధానంలో ఒక భాగం కావాలని ఎ కొండూరు మండలం చీమలపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ మోర్ల లక్ష్మీ సాంబశివరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతి మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీ సెక్రటరీ బి గోపికృష్ణ వెల్ఫేర్ కుసుమతో కలిసి సర్పంచ్ మోర్ల లక్ష్మీ ఈ కార్యక్రమాన్ని శనివారం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించారు. పరిశుభ్రత వల్ల సమాజం గ్రామం రాష్ట్రం దేశం ఎంతో ఆరోగ్యవంతంగా ఉంటుందని ఆరోగ్యవంతమైన సమాజం ద్వారా ఎంతో అభివృద్ధి సాధించవచ్చని జడ్పీటిసి మెంబర్ భూక్యా గనియా పేర్కొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి ప్రెసిడెంట్ బెజవాడ శంకర్ టిడిపి సీనియర్ లీడర్ సూరిశెట్టి సుబ్బారావు మండల మైనార్టీ లీడర్ ఎస్కె ఆదాం, డిజిటల్ అసిస్టెంట్ బి గోపాల్ గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.




## జగ్గయ్యపేట స్విమ్మింగ్పూల్ను మునిసిపాలీటికి అప్పగించాలి : ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

**జగ్గయ్యపేట, జనవరి 20, ప్రభాతవార్త :** జగ్గయ్యపేట మున్సిపల్ పట్టణంలోని స్విమ్మింగ్పూల్ను మున్సిపాల్టీకి అప్పగించాలని అలాగే జగ్గయ్యపేట పట్టణంలోగల రెండు శాప్ క్రీడా ప్రాంగణాలను అభివృద్ధిపర్చి సౌకర్యాలు మెరుగుపర్చి అవసరమైన వసతులన్నీ కల్పించాలని ఏపి క్రీడ అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిమిని రవినాయుడు, శాప్ ఎండ్ పిఎస్ గిరీషలను సోమవారం విడివిడిగా కలుసుకుని వారితో సమావేశమైన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ కోరారు. జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, టిడిపి నేత నోముల రఘు కూడా ఎంఎల్ఏ రాజగోపాల్తోపాటు పాల్గొన్నారు. దీంతో శాప్ చైర్మన్, ఎండి సానుకూలంగా స్పందిస్తూ అవసరమైన అన్ని పనులను పూర్తిచేస్తామని ఇందుకు అధికారుల బృందాన్ని జగ్గయ్యపేటకు పంపి వారి నుండి నివేదిక అందగానే అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జగ్గయ్యపేట ప్రాంతం నుండి అత్యుత్తమ క్రీడాకారులను తయారుచేసే బాధ్యతతో వారికి అన్ని వసతులు, మౌళిక సదుపాయాలు కల్పిస్తామని శాప్ చైర్మన్, ఎండి వాగ్ధానంచేశారు. అనంతరం విలియంపేటకు నీటి సరఫరాను మెరుగుపర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఇఇపిహెచ్ స్వామినాయుడును కలుసుకున్నారు. కార్యక్రమాల్లో జగ్గయ్యపేట పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యదర్శి మైనేని రాధాకృష్ణ, కౌన్సిలర్ నకిరికంటి వెంకట్, నేత నోముల రఘు పాల్గొన్నారు. తదనంతరం ఎంఎల్ఏ రాజగోపాల్, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర జిల్లా కలెక్టర్ లక్ష్మీ శాను కలుసుకుని అభివృద్ధి పనుల గురించి చర్చించారు. నియోజకవర్గంలో డిఎంఎఫ్ ఫండ్స్ విడుదల చెయ్యాలని, ముక్త్యాల రోడ్లోని చెత్త డంపింగ్ యార్డు స్థలాన్ని మార్చటం కాని దుర్గంధ వాసన రాకుండా శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోవాలని కలెక్టర్ను కోరారు. నియోజకవర్గ పరిధిలోవున్న సీలింగ్ భూముల వివరాలను తహసీల్ధార్ కార్యాలయంలో ఏర్పాటు చెయ్యాలని, సీలింగ్ భూములు, కోర్టుల్లోవున్న భూములను కొందరు వ్యక్తులు ఆక్రమించి అనుభవిస్తున్నారని ఈసమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరింపజేయాలని విన్నవించారు. అలాగే జగ్గయ్యపేట పట్టణంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ను ఏర్పాటు చెయ్యాలని, ఐటి పార్కును కూడా ఏర్పాటు చేయించాలని కలెక్టర్ను కోరారు.



## రోడ్డు భద్రతా నియమాలు ఉంది ప్రాణరక్షణ కోసమే : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,జనవరి20,ప్రభాతవార్త:** రోడ్డు భద్రతా నియమాలు ఉన్నది మన ప్రాణరక్షణ కోసమేనని వాస్తవాన్ని వాహనదారులు తెలుసుకోవాలని మాజీమంత్రి, స్థానిక శాసన సభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. సోమవారం పట్టణంలో ఎన్ఆర్‌టి సెంటర్ వద్ద జాతీయ రోడ్డు భద్రతా



మాసోత్సవాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రతా నిభందనలను విధిగా పాటించాలని,ముఖ్యంగా యువత ట్రాఫిక్ రూల్స్‌ను నిర్లక్ష్యం చేయడం ఎంతమాత్రం మంచిది కాదని చెప్పారు. రోడ్డు భద్రతలకు సంబందించిన విస్మరించడమంటే కోరి ప్రాణాలమీదకు తెచ్చుకోవడమే అవుతుందని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. రోడ్డుపైకి వచ్చి క్షేమంగా ఇంటికి వెళ్లే వరకు ప్రతి ఒక్కరూ తమ కుటుంబాలగురించి ఆలోచించాలని ఆయన హితవు పలికారు. నిత్యం జరిగే ఎన్నో రోడ్డు ప్రమాదాలు చూస్తూకూడా, స్వీయ నియంత్రణ లేకుండా వాహనాలు నడపడం ఎప్పటికి, ఎవరికి మంచిది కాదని అన్నారు. మద్యం, ఇతర మత్తుపదార్థాలు తీసుకొని వాహనాలు నడపడం ముమ్మాటికి క్షమించరాని నేరమని ప్రత్తిపాటి తెలిపారు. హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం మన జీవితంలో సక్రమంగా నెరవేర్చాలన్న భాద్యతలేనన్న విషయం మరువకూడదని అన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి కూటమి ప్రభుత్వం ట్రాఫిక్ నిబంధనలు కఠినతరం చేస్తుందని, ఇటీవల సుప్రీంకోర్టు కూడా ఈ దిశగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలను ఆదేశించిందని ప్రత్తిపాటి తెలిపారు. గత ప్రభుత్వం గాలికి వదిలేసిన రోడ్ల నిర్మాణం, మరమ్మత్తులను చంద్రబాబు ప్రభుత్వం యుద్ద ప్రాతిపదికన చేపట్టిందని ప్రత్తిపాటి తెలియ చేశారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలలో బాగంగా, భద్రతా నిబంధనలు ప్రజలకు తెలియచేస్తూ ర్యాలి నిర్వహిస్తున్న ఆటో, జీపు డ్రైవర్లను ప్రత్తిపాటి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కెఎల్‌రావు, యంవిఐ కార్యాలయ సిబ్బంది, టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు, పఠాన్ సమద్‌ఖాన్, జవ్వాజి మదన్‌మోహన్, కామినేని సాయిబాబు, ఎస్ఎస్ సుభాని, మద్దుమాల రవి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే చదలవాడ

**నరసరావుపేట టౌన్, జనవరి 20 ప్రభాతవార్త :** పట్టణంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు సోమవారం



ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు శ్రీకారం చుట్టారు. కార్యక్రమాలలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు మాట్లాడుతూ రూ.కోటి 30 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపన చేయడం జరిగిందన్నారు. మార్కెట్‌యార్డులో నిర్మాణంలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు సంబంధించి పంప్ హౌస్‌ను, పైపులైన్లను ఏర్పాటు చేసేందుకు రూ.35 లక్షలు వ్యయం చేస్తున్నామన్నారు. ఈ పనుల ద్వారా కోటప్పకొండరోడ్డులోని కాలనీలకు మంచినీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. అదే విధంగా చిత్రాలయ సెంటర్‌లో రూ.30 లక్షలతో సి.సి.రోడ్డును నిర్మిస్తున్నామని తెలియజేశారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు సి.సి.రోడ్డు నిర్మాణం జరుగుతుందని తెలియజేశారు. దీంతో పాటు బరంపేటలోని చప్టా స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మించేందుకు శ్రీకారం చుట్టామన్నారు. రూ.30 లక్షల వ్యయంతో బ్రిడ్జి నిర్మాణం జరుగుతుందన్నారు. ఎన్నో ఏళ్ళుగా ఈ సమస్యను బరంపేట ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్నారని పరిష్కార మార్గం చూపామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జశ్వంత్‌రావు, పార్టీ నాయకులు వాసిరెడ్డి రవి, కొవ్వూరి బాబు, అంకమ్మచౌదరి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత పశు వైద్యశిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి : ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

**వినుకొండ,జనవరి20,ప్రభాతవార్త:** మండలంలోని నడిగడ్డ గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పశువులు చనిపోతే 21 రోజుల్లోనే పాడి రైతులు, జీవాల పెంపకందారులకు భీమా పరిహారం అందిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయం, పాడి రైతుల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగా ప్రతి గ్రామానికి 2 గోకులాలు మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. పాడిపరిశ్రమ అభివృద్ధి, సంరక్షణ చర్యల్లో భాగంగా నియోజకవర్గంలో ఈ నెల 20 నుంచి 31 వరకు ఉచిత పశు వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరాల్లో పశువులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించిన మందులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న వివిధ



ప్రభుత్వ పథకాలపై పాడిరైతులకు పూర్తి అవగాహన సదస్సులు నిర్వహిస్తారని నియోజకవర్గ పాడి రైతులు ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వైకాపా హయాంలో పశు సంచార వాహనాల పేరిట వందల కోట్లు కాజేశారన్నారు. వైకాపా పాలనలో పాడిరంగం రైతులు పూర్తిగా నష్టపోయారని చెప్పారు. కూటమి ప్రభుత్వం రైతులు, పాడిరంగం అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## వైకాపా రైతులపై రాజకీయ వేధింపులు ఆపాలి : మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి

**నరసరావుపేట, జనవరి 20 ప్రభాతవార్త :** వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి చెందిన రైతులపై రాజకీయ వేధింపులను ఆపాలని, జిల్లా



అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోనూ, ఎస్పీ కార్యాలయంలో ఆయన బాధితులతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రొంపిచర్ల మండలం పరగటిచర్ల గ్రామానికి చెందిన సర్పంచ్ కామినేని ఆదయ్య, వెంకయ్య, నారయ్య సోదరులకు చెందిన తొమ్మిది ఎకరాల పొలంలో దౌర్జన్యంగా రూ.2.50 లక్షల విలువ చేసే సుబాబుల్ చెట్లను దౌర్జన్యంగా నరికి తీసుకెళ్ళారన్నారు. అదే విధంగా తొమ్మిది ఎకరాల పట్టా భూమిలో అక్రమంగా రోడ్డు నిర్మాణం చేపట్టడం అన్యాయమన్నారు. రోడ్డు పేరుతో ఎకరం పొలాన్ని కాజేసే కుట్ర జరుగుతుంద న్నారు. ఎకరం విలువ రూ.15 లక్షలు ఉందన్నారు. టిడిపికి చెందిన కందుల ఆంజనేయులు, కందుల బ్రహ్మయ్యలు దౌర్జన్యం చేస్తున్నారని తెలిపారు. 2010లోనే కోర్టు తొమ్మిది ఎకరాలకు సంబంధించి తీర్పును ఇవ్వడం జరిగిందన్నారు. ఎటువంటి రోడ్డు నిర్మాణానికి అనుమతులు లేవన్నారు. రెవిన్యూ, పోలీస్ అధికారులు అడ్డుకున్నా టిడిపి నాయకులు దౌర్జన్యం చేయడం అన్యాయంగా ఉందని మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

## వాసవి ప్లాటినం క్లబ్ ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ

**చిలకలూరిపేటటౌన్,జనవరి20,ప్రభాతవార్త:** వాసవి ప్లాటినం,వాసవి ఫ్యామిలీస్, గ్రేటర్ క్లబ్స్ ఆధ్వర్యంలో పేద ఆర్యవైశ్యులు 40మందికి దాతల సహకారంతో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఫించన్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పట్టణ సేవాధళ్ అధ్యక్షులు తేజ పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో తవ్వా



నాగమల్లేశ్వరరావు, దామిశెట్టి నాగేంద్రం, ఆర్వపల్లి సత్యనారాయణ, నున్నా నాగేశ్వరరావు, శ్రీరాం ఆంజనేయులు, శిఖాకొల్లి భాస్కరరావు, గురునాథం మరియు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.


## ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు భద్రత పెంచాలి

### -జనసేన రాష్ట్ర నాయకుడు పెంటేల బాలాజీ

**చిలకలూరిపేట,జనవరి20,ప్రభాతవార్త:** అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడిగా ప్రజలలో ఉంటూ ప్రజాసంక్షేమాన్ని కాంక్షిస్తున్న జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి, పవన్ కళ్యాణ్‌కు భద్రత పెంచవలసిన అవసరం ఎంతైనా ఉందని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్రా కో కన్వీనర్ పెంటేల బాలాజీ అన్నారు. సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే పరమావధిగా అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తూ ప్రజల మన్ననలను పొందిన పవన్‌కళ్యాణ్ మన్ననలను పొందుతున్నారని, ఇది చూసి ఓర్వలేని అరాచక శక్తులు పవన్‌కళ్యాణ్‌ని లక్ష్యంగా చేసుకున్నారని భావించవలసి వస్తుందని అన్నారు. ప్రజలలో ఉంటూ ప్రజాసమస్యలు తెలుసుకోవడానికి జిల్లా పర్యటనకు సిద్ధమవుతున్న తరుణంలో భద్రతపై పున:సమీక్షించి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని బాలాజీ కోరారు. ఇటీవల ఉపముఖ్యమంత్రి కార్యాలయం, పార్టీ కేంద్ర కార్యాలయంపై గుర్తుతెలియని డ్రోన్ చక్కర్లు కొట్టడంపై విచారించి భద్రత విషయంలో సమీక్షించాలని ఆయన కోరారు.

## పశు వైద్య శిబిరం

**బెల్లంకొండ, జనవరి 20 ప్రభాతవార్త :** మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో సోమవారం పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 70 పశువులకు చికిత్స నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌తో పాటు పశువైద్యులు డాక్టర్ జి.బాలకృష్ణారెడ్డి మాట్లాడారు. 14 పశువులు యదకు రాలేదన్నారు. 23 గేదెలకు నట్టల మందు ఇవ్వడం జరిగిందన్నారు. 31 దూడలకు మందు ఇవ్వడంతో పాటు 50 జీవాలకు బొబ్బా టీకాలు వేశామన్నారు. కార్యక్రమంలో పశు వైద్యులు, సిబ్బంది, గోపాలమిత్రులు పాల్గొన్నారు.



## ప్రతి పిర్యాదు పరిష్కారం కావాలి : పల్నాడు జిల్లా కలెక్టరు

**నరసరావుపేట, జనవరి 20 ప్రభాతవార్త :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి ఫిర్యాదును పరిష్కరించాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాలిచ్చారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను జేసి సూరజ్‌గనోరేతో కలిసి ఆయన నిర్వహించారు. ప్రజల నుండి మొత్తం 32 వినతులు అందినట్లు తెలిపారు. తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకంతో అర్జీదారులు ఇక్కడకు



వస్తున్నారని తెలిపారు. సమస్యలను సావధానంగా విని సత్వర పరిష్కారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రెవిన్యూ అధికారి మురళి, వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**సర్వేలు వేగంగా పూర్తి చేయండి : కలెక్టర్**

జిల్లాలోని సచివాలయాల ద్వారా నిర్వహిస్తున్న వివిధ రకాల సర్వేలు వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాలిచ్చారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు 426 ఉన్నాయని, వాటిలో 157 పాక్షికంగా, 256 పూర్తి స్థాయిలో పని చేస్తున్నాయన్నారు. ఈ నెల 21 నుండి 25,27,31 వరకు ప్రత్యేక ఆధార్ కేంద్రాలను అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహించి 0-6 సంవత్సరాలలోపు పిల్లలకు ఆధార్ ఇవ్వాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు బాలునాయక్, భాస్కర్‌రెడ్డి, మురళి, కుముదిని, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

## యడ్లపాడు ఒన్ విఆర్వోను బాధ్యతల నుండి తప్పించిన పల్నాడు కలెక్టరు

**యడ్లపాడు, జనవరి 20, ప్రభాతవార్త :** యడ్లపాడు ఒన్ విఆర్వో విధులు నిర్వహించుతున్న సయ్యద్ సుభానిని విధులు నుండి తప్పించటం జరిగిందని, సంబంధిత ఉత్తర్వులు కలెక్టర్ కార్యాలయం నుండి లిఖిత పూర్వకంగా అందాయని తహశీల్దార్ విజయశ్రీ తెలిపారు. బాధ్యతల నుండి తప్పించటానికి ప్రధానంగా సక్రమంగా బాధ్యతలు నిర్వహించకుండా రాకపోవటం మరియు ఉద్యోగం ఇప్పిస్తానని ఒకరిని మోసం చేయటం, గతంలో వంకాయలపాడు విఆర్వోగా ఉన్న సమయంలో స్థానిక రైతుల నుండి నగదు తీసుకోవటం వంటివి భారీ మొత్తంలో ఉన్నాయని, వీటన్నిటిని పై ఫిర్యాదులు అందటంతో సంబంధిత విఆర్వోను బాధ్యతల నుండి తప్పించటం జరిగిందన్నారు. తదుపరి ఉన్నతాధికారుల అదేశానుసారంగా నిర్వహించటం జరుగుతుందన్నారు.

## మునిసిపల్ చైర్మన్ షేక్ రఫానిని పరామర్శించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, జనవరి20,ప్రభాతవార్త:** మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానికి ఇటీవల శస్త్ర చికిత్స జరగటంతో విషయం తెలుసుకున్న మాజీమంత్రి, నియోజకవర్గ శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు సోమ వారం ఆయన గృహనికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య



పరిస్థితి గురించి విచారించి త్వరలో కోలుకోవాలని ప్రత్తిపాటి ఆకాంక్షించారు.

## కొత్తపాలెం గ్రామంలో ప్రారంభమైన పశు వైద్య శిబిరం

యడ్లపాడు, జనవరి 20, ప్రభాతవార్త : మండల పరిధిలోని కొత్తపాలెం గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన పశు అర్యో శిబిరాలను పశు సంవర్ధక శాఖ వైద్యులు సోమవారం ప్రారంభించారు. ఇందులో బాగంగా 300ల గొర్రెలు, మేకలకు, 80పశువులకు,



40దూడలకు నట్టల నివారణ మందులు ఇవ్వటం, మరో 20 పశువులకు గర్భకోశ వ్యాధులకు సంబంధించికిత్సలు నిర్వహించటం జరిగిందని యడ్లపాడు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ రాధాకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యులు పి రోజర్ బిన్నీ, సిబ్బంది సత్యనారాయణ, రవి ప్రకాష్ రాజ్, జ్యోతి గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారవేదికకు 13 అర్జీలు

**రేపల్లె(నిజాంపట్నం), జనవరి 20, ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కారవేదికకు 13 అర్జీలు వచ్చాయని ఆర్‌డిఓ రామలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక ఆర్‌డిఓకార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు అర్జీలను అందజేయాల న్నారు. ప్రజల సమస్యలను ఆయా శాఖలకు పంపించి పరిష్కరిస్తామన్నారు. రేపల్లె డివిజన్ పరిధిలోని నిజాంపట్నం, రేపల్లె, చెరుకుపల్లి, రేపల్లె పట్టణ ప్రజల నుంచి 13 అర్జీలు వచ్చాయని వాటిని ఆయాశాఖలకు, ఆయా మండలాలకు పంపి పరిష్కరిస్తామన్నారు.



## నందిగం సాంబశివరావు భౌతికకాయానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**నాదెండ్ల,జనవరి20,ప్రభాతవార్త:** మండలంలోని ఎండుగుంపాలెం గ్రామానికి చెందిన నందిగం సాంబశివరావు మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, నియోజకవర్గ శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు,నరసరావుపేట శాసన సభ్యుడు చదలవాడ అరవిందబాబుతో కలసి సోమవారం గ్రామంలోని సాంబశివరావు



నివాసానికి వెళ్లి సాంబశివరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కొమ్మాలపాటి సాయిసుధాకర్, నందిగం శ్రీనివాసరావు, నర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## దివి రామబ్రహ్మానికి గౌరవ డాక్టరేట్

**చిలకలూరిపేట,జనవరి20,ప్రభాతవార్త:** పట్టణానికి చెందిన సాహితీవేత్త దివి రామబ్రహ్మంకు గౌరవ డాక్టరేట్ లభించింది. విజయవాడుకు చెందిన తెలుగు సంస్కృతి, సాహితీ సేవా ట్రస్ట్ రామబ్రహ్మం చేసిన సేవలకుగాను గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఈ డాక్టరేట్‌ను రామబ్రహ్మంకు అందచేశారు. రామబ్రహ్మం ప్రభుత్వ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేస్తూ పదవి విరమణ చేశారు. మొక్షదర్శనం, ఆయుర్వేద వైద్య దర్శిని, వీరబ్రహ్మేంద్రస్వామి తత్వ దర్శిని వంటి గ్రంధాలు రచించారు. అనేక



సామాజిక, సాహిత్య కార్యక్రమాలలో పాల్గొనడమే కాకుండా సాహితీ సేవారత్న బిరుదును అందుకున్నారు. ఆయనకు గౌరవ డాక్టరేట్ పొందటం పట్ల డాక్టర్ పిపి సుబ్బారావు, దార్ల బుజ్జిబాబు, డాక్టర్ చుక్కా విన్సెంట్‌పాల్, ఎవి శివయ్య, బూదాటి కోటయ్య తదితరులు అభినందనలు తెలిపారు

## శ్రీతారక రామ కళాపరిషత్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు

**శావల్యాపురం,జనవరి20,ప్రభాతవార్త:** మండలంలోని కారుమంచి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ తారకరామ కళాపరిషత్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని మహిళలకు ముగ్గుల



పోటీలు, వివిధ రకాల ఆటల పోటీలు, బాలలకు డాన్స్ పోటీలు, పలు సాంస్కృతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన హాస్యనటుడు చింతామణి నాటకం సుబ్బిశెట్టి పాత్రద్వారా లబ్ధ ప్రతిష్ఠుడైన స్వర్గీయ అర్వపల్లి సుబ్బారావు పేరిట అవార్డు ఏర్పాటు చేసి నాటకరంగ ప్రముఖుడు బెల్లంకొండ కోట య్యకు అందజేసి సత్కరించారు. అలాగే కాకినాడ జేఎన్‌టియు ప్రొఫెసర్ గ్రామ వాసి గడుపూడి చినపునయ్యకు ప్రతిభావంతుడు అవార్డును అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ వారు పాల్గొని బహుమతులు అందజేశారు. అధ్యక్ష, కార్యదర్శులు గుమ్మా శ్రీకాంత్‌రెడ్డి, యేరువ వెంకటనారాయణ, అలా శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనుల సామాజిక తనిఖీపై సమీక్ష సమావేశం

**నూజెండ్ల,జనవరి20,ప్రభాతవార్త:** గత ఏడాది మండల పరిధిలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి సామాజిక తనిఖీపై సమీక్ష, సమావేశం మండలకేంద్రమైన నూజెండ్ల ఎంపిడివో కార్యాలయంలో సోమవారం జరిగింది. 12 కోట్ల 10 లక్షల పనులకుగాను సామాజిక తనిఖీలు చేపట్టడం జరుగుతుందని స్టేట్ రిసోర్స్‌పర్సన్ రాజు ఈ మేరకు తెలిపారు. సమావేశంలో పిఆర్ఏఈ, హౌసింగ్ ఏఈ, పంచాయితీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులతో తహశీల్దార్ సమావేశం

**వినుకొండ,జనవరి20,ప్రభాతవార్త:** మండల పరిధిలోని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులతో మండల తహశీల్దార్ కార్యాలయం నందు తహశీల్దార్ సురేష్ సోమవారం సమావేశం నిర్వహించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గ్యాస్ సరఫరా చేయాలన్నారు. అదనపు ఛార్జీలు వసూలు చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.



## అదుపుతప్పి బోల్తా పడిన లారీ

**రాజుపాలెం, జనవరి 20 ప్రభాతవార్త :** రాజుపాలెం అద్దంకి - హైదరాబాద్ రోడ్డుపై మేకలు తప్పించబోయి అదుపుతప్పి లారీ బోల్తా పడిన సంఘటనలో నాలుగు మేకలు చనిపోగా మరో మేకకు కాలు విరిగింది. ఈ ఘటన రాజుపాలెం మండలం నెమలిపురి సచివాలయం వద్ద సోమవారం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న రాజుపాలెం ఎస్.ఐ. వేణుగోపాల్ తమ సిబ్బందితో అక్కడకు చేరుకొని సంఘటనపై విచారించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహనాలను పంపించారు.

## ఆక్వా రైతులు పాతలైసెన్సులతో నిమిత్తంలేకుండా లైసెన్సులు పొందాలి

**నిజాంపట్నం, జనవరి 20, ప్రభాతవార్త:** ఆక్వా రైతులు పాతలైసెన్సులతో నిమిత్తంలేకుండా తప్పనిసరిగా లైసెన్సులు పొందాలని మత్స్యశాఖ నిజాంపట్నం ప్రాంత సహాయ సంచాలకులు భూక్యా సైదా అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆక్వా జోన్ పరిధిలోని దరఖాస్తులకు 6 రోజుల్లో, నాన్ ఆక్వా జోన్‌లో వాటికి 15 రోజుల్లో లైసెను ్సలు మంజూరు చేస్తామనా ్నరు. ఒకే చెరువులో ఒకరికంటే ఎకు ్కవ రైతులు ఉంటే అందరి తరపున ఒకటే లైసెన్సు పొందే వెసులుబాటు కల్పిస్తున్నామన్నారు. ఆక్వాసాగుదారులతోపాటు ఆక్వా అనుబంధ పరిశ్రమల యజమానులు లైసెన్సు తీసుకోవాలనే నిబంధనను తప్పనిసరిచేస్తూ అప్పడా చట్టం 2020 అనుసరించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఆక్వా విద్యుత్ కనెక్షన్ల మంజూరు, వినియోగంపై రాయితీ వర్తింపుతోపాటు చేపల, రొయ్యల, క్రయవిక్రయాలకు లైసెన్సు తప్పనిసరిగా ఉండాలని తెలియజేశారు. ప్రస్తుతం ఉన్న పథకాలతోపాటు భవిష్యత్తులో అమలు చేయబోయే పథకాలకు ఈ లైసెన్సులు కీలకమన్నారు. రానున్న రోజుల్లో ఆక్వా రైతులకు భీమా సదుపాయం కల్పించే అవకాశం ఉందని, చేపల, రొయ్యల సంబందించి మేతలు, మందులు దుకాణాల యజమానులు కొనుగోలు కేంద్రాలు, ప్రాసెసింగ్ ప్లాంట్ల యజమానులకు చట్టబద్ధత కల్పించేందుకు లైసెను ్సలు తప్పనిసరి అని ఆయన తెలిపారు. ఆక్వా అనుబంధ, ఆక్వా రైతులు, యజమానులు, ఆయా మండల స్థాయి, గ్రామస్థాయి మత్స్యశాఖ అధికారులను సంప్రదించి లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

## నిజాంపట్నం, అడవులదీవిలలో జిఎస్‌డబ్ల్యుఎస్ ఆధార్ మొబైల్ క్యాంప్‌లు

**నిజాంపట్నం, జనవరి 20, ప్రభాతవార్త:** మండలంలోని నిజాంపట్నం, అడవులదీవిలలో జిఎస్‌డబ్ల్యుఎస్ ఆధార్ మొబైల్ క్యాంప్‌లు ఏర్పాటు చేశామని ఎంపిడిఓ నాగలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ నిజాంపట్నంలో జరిగే క్యాంప్‌లో నిజాంపట్నం, బొర్రావారిపాలెం, బావాజీపాలెం, గరువుపాలెం, కూచినపూడి, ప్రజ్ఞం, పల్లపట్ల, ముత్తుపల్లి, ఆముదాలపల్లి పంచాయితీల ప్రజలకు సేవలు అందిస్తారనా ్నరు. అడవులదీవిలో జరిగే మొబైల్ క్యాంప్‌లో అడవులదీవి, దిండి, కొత్తపాలెం, గుర్నాధనగర్, హారీస్‌పేట, కళ్ళిఫలం ప్రజలకు సేవలు అందిస్తారన్నారు. ఈ క్యాంప్‌లలో ఈనెల 21 నుంచి 24 వరకు, 27 నుంచి 30వ తేదీ వరకు సేవలు అందిస్తారన్నారు.

## అర్జీదారులకు అన్నదానం

**నరసరావుపేట టౌన్, జనవరి 20 ప్రభాతవార్త :** ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీదారులకు సోమవారం పల్నాడు జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల ఆవరణలలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అత్తులూరి సుబ్బారావు, తాడువాయి రామకృష్ణ, మస్తాన్, ప్రభాకర్, శివాంజనేయులు అన్నదానం నిర్వహించి మాట్లాడారు. శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ఆదేశాల మేరకు పట్టణ ఆర్యవైశ్య సంఘం వివిధ వర్గాల సహకారంతో నిరంతరంగా అన్నదాన కార్యక్రమం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి సహకారం అందించిన సుధాకర్ తదితర దాతలను జిల్లా అధ్యక్షులు అత్తులూరి సుబ్బారావు అభినందించారు.



## బొందిలి సంఘం మహాజన సభ సమావేశం

**నరసరావుపేట టౌన్, జనవరి 20 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బొందిలి సంఘీయుల మహాజన సభ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. సంఘం అధ్యక్షులు నెల్లూరు కృష్ణసింగ్, ప్రధాన కార్యదర్శి ఎన్.మోహన్‌సింగ్, కోశాధికారి జి.సునీతబాయి ఎంపికయ్యారు. పల్నాడు జిల్లా నుండి నరసరావుపేటకు చెందిన రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శిగా ఉన్న బొందిలి శ్రీనివాససింగ్, సంయుక్త కార్యదర్శిగా బొందిలి కృష్ణసింగ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తమిళనాడు రాష్ట్ర అధ్యక్షులు జై సింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. బొందిలి కులాన్ని ఓబిసిలో చేర్చేందుకు అందరూ కృషి చేయాలన్నారు. రాష్ట్ర నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలలో కెరిడ్జ్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

**నరసరావుపేట టౌన్, జనవరి 20 ప్రభాతవార్త :** జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలలో కెరిడ్జ్ పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభను కనపరిచినట్లు ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు తెలియజేశారు. ఏరో స్కెడ్‌బాల్ అసోసియేషన్ మహారాష్ట్ర నిర్వహించిన అండర్-14 జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలలో తమ విద్యార్థులకు ప్రథమ, తృతీయ బహుమతులు వచ్చాయన్నారు. తమ పాఠ శాలకు చెందిన కె.కార్తీకేయ ప్రథమ బహు మతిని, నంది పాటి మోక్షిత్, షేక్.వహీద్, కె.రామ్‌చరణ్‌లు స్కేటింగ్ పోటీలలో ప్రథమ, తృతీయ




బహుమతులను అందు కున్నారన్నారు. గెలుపొందిన విద్యార్థులను ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లుతో పాటు డైరెక్టర్ కె.నాసరయ్య, ప్రిన్సిపాల్ బర్నబాస్, ఇన్‌ఛార్జి కోట బాపూజీ, కోఆర్డినేటర్ హేమంత్, కోచ్ ఫిరోజ్‌ఖాన్, కిషోర్‌లు అభినందించారు.

## పశు ఆరోగ్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగ పర్చుకోండి

**యడ్లపాడు, జనవరి 20, ప్రభాతవార్త :** ప్రభుత్వం రాష్ట్రంలోని పశుపోషకులకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ తగిన నిధులు కేటాయిస్తూ వారి అర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తోందని, ఈ క్రమంలోనే పశువులు ఆరోగ్యానికి, ఉత్పాదకతను పెంచడానికి, వ్యాధులను నియంత్రించడానికి,



పశుపోషకులకు ఖర్చులు తగ్గించడానికి మరియు అర్ధిక అండను కలుగజేయడానికి వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోందని, పశుసంవర్ధన సేవకులు పశుపోషకులకు మరింత చేరువ చేయడానికి ఈ నెల 20వ తేది నుండి 31వ తేది వరకు అన్ని గ్రామాలలో పశు ఆరోగ్య శిబిరాలను మరియు అవగాహన సదస్సులు నిర్వహించు తుందని, వీటిని పశుపోషకులు సద్వినియోగ పర్చుకోవాలని యడ్లపాడు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ రాధాకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా అయన వివరిస్తూ ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు : పశువైద్యులచే పరీక్షించి ఉచితంగా వైద్యం అందించటం, తేలికపాటి శస్త్ర చికిత్సలు నిర్వహించడం, ఎదలో ఉన్న పశువలును గుర్తించి కృత్రిమ గర్భధారణ చేయటం, చూడి పరీక్షలు, నిర్వహించి శాస్త్రీయ సూచనలు అందజేయటం జరుగుతుందన్నారు.

**నట్టల నివారణ కార్యక్రమము :** పశులకు, దూడలకు మరియు సన్నజీవాలకు నట్టల మందు ఉచితంగా త్రాగించటం, క్రమం తప్పకుండా నట్టల నివారణ మందు జీవాలు మరియు దూడలకు త్రాగించడం వలన బరువు పెరిగి ఆరోగ్యంగా ఉంటాయని, పాడి పశువులకు నట్టల నివారణ మందు వల్ల పాల ఉత్పత్తి పెరగడంతో పాటు పునరుత్పత్తి మెరుగు పడుతుందన్నారు.

**వ్యాధి నిరోధక టీకాలు :** పశుఆరోగ్య సంరక్షణలో భాగంగా అన్ని గ్రామాలలో సామూహిక పశువులకు వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా అందించడం జరుగుతుందని, గొర్రెలు మరియు మేకలకు ఉచితంగా బొబ్బవ్యాధి నివారణ టీకాలు, తద్వారా సన్న జీవాలలో వ్యాధి నిరోధక శక్తితోపాటు పెరుగుదల మరియు పునరుత్పత్తి సామర్థ్యం మెరుగు పడుతుందన్నారు.

పశుపోషకులకు అర్థికాభివృద్ధికి తోడ్పాటును అందించడంతో పాటు పశుసంవర్ధక రంగాన్ని మరింత మెరుగుపర్చే క్రమంలో వివిధ నూతన పథకాలను ప్రవేశపెట్టి తోడ్పాటును అదించడానికి గోకులం, బహువార్షిక పశుగ్రాస క్షేత్రాలు, పశుభీమా, రాయితీపై ఇన్‌పుట్ సరఫరా, పశుకిసాన్ క్రెడిట్ కార్డులు, సంచార పశుఆరోగ్య సేవా వాహనాలు, లింగనిర్ధారిత వీర్యం, పిండమార్పిడి పరిజ్ఞానం వంటి పథకాలను అమలు చేస్తుందని, కావున పశుపోషకులు వీటిని సద్వినియోగ పర్చుకొని తమ పశువుల ఉన్నతికి తోడ్పాటు కాగలరని కోరుతున్నామని, ఇందులో భాగంగానే గ్రామాలలో పశు ఆరోగ్య శిబిరాలు ప్రారంభమైనాయని తెలిపారు.

## పార్టీ కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి

**నరసరావుపేట, జనవరి 20 ప్రభాతవార్త :** నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీకి చెందిన నాయకులు, కార్యకర్తల కుటుంబాలను సోమవారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. డాక్టర్ నంద్యాల బాబుల్‌రెడ్డి సతీమణి నారాయణమ్మ కనుమూశారు. సమాచారం తెలుసుకొని ఆమె భౌతికకాయాన్ని సందర్శించి డాక్టర్ గోపిరెడ్డి నివాళుర్పించారు.



ఆమె మృతిపట్ల సంతాపాన్ని, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అదే విధంగా మండలంలోని పెదతురకపాలెం గ్రామంలో పార్టీ నాయకులు షేక్.కతీబ్‌జానీబాషా మృతిచెందడంతో వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోపిరెడ్డి బాధిత కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. వారి కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ పార్టీ నాయకులు ఉన్నారు.

## చంద్రబాబు కృషితోనే విశాఖపట్నం ఉక్కుకు ఆర్థిక భరోసా వచ్చింది : కొమ్మాలపాటి



**నరసరావుపేట, జనవరి 20 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషితోనే విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా విచ్చిందని టిడిపి జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి విశాఖ ఉక్కు కర్మాగారం మణిహారం అన్నారు. వేలాది మంది తెలుగుజాతి నాయకులు విరోచిత పోరాటాలు, త్యాగాల కారణంగా విశాఖ స్టీల్ ప్లాంట్ వచ్చిందన్నారు. ప్లాంట్‌ను పునర్‌జీవింపజేసేందుకు కేంద్రం సిఎం చంద్రబాబునాయుడు వలనే సహకారం అందిస్తుందన్నారు. గత ప్రభుత్వం తమ స్వార్ధ ప్రయోజనాలకు రాష్ట్రాన్ని తాకట్టు పెట్టిందన్నారు. ముఖ్యమంత్రి ఢిల్లీకి వెళ్ళిన ప్రతిసారి ఏదో ఒక మంచి వార్తను రాష్ట్రానికి తీసుకువస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రుణంతో స్టీల్ ప్లాంట్‌కు పునర్ వైభవం వస్తుందన్నారు. రికార్డుస్థాయిలో లాభాలు తెచ్చే విధంగా తెలుగుదేశం ప్రభుత్వం కృషి చేస్తుందని టిడిపి జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ తెలియజేశారు.

## డిఎస్పీ ఆధ్వర్యంలో పట్టణంలో కార్డెన్ సెర్చ్

**నరసరావుపేట క్రైం, జనవరి 20 ప్రభాతవార్త :** డిఎస్పీ కె.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి సమయంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ కె.నాగేశ్వరరావు మాట్లాడారు. పట్టణంలోని లాడ్జిలలో, చెక్‌పోస్ట్‌ల వద్ద విస్తృతంగా తనిఖీలు నిర్వహించామన్నారు.



అనుమానం ఉన్న ప్రతి ఒక్కరిని తనిఖీ చేయడం జరిగిందన్నారు. వాట్సాప్‌లలో అసత్య ప్రచారాలు చేయవద్దన్నారు. వాటిని ఫార్వార్డ్ చేసినా వారిపై సైతం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలోని బార్ అండ్ రెస్టారెంట్లు, హోటళ్ళు, లాడ్జిలు, వ్యాపార సముదాయాలు సమయపాలనలో మూసి వేయాలన్నారు. గ్రూపులుగా ఏర్పడి సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సహించబోమని డిఎస్పీ కె.నాగేశ్వరరావు హెచ్చరించారు.

## డ్రైయినేజీ సమస్యకు పరిష్కారం

**బెల్లంకొండ, జనవరి 20 ప్రభాతవార్త :** డ్రైయినేజీ సమస్యకు పరిష్కారం చూపుతూ బెల్లంకొండ మండలం మాచాయపాలెం గ్రామంలో సోమవారం పనులు చేపట్టారు. మాజీ ఎంపిటిసి ఆధ్వర్యంలో గ్రామంలోని ఎస్సీ కాలనీలో నీరు పారేందుకు బాగు చేశారు. సమీప గ్రామాలలోని వారికి మురుగు వలన తీవ్ర అసౌకర్యం కలగడంతో టిడిపి నాయకులు జి.కొండయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కొండయ్యకు స్థానికులు



కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్ళ సమస్యను పరిష్కారం చూపడం జరిగిందని కొండయ్య తెలియజేశారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడానికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.


## వుయ్ ఆర్ విత్ యు ఆధ్వర్యంలో విద్యార్థికి ఆర్థిక చేయూత

**సత్తెనపల్లి, జనవరి 20 ప్రభాతవార్త :** కరోనా మహమ్మారి ఎన్నో జీవితాలను కబళించింది.



ఎంతో మంది చిన్నారులను అనాథలుగా చేసి కుటుంబ యజమానులను తీసుకెళ్ళింది. కరోనా పాపానికి బలైన వారిని ఆదుకోవడంలో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని వుయ్ ఆర్ విత్ యు ఆర్గనైజేషన్ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నోస్కూల్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థిని భోగిపర్తి బ్లెస్సికి పాఠశాల ఫీజును ఆర్గనైజేషన్ మెంబర్ బొలిశెట్టి సందీప్ చెల్లించారు. గతేడాది విద్యార్థి తొమ్మిదవ తరగతి చదువుకు సైతం ఆర్గనైజేషన్ వారే చెల్లించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అంజనీదేవి ఆర్గనైజేషన్ ద్వారా చేస్తున్న సేవలను కొనియాడారు. పేద విద్యార్థిని విద్యాదానానికి చేసిన సాయం జీవితాంతం వారికి గుర్తుండిపోతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యులు ప్రదీప్, అల్లాబక్షు తదితరులు ఉన్నారు.

## ఫిషర్‌మెన్ సహకార సంఘానికి ఎన్నికలు



**సత్తెనపల్లి, జనవరి 20 ప్రభాతవార్త :** వడ్డవల్లి ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సహకార సంఘం లిమిటెడ్‌కు సోమవారం ఎన్నికలు జరిగాయి. ఏకగ్రీవంగా ఎన్నికైన వారి వివరాలను అధ్యక్షులు మంగళపూరి పుల్లయ్య ప్రకటించారు. కమిటీ సభ్యులుగా మంగళపూరి శ్రీనివాసరావు, పిట్టల ఏసుబాబు, శీనయ్య, మంగళపూడి ఆదెయ్య, సాధు బాలాజీ, మారం శేషగిరిరావు, సాధు నాగేశ్వరరావు, గరిక వెంకయ్యలు ఎన్నికయ్యారు. ఆఫీస్ బ్యారర్‌లుగా మంగళపూడి పుల్లయ్య అధ్యక్షులుగా, మంగళపూడి శ్రీనివాసరావు, సెక్రటరీగా, సాధు బాలాజీ ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఐదు సంవత్సరాల పాటు వారు పదవిలో కొనసాగుతారని న్యాయవాది అబ్దుల్ గని తెలియజేశారు.

## ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబోరేటరీకి శంఖుస్థాపన చేసిన కలెక్టరు, ఎమ్మెల్యే

**నరసరావుపేట, జనవరి 20 ప్రభాతవార్త :** పట్టణంలోని జిల్లా వైద్యశాల నందు సోమవారం ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబోరేటరీకి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబులు శంఖుస్థాపన చేశారు. ఈ



సందర్భంగా ఎమ్మెల్యే అరవింద్‌బాబు మాట్లాడుతూ అపోలో డయాలసిస్ యూనిట్‌కు శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు వైద్యశాఖపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు తెలిపారు. రూ.కోటి 30 లక్షలతో ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబోరేటరీని ఏర్పాటు చేసుకోవడం వలన జిల్లా ప్రజలకు ఎంతో ఉపయోగమన్నారు. రూ.36 లక్షలతో డయాల సిస్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నామ న్నారు. దీని వలన రక్త పరీక్షలు సులభంగా చేయడం జరుగుతుందన్నారు. కొత్తపాలెం గ్రామం నుండి కోటప్పకొండ రోడ్డు వరకు రూ.4 కోట్లతో నిర్మించే రోడ్డుకు ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ రవి, హాస్పటల్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.వి.రంగారావు, ఆర్ఎంఓ ఏడుకొండలు, పట్టణ ప్రముఖులు కపలవాయి విజయ్‌కుమార్, డాక్టర్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీ గ్రీవెన్స్‌కు 77 పిర్యాదులు

**నరసరావుపేట క్రైం, జనవరి 20 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌కు 77 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఎస్పీ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల నుండి కుటుంబ, ఆర్థిక, ఆస్థి సమస్యలకు సంబంధించి అర్జీలు వచ్చాయన్నారు. శ్రీరాంపురం తండాకు చెందిన కుటుంబానికి ఉద్యోగం ఇప్పిస్తానని రూ.20 లక్షలు తీసుకొని డబ్బులు తిరిగి



ఇవ్వడం లేదని బాధితులు తెలిపారు. గురజాల మండలానికి చెందిన ఆదిలక్ష్మి కుటుంబానికి సంబంధించి అప్పు పేరుతో ఆస్థి తీసుకొని ఇబ్బందికి గురి చేస్తున్నారని తెలిపారు. రెడ్డినగర్‌కు చెందిన అశోక్ అనే వ్యక్తి రూ.13 లక్షలు టెలిగ్రామ్ ద్వారా వచ్చిన సమాచారం మేరకు పెట్టుబడి పెడితే వారు మోసం చేశారని, సైబర్ క్రైం ద్వారా పరిష్కరించాలన్నారు. పట్టణంలోని కృష్ణా టవర్స్ నందు తమ ఫ్లాట్‌ను అద్దెకు తీసుకున్న నాగలక్ష్మి అనే మహిళ అద్దె ఇవ్వకుండా, ఖాళీ చేయకుండా ఇబ్బంది పెడుతున్నారని బాధితులు ఫిర్యాదు చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అందిన ప్రతి అర్జీని వేగంగా పరిష్కరించాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశాలిచ్చారు.

## స్మశానవాటిక స్థలం కొరకు వినతిపత్రం అందజేత



**బెల్లంకొండ, జనవరి 20 ప్రభాతవార్త :** మండలంలోని న్యూచిట్యాల గ్రామంలో స్మశానవాటిక స్థలం కొరకు లంబాడి ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు భూక్యా రామాంజనేయులు సోమవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ శంకరరావును కలిసి సమస్యను వివరించారు. పులిచింతల ప్రాజెక్ట్ ముంపు గ్రామాలైన న్యూచిట్యాల, కేతవరం, బోధనం, కొల్లూరు గ్రామాలకు సంబంధించి స్మశానవాటికకు స్థలం లేదన్నారు. అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. అదే విధంగా గ్రామాలలో డ్రైయినేజీ, త్రాగునీరు, అంగన్‌వాడీ భవనాలు, ప్రాథమిక పాఠశాలకు సంబంధించి సమస్యలు ఉన్నట్లు వివరించారు. వారు సానుకూలంగా స్పందించారని ఈ సందర్భంగా భూక్యా రామాంజనేయులు తెలియజేశారు.

## వెనిగండ్లలో మంచినీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి

### - ప్రజాసంకల్ప వేదిక రాష్ట్రఅధ్యక్షులు కొండమడుగుల రామిరెడ్డి



**పెదకాకాని, జనవరి20, ప్రభాతవార్త:** మండల పరిధిలోని వెనిగండ్ల గ్రామంలో గల ప్రజలకు మంచినీటి సరఫరా పూర్తిగా అగిపోయిందని స్థానిక పంచాయితీ అధికారులు, పంచాయితీ పాలకవర్గం ఈ విషయంలోపూర్తిగా వైఫల్యం చెందిందని గత ఐదు సంవత్సరాల నుండి నీటి సరఫరా రెండు లేక మూడు రోజులకు ఒకసారి మాత్రమే మంచినీళ్ల సరఫరా అవుతుందని దీంతో గ్రామంలోని ప్రజలు ఇబ్బందులకుగురై మంచినీరుని కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. జిల్లా, మండల, ఆర్.డబ్ల్యు.ఎస్ అధికారులు వెంటనే స్పందించి నీటి సరఫరాను పునరుద్దరించేందుకు యుద్ధప్రాదితిక పై తగు అవసరమైన చర్యలు తీసుకొని వెనిగండ్ల గ్రామ ప్రజలను నీటి ఎద్దట నుండి కాపాడాలని ప్రజాసంకల్ప వేదిక రాష్ట్రఅధ్యక్షులు కొండమడుగుల రామిరెడ్డి కోరారు.

## సిబార్‌లో ఉచిత దంత వైద్యశిబిరం

**పెదకాకాని, జనవరి20, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సిబార్ దంత వైద్యశాల నందు జనవరి22వతేదిన ప్రోస్థోడాంటిక్స్‌డే సందర్భంగా పేదలకు ఉచిత దంత వైద్య సేవలు అందిస్తామని సిబార్ దంత వైద్యకళాశాల డీన్.డా.ఎల్.కృష్ణప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా పూర్తిగా మరియు పాక్షికంగా పళ్ళు లేని వారికి తీసి పెట్టుకునే పళ్ల సెట్టు ఉచితముగా కట్టబడును దీని కొరకు జనవరి 22.23,24తేదిలలో ఉదయం 9గం.లనుండి సాయంత్రం 4గం.లలోపు సిబార్ దంతవైద్య కళాశాలలోని కట్టుడు పళ్ళ విభాగములో పేరు నమోదు చేసుకోవలెను. వివరాలకు డా.జి.ఫణికృష (ఫోన్:8688893043)డా.నాగఫణింద్ర (ఫోన్:6301932833)లను సంప్రదించగలరు. ఈఅవకాశం పూర్తిగా, పాక్షికంగా పళ్ళులేని వారికి మాత్రమే అని తెలిపారు.

## కనకవల్లికి సావిత్రీబాయిపూలే జాతీయ ప్రతిభా అవార్డు

**పొన్నూరు, జనవరి 20, ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లా, అల్లూరు మండలం, మోపూరు శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో తెలుగు, సంస్కృతం అధ్యాపకురాలుగా పనిచేస్తున్న కందూరు కనకవల్లికి



సావిత్రీబాయి పూలే జాతీయ ప్రతిభా అవార్డును ఎమ్మెల్యే కెఎస్ లక్ష్మణరావు చేతుల మీదుగా అందజేశారు. సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రైవేట్ సెక్టార్‌లో పనిచేస్తున్న ఎంతో మంది ప్రతిభావంతులను గుర్తించి వారిని సత్కరించడం స్పెల్టోకే దక్కుతుందన్నారు. కందూరు కనకవల్లి ప్రైవేట్ విద్యాసంస్థలో అధ్యాపకురాలుగా గత 22సంవత్సరాలుగా సేవలందిస్తూ ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దారన్నారు. అంతటి మహోన్నతమైన అధ్యాపకురాలు కనకవల్లిని స్పెల్టో ఆధ్వర్యంలో గౌరవించడం సంస్థకు గౌరవమన్నారు. స్పెల్టో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఎంతోమంది ఉద్యోగులకు ఆయా ప్రభుత్వాలు అవార్డులు ఇచ్చి సత్కరిస్తుందని, అయితే ప్రైవేట్ సెక్టార్‌లో కూడా నిష్ణాతులైనవారు ఎందరో ఉన్నారని, వారికి కూడా సముచితస్థానం కల్పించాలన్న సంకల్పతో ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఆర్గనైజేషన్ చక్కగా నడిచేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సహాయ సహకారాలు అందిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్న ఎస్ఏటిఎస్ ఆచార్య మాట్లాడుతూ స్పెల్టో ఆర్గనైజేషన్‌ను ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య చక్కగా నిర్వహిస్తూ ప్రైవేట్ సెక్టార్‌లో కూడా గొప్ప వ్యక్తులు ఉన్నారన్న విషయాన్ని తెలియజేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఆనందదాయ మన్నారు. ప్రైవేట్ సెక్టార్‌లో ఉన్న ప్రతిభా వంతులను గుర్తించి, వారికి అవార్డులు, సత్కారాలు చేయడం అంటే వారి బాధ్యతను మరింత పెంచడ మేనన్నారు. ఇలాంటి సత్కారాలు పొందినవారు మరింత స్ఫూర్తిగా ముందుకు సాగు అవకాశం ఉందన్నారు. ఆర్గనైజేషన్ భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు పిఆర్ రత్నకుమారి, పిఎస్ ఆదిత్య, కె. గోవిందరాజులు, ఎన్‌విఎస్ రఘుప్రదీప్, డి.నాగమణి, కొండపల్లి విల్సన్, ఎం.రాకేష్, ఎస్‌పి రసూల్ పాల్గొన్నారు.

## సస్పెన్షన్ తొలగించండి

### -ఫిర్యాదుల పరిష్కారవేదికలో అర్జీ అందజేత

**పొన్నూరు, జనవరి 20, ప్రభాతవార్త:** పట్టణంలోని 23వ వార్డులో డీలర్‌గా పనిచేస్తున్న గేరా కుమారి తన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరుతూ ఫిర్యాదుల పరిష్కారవేదికలో అర్జీని అందజేశారు. 23వ వార్డులో షాపు నెం.0788014నిర్వహిస్తున్నాను, గత ఏడాది ఈస్టర్ పండుగ రోజున క్రీస్తు శతవార్షిక లూథరన్ దేవాలయంలో ప్రార్ధన జరుపుకునే సమయంలో అప్పటి ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, అంబటి మురళీకృష్ణ క్రీస్తు శతవార్షిక దేవాలయానికి వచ్చారు. ఆ సమయంలో సంఘస్తులు, పెద్దలు గౌరవంతో శాలువాలు కప్పియున్నారు. అదే సమయంలో నేను కూడా ప్రార్ధనల్లో పాల్గొనేందుకు రావడంతో యాదృశ్చికంగా ఎవరో ఫోటోలు తీశారు. అప్పట్లో ఎన్నికల కోడ్ ఉండడంతో నియమావళిని ఉల్లంఘించినట్లుగా నన్ను సస్పెండ్ చేసియున్నారు. ప్రార్ధనా మందిరంలో నేను కానీ, నా భర్త కానీ ఎలాంటి రాజకీయ ప్రచారం చేయలేదని ప్రమాణ పూర్వకంగా తెలియపరచుకున్నాము. నా కుటుంబానికి వేరే ఇతర ఆదాయ వనరులు లేవు, నా కుటుంబ పోషణ చాలా కష్టముగా ఉంది. కనుక తనపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేసి నాకు జీవనోపాధి కలి ్పంచాలని అర్జీలో గేరా కుమారి కోరారు.

## విజ్ఞాన్స్ లారాకు ప్రతిష్టాత్మక సిస్కోనెట్ ఎకాడ్ ఎక్సలెన్స్ అవార్డు

### -150సిస్కో నెట్ వర్క్ కళాశాలల్లో మొదటి 10స్థానాల్లో విజ్ఞాన్స్ లారా కళశాల

**పొన్నూరు, జనవరి 20, ప్రభాతవార్త:** చేబ్రోలు మండలం, వడ్లమూడిలోని విజ్ఞాన్స్ లారా ఇంజనీరింగ్ కళాశాలకు ప్రతిష్టాత్మక సిస్కోనెట్ ఎకాడ్ ఎక్సలెన్స్ అవార్డు లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఫణీంద్రకుమార్ సోమవారం తెలిపారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ



దేశవ్యాప్తంగా సిస్కో నెట్ ఎకాడ్ సంస్థతో 150 కళాశాలలు అనుసంధానమై ఉన్నాయని, అందులో కేవలం 13కళాశాలలకు మాత్రమే పురస్కారం లభించిందన్నారు. వీటిలో విజ్ఞాన్స్ లారా ఒకటైనందుకు సంతోషముగా ఉందన్నారు. సిస్కోనెట్ ఎకాడ్ వారిచే నిర్వహించబడిన నెట్ వర్కింగ్, సైబర్ సెక్యూరిటీ ప్రోగ్రామిగ్, ప్యాకెట్ ట్రేసర్ అనే అడ్వాన్డ్స్ కోర్సులలో విజ్ఞాన్ లారా ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఉత్తీర్ణత పొంది 8600సర్టిఫికెట్స్ సాధించినం దుకు ఈ పురస్కారం లభించిందన్నా రు. సిస్కో కంపెనీ వారు వివిధ బహుళజాతి సంస్థల అవసరాలకు అనుగుణంగా అడ్వాన్డ్స్ టెక్నాలజీస్‌లో శిక్షణ ఇవ్వడం వల్ల ఉద్యోగ అవకాశాలు మెరుగు అవ్వడమే కాకుండా ఇంటర్న్‌షిప్‌లు, అకాడమిక్ ప్రాజెక్ట్స్ చేయడానికి దోహదపడు తుందన్నారు. విజ్ఞాన్స్ లారా కళాశాలకు ప్రతిష్టాత్మక సిస్కోనెట్ ఎకాడ్ ఎక్సలెన్స్ అవార్డు లభించినందుకు విజ్ఞాన్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య కళాశాల ప్రిన్సిపాల్, ఆయా విభాగాల డీన్లు, విభాగాధిపతులను, అధ్యాపకులను, సర్టిఫికెట్ సాధించిన విద్యార్థులను అభినందించారు.

## ఇన్‌చార్జీ డిఎల్‌పిఓ నరసింహారావు గుండెపోటుతో మృతి



అమృతలూరు, జనవరి 20, ప్రభాత వార్త: అమృతలూరు మండలం ఈఓపిఆర్ అండ్ ఆర్‌డిగా, రేపల్లె డివజన్ ఇన్‌చార్జీ డిఎల్‌పిఓగా, ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న జి.నరసింహారావు(సుమారు 50సం.) ఆదివారం తెల్లవారుజామున 3.30గంటలకు గుంటూరులోని తన స్వగృహములో గుండెపోటుతో మృతిచెందారు. నరసింహారావు సొంత ఊరు చెరుకుపల్లి మండలం కావూరు గ్రామం ఆయన ఉద్యోగ రీత్యా గుంటూరులో స్థిరపడ్డారు. బెల్లంకొండ పంచాయతీలో కార్యదర్శిగా పనిచేసిన నరసింహారావు ఈఓపిఆర్‌డిగా పదోన్నతి పొంది 2023లో అమృతలూరు వచ్చారు. 2024 జూలైలో రేపల్లె ఇన్‌చార్జ్ డిఎల్‌పిఓగా నియమితులయ్యారు. నరసింహారావుకు భార్య, ఇద్దరు కుమారైలు ఉన్నారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, ఎంపి భరత్, అమృతలూరు ఎంపిపి రాపర్ల నరేంద్రకుమార్, ఎంపిడిఓ బి.మారుతీ శేషమాంబ, తహశీల్థార్ కె.నెహ్రుబాబు, ఎపిఎం ఎస్‌పి రాంబాబు, ఎంఇఓ2 కె.రమేష్‌బాబు, రేపల్లె డివిజన్‌లోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది నరసింహారావు మృతదేహన్ని సందర్శించి సంతాపం ప్రకటించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. నరసింహారావు అంత్యక్రియలు 21వ తేది ఉదయం 10గంటలకు గుజ్జనగుళ్ల మహాప్రస్థానంలో నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## పెదవడ్లపూడిలో రూ.9.24లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

**మంగళగిరి, జనవరి 20, ప్రభాతవార్త :** మంగళగిరి నియోజకవర్గంలోని ప్రజలు కష్టకాలంలో ఉంటే తక్షణమే స్పందించి మంత్రి నారా లోకేష్ అండగా నిలుస్తున్నారు. మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామానికి చెందిన షేక్ గౌస్ భాషా గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ వివిధప్రవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందాడు. అతడి ఆర్థిక ఇబ్బందులను ఆ గ్రామానికి చెందిన టిడిపి నాయకులు



మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకురాగా...స్పందించిన మంత్రి లోకేష్ ముఖ్యమంత్రి చంద్రబాబు తో మాట్లాడి గౌస్‌భాషా పరిస్థితిని వివరించారు. దీంతో సీఎం చంద్రబాబు రూ.9,24,724ల సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరు చేయించారు. మంత్రి లోకేష్ ఆదేశాలతో టిడిపి నాయకులు లబ్దిదారుని ఇంటికి వెళ్ళి సోమవారం మంజూరు పత్రాలు అందజేశారు. లక్షల విలువైన చెక్కు రావడానికి కృషిచేసిన మంత్రి నారా లోకేష్‌కు గౌస్‌భాషా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్ధసారధి, రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ జవ్వాది కిరణ్‌చంద్, మాదల రమేష్‌బాబు, అన్నే చంద్రశేఖర్, షేక్ బాజీ షాహిద్, కొడవలి ఆనంద్, మొగల్ లాలా బేగ్, జవ్వాది ఆంజనేయులు, ఇసుబ్ వలి, షేక్ మీరా, షేక్ ఖాశీం, కఠారి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో పశు వైద్య శిభిరాలు

**కర్లపాలెం, జనవరి20, ప్రభాతవార్త:** మండలంలోని చింతాయపాలెం, పేరలీ గ్రామాల్లో పశు సంవర్ధక శాఖఅధ్వర్యంలో ఉచిత పశువైద్య శిభిరాన్ని సోమవారం నిర్వహించారు. పశుపెంపకం దారులకు పశుపోషకులకు మేలు చేసే దిశగా ప్రభుత్వం పశు ఆరోగ్య శిభిరాలను ఈ నెల 20వ తేదినుంచి 31వ తేది వరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయితీలలో నిర్వహించ నున్నారు. ఈ కార్యక్రమంలో బాగంగా మండలంలోని చింతాయపాలెం, పేరలీ గ్రామాల్లో ఉచిత పశు వైద్య శిభిరాలని ఏర్పాటు చేశారు. వైద్య పరీక్షలతో పాటు



అవసరమైన మందులు ఉచితంగా అందించారు. శిబిరంలో గర్భకోశ వ్యాదులకు చికిత్స, చిన్న దూడలు, సన్న జీవాలకు ఉచితంగా నట్టల నివారణ మందులుపంపిణి చేసినట్లు పశువైద్యాదికారులు డాక్టర్ రేచల్ దివ్య, డాక్టర్ మహేష్, తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిలుగా చింతాయపాలెం సర్పంచ్ పీతా శ్రీనివాసరావు, పేరలీ గ్రామ సర్పంచ్‌లు పాల్గొని శిభిరాలను ప్రారంబించారు. ఈ శిభిరాలలో పశువైద్య సిబ్బంది, పి.పాండురంగారావు, బి.రాజేష్, రహమతున్నీసా, పశు సంవర్ధక సహాయకులు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

## ప్రతి మహిళను అక్షరాశ్యులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

**బాపట్ల, జనవరి20, ప్రభాతవార్త:** ప్రతి మహిళను అక్షరాశ్యులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తహశీల్దార్ సుందరమ్మ అన్నారు. ఉల్లాస్( అడల్ట్ ఎడ్యుకేషన్) పై వాలంటీర్లకు మండల పరిషత్ సమావేశమందిరంలో మండల సమాఖ్య అధ్వర్యంలో సోమవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సుందరమ్మ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ఉన్న మహిళలకు చదవడం రాయడం రాని వారికి ఉల్లాస్ కార్యక్రమం ద్వారా అక్షరాలు నేర్పించడానికి మహిళా సంఘాల్లో అక్షరాస్యత లేని వారిని గుర్తించి 10 పదిమందికి టెన్త్ క్లాస్ చదవిన ఒక మహిళను వాలంటీర్‌గా టీచర్‌గా



గుర్తించడం జరిగింది. వీరికి శిక్షణ ఇవ్వడం ద్వారా ప్రతి మహిళకు చదవడం రాయడం తో పాటు ,డిజిటల్ శిక్షణ ,ఫైనాన్షియల్ లిటరసీ, లీగల్ లిటరసీ తో పాటు సామాజిక కార్యక్రమాలపై పూర్తి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి అతిదిగా వచ్చిన ఎంపిడివో ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళ అక్షరాస్యత కలిగి ఉన్నప్పుడే ప్రభుత్వం కల్పించే మహిళా చట్టాలు సక్రమంగా వినియోగించుకుని వారిని వారు రక్షించుకోవడం జరుగుతుందన్నారు. బాల్య వివాహాలు అరికట్టడంలో అక్షరాస్యత కలిగిన తల్లికి మాత్రమే సాధ్యమని ఉల్లాస్ ద్వారా గృహహింస 2005 ,వరకట్నం నిషేదం,1961 లైంగిక వేదింపులు వంటి మహిళా చట్టాలపై అవగాహనకల్పించవలసిన అవసరం నేటి మహిళాలకు ఎంతైనా ఉందని ఉల్లాస్ కార్యక్రమాన్ని వినియోగించుకొని ఆర్థిక స్వావలంబన కలిగిన మహిళకు ఆర్థిక మోసాలపై అవగాహన పొందవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమం అనంతరం అభ్యాసకులకు టీచర్లకు మార్గదర్శి పుస్తకాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎన్ విజయశ్రీ, హెచ్ ఎం పి.విజలబాస్కర్‌రెడ్డి, వయోజన విద్య సూపర్‌వైజర్ సిహెచ్ శివరామప్రసాద్, మండల సమాఖ్య అద్యక్షురాలు ధనలక్ష్మి, ఎపిఎం శ్రీనివాసులురెడ్డి, సిసి సిహెచ్ రాఘవులు, శివకోటేశ్వరరావు, అకౌంటేంట్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## కర్లపాలెంలో ముగిసిన సీనిమాహాల్ చరిత్ర



**కర్లపాలెం, జనవరి20, ప్రభాతవార్త:** గతంలో కర్లపాలెంలో మూడు సీనిమా ధియేటర్‌లు ఉండేవి. ఒకటి శ్రీనివాస, రెండవదివెంకటేశ్వర, మూడవ దితిరుమల దియేటర్‌లు వీటిలోవెంకటేశ్వర, శ్రీనివాసలు కలిపి ఉండేది ఈకలిసి ఉన్న రెండు దియేటర్‌లను కలిపి అపార్ట్‌మెంట్ కట్టారు. అనంతరం మొన్నటి వరకు తిరుమల ధియేటర్ ఉండేది. ప్రస్తుతం దీన్ని కూడాకూల్చి వేశారను. దాంతోమొన్నటి వరకు అరాకొరగా సినిమాలు అడిన తిరుమల ధియేటర్ సైతం కనుమరుగైయిపోయింది. గత కొన్ని దశాబ్దాలుగా మూడు సినిమా హాళ్లతో కళకళలాడిన కర్లపాలెం సెంటర్ క్రమంగా ఒకదానికి వచ్చి ఆ ఒక్కటికూడా ఇప్పుడుపూర్తిగా తెరమరుగైంది. భవిష్యత్‌లో మరి ఏదైనా సినిమా హాలువస్తుందా..రాధా అనేది చూడాలి.

# 'సంక్రాంతికి వస్తున్నాం' చేయడం హాపీగా ఉంది..

ప్రతి సంవత్సరం ఒక పండగ వాతావరణంతో మొదలౌతోంది. నా కెరీర్‌లో బీజీయస్ట్ ఇయర్ 2025. ప్రపంచ మంతటా తెలుగు సినిమా విజయ బావుటా ఎగురు వేయడం గర్వకారణంగా వుంది. ఇలాంటి సినిమాలో నేను ఇంత బిజీగా ఉంటూ విభిన్న పాత్రలతో ఇటు థియేటర్‌లో అటు ఓటీటీ లో ప్రేక్షకులని అలరించడం నా అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు నవరసరాయ డా. నరేష్ విజయ్ కృష్ణ జనవరి 20 ఆయన బర్త్ డే. ఈ సందర్భంగా విలేకరులతో ముచ్చటించారు.

ప్రతి సంవత్సరం ఒక పండగ వాతావరణంతో మొదలౌతోంది. గత పదేళ్ళుగా యాక్టర్‌గా మళ్ళీ మెట్టుమెట్టు ఎదుగుతూ వస్తున్నా ను. వరుస విజయాలు వస్తున్నాయి. మొన్న బాహు బాలి, నిన్న పుష్ప2, నేడు సంక్రాంతికి వస్తున్నాం..ఇలా ప్రపంచమంతటా తెలుగు సినిమా విజయ బావుటా ఎగురు వేయడం గర్వకారణంగా వుంది. ఇలాంటి సినిమాలో నేను ఇంత బిజీగా ఉంటూ విభిన్న పాత్రలతో ఇటు థియేటర్‌లో అటు ఓటీటీలో ప్రేక్షకులని అలరించడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఈ సంవత్సరం విడుదలైన గేమ్ ఛేంజర్, డాకు మహారాజ్, సంక్రాంతికి వస్తున్నాం .. ఇలా అన్నీ తెలుగు సినిమాలు వంద కోట్లు దాటడం మన సక్సెస్. ప్రత్యేకంగా సంక్రాంతి వస్తున్నాం విజయం చాలా సంతోషాన్ని ఇచ్చింది. అనిల్ రావిపూడి నా ఫేవరేట్ డైరెక్టర్. ఆయన డైరెక్షన్‌లో దిల్ రాజు నిర్మాణం లో చేసిన సంక్రాంతి వస్తున్నాం మూడు వందల కోట్లు దాటుతుం దని విన్నప్పుడు చాలా సంతోషంగా అనిపించింది. ఇందులో చేసిన చీఫ్ మినిస్టర్ క్యారెక్టర్ ప్రేక్షకులందరినీ ఆకట్టుకోవడం ఆనందంగా వుంది. ఈ ఏడాది బిగ్ సక్సెస్‌తో స్టార్ట్ అయ్యాను. ఈ సక్సెస్ అందరికీ కొనసాగాలని కోరుకుంటున్నాను. నా కెరీర్‌లో బిజీయస్ట్ ఇయర్ 2025. తొమ్మిది సినిమాలు ఏకకాలంలో షూటింగ్‌లో వున్నాయి. అన్నీ అద్భుతమైన సినిమాలు. ఇందులో రెండు లీడ్ రోల్స్ చేస్తున్నాను. గత ఏడాది వచ్చిన వీరంజనేయులు విహారయాత్ర ఓటీటీలో నాకు కొత్త మార్కెట్‌ని తెచ్చి పెట్టింది. శర్వానంద్ హీరోగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో ఓ హిలేరియస్ ఫిల్మ్ చేస్తున్నాం. అలాగే నారా రోహిత్‌తో సుందర కాండ, ఇంద్రగంటి సారంగ పాణి జాతకం, రవితేజతో ఓ సినిమా చేస్తున్నాను. మారుతి రైటింగ్స్‌లో బ్యూటీ అనే సినిమాలో లీడ్ రోల్ చేస్తున్నాను. చాలా సినిమాలు మీముందుకు రాబోతున్నాయి. ప్రతిపాత్ర విభిన్నంగా వుంటుంది. సీనియర్ డైరెక్టర్స్‌తో పాటు యంగ్ డైరెక్టర్స్ నా కోసం ప్రత్యేకంగా పాత్రలు రాయడం ఆనందంగా వుంది. దాదాపు ఏడు సినిమాలు యువ దర్శకుల దర్శకత్వంలోనే చేస్తున్నాను. సినీ పరిశ్రమలో సక్సెస్ ఫుల్‌గా 52 పూర్తి చేసుకోవడం ఆనందంగా వుంది.


డా.నరేష్ వికె

# 24న 'హత్య' విడుదల

మహాకాల్ పిక్చర్స్ పతాకంపై ఎస్ ప్రశాంత్ రెడ్డి నిర్మాణంలో శ్రీ విద్యా బసవ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'హత్య'. ఈ చిత్రంలో ధన్య బాలకృష్ణ, పూజా రామ చంద్రన్, రవి వర్మ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. జనవరి 24న ఈ చిత్రం గ్రాండ్‌గా రిలీజ్ కాబోతోంది. ఈ క్రమంలో చిత్రయూనిట్ సోమవారం నాడు మీడియా ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో, దర్శకురాలు శ్రీవిద్య బసవ మాట్లాడుతూ, మధ' చిత్రానికి చాలా కష్టాలు ఎదుర్కొన్నాను. కరోనా వల్ల ఆ సినిమా సక్సెస్‌ను ఎంజాయ్ చేసుకోలేకపోయాను. ప్రశాంత్ వల్ల ఈ హత్య చిత్రం ఈ స్థాయికి వచ్చింది. పెట్టే ప్రతీ పైసాకి బాధ్యత వహించాలని చాలా జాగ్రత్తగా సినిమాను తీశాం. లాభసాటి ప్రాజెక్టుగా హత్యను మల్చాలని అనుకున్నాను. హత్య షూటింగ్ టైంలో మేం చాలా కష్టాల్ని ఎదుర్కొన్నాం. మధ మూవీని చాలా మందికి చూపించి రిలీజ్ చేయమని అడిగాను. కానీ ఇప్పుడు మాత్రం ఎవ్వరినీ అడగలేదు. మా ట్రైలర్ వచ్చాక డిస్ట్రిబ్యూటర్లే వచ్చి మా సినిమాను అడిగారు. మేం సినిమా చూశాం. మాకు నమ్మకం పెరిగింది. ఈ సినిమా పట్ల నేను చాలా గర్వంగా ఉన్నాను. మా టీం కూడా ఈ సినిమాను చూసి ఫుల్ హ్యాపీగా ఉంది. మేం తప్పులు చేస్తూనే ఫిల్మ్ మేకింగ్‌ను నేర్చుకున్నాం. రవి అద్భుతంగా నటించారు. ఆయన పాత్రకు అందరూ కనెక్ట్ అవుతారు. సుధ పాత్రలో ధన్య అందరినీ ఆకట్టుకుంటుంది. ఎంతో ప్రిపేర్ అయి సెట్స్‌కు వస్తుంది. సలీమ కారెక్టర్‌లో పూజ మెప్పిస్తుంది. నేను ఓ మహిళా దర్శకురాలిగా మరిన్ని ఉమెన్ సెంట్రిక్ కథలు, కారెక్టర్‌లను రాయాలని అనుకుంటున్నాను. మా కెమెరామెన్ అభి సింక్‌లో పని చేస్తాడు. మ్యూజిక్ డైరెక్టర్ నరేష్‌తో నాకు చాలా ఏళ్ల నుంచి పరిచయం ఉంది. నరేష్ అద్భుతమైన సంగీతం ఇచ్చాడు. అనిల్ ఎడిటింగ్ అందరినీ ఆకట్టుకుంటుంది. ఈ సినిమా జనవరి 24న రాబోతోంది. అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది. అందరూ చూసి ఎంజాయ్ చేయండి అని అన్నారు. ధన్యా బాలకృష్ణ మాట్లాడుతూ, 'నన్ను నమ్మి ఇంత పెద్ద పాత్రను నాకు ఇచ్చిన విద్యకు థాంక్స్. చిన్నప్పటి నుంచి నాకు విజయశాంతి, మాలాశ్రీలా యాక్షన్ చిత్రాలు చేయాలనిఉండేది. ఇప్పటికి ఆ కల నెరవేరింది. ఈ చిత్రం చాలా బాగా వచ్చింది. మంచి ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్. మా చిత్రానికి పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మా సినిమాను అందరూ చూడండి. నచ్చితే అందరికీ చెప్పండి' అని అన్నారు. పూజా రామచంద్రన్ మాట్లాడుతూ, 'మళ్లీ తెలుగు పరిశ్రమకు రావడం ఆనందంగా ఉంది. ఇక్కడ నాకు ఎంతో ప్రేమ లభిస్తుంటుంది. స్వామి రారా నుంచి నన్ను ఆదరిస్తూనే ఉన్నారు. నాకు ఇంత మంచి పాత్రను ఇచ్చిన శ్రీవిద్యకు థాంక్స్. ధన్యతో కలిసి పని చేయడం ఆనందంగా ఉంది. డీఓపీ అభి, డైరెక్టర్ విద్య ద్వయం అద్భుతంగా పని చేసింది. సినిమాకు పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. ఈ సినిమా జనవరి 24న రాబోతోంది. అందరూ చూడండి' అని అన్నారు. నిర్మాత ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ, 'మా డైరెక్టర్ శ్రీవిద్యకు థాంక్స్. మా సినిమా కోసం పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. ఈ సినిమాకు నేను ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేశాను. నాకు ఆ అవకాశం ఇచ్చిన దర్శకురాలికి థాంక్స్.



# వరుణ్ తేజ్ 15వ మూవీ అనౌన్స్‌మెంట్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ పుట్టిన రోజును జరుపుకుంటు న్నారు, ఈ సందర్భంగా, వరుణ్ తేజ్ 15వ మూవీ అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రిలీజైయింది. హ్యూమరస్ అండ్ అడ్వంచరస్ చిత్రాలను రూపొందించడంలో పేరుపొందిన మేర్లపాక గాంధీ విటి15 చిత్రానికి దర్శకత్వం వహిస్తారు. ఈ ప్రాజెక్ట్‌ను యువి క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ భారీ స్థాయిలో నిర్మించనున్నాయి. అనౌన్స్‌మెంట్ పోస్టర్ ఒక ప్రత్యేకమైన కొరియన్ కనెక్షన్‌ను చూపిస్తుంది. దీనిలో ఫైర్ డ్రాగన్ లోగోతో కూడిన జాడి, మంటలతో చుట్టుముట్టబడి వుంది. పోస్టర్ కొరియన్ టెక్స్ట్‌తో సీక్రెట్‌ని మరింత పెంచుతుంది. ప్రేక్షకుల కోసం ఎంటర్టైనింగ్ అడ్వంచరస్ జర్నీని సూచిస్తుంది. మేర్లపాక గాంధీ థ్రిల్స్, హ్యూమర్ బ్లెండ్ చేస్తూ అద్భుతమైన స్క్రిప్ట్‌ను రాశారు. ఈ ఇండోకొరియన్ హర్రర్ కామెడీ చిత్రంలో వరుణ్ తేజ్ యూనిక్ క్యారెక్టర్ లో కనిపించనున్నాడని పోస్టర్, ట్యాగ్‌లైన్ సూచిస్తోంది. తొలి ప్రేమ భారీ విజయం తర్వాత, వరుణ్ తేజ్ మరోసారి సెన్సేషనల్, బ్లాక్‌బస్టర్ సంగీత దర్శకుడు ఎస్. థమన్‌తో కలిసి ఈ ప్రాజెక్ట్ చేస్తున్నారు. ఈ సంవత్సరం మార్చిలో ప్రొడక్షన్ ప్రారంభం కానుంది.



ఇది దర్శకుడు మేర్లపాక గాంధీ, యువి క్రియేషన్స్‌తో వరుణ్ తేజ్ ఫస్ట్ కొలాబరేషన్. వరుణ్ తేజ్ గతంలో ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో విమర్శకుల ప్రశంసలు పొందిన కంచె సినిమా చేశారు. మేర్లపాక గాంధీ గతంలో యువి క్రియేషన్స్ బ్యానర్‌పై సెన్సేషనల్ హిట్ ఎక్స్‌ప్రెస్ రాజా చిత్రాన్ని తీశారు. మిగిలిన నటీనటులు, సాంకేతిక సిబ్బందికి సంబంధించిన వివరాలు మేకర్స్ త్వరలో తెలియజేస్తారు.

# తమిళ్‌లో 'హాంగ్ కాంగ్ వారియర్స్'

హాంగ్ కాంగ్ సినీ చరిత్రలో వెయ్యి కోట్లు వసూలు చేసిన సంచలన చిత్రం హాంగ్ కాంగ్ వారియర్స్. లూయిస్ కూ, సమ్మో కామ్‌బో హంగ్, రిచీ లీడ్ రోల్స్ నటించిన ఈ యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్‌కి సోయ్ చీయాంగ్ దర్శకత్వం వహించారు. కిన్ యీ ఔ, తైలీ చాన్, లి జున్ రైటర్స్. హాంగ్ కాంగ్‌లో సంచలన విజయం సాధించిన ఈచిత్రం జనవరి 24, 2025నతెలుగు, తమిళం, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో రిలీజ్ కానుంది.హాంగ్ కాంగ్ వారియర్స్‌ని తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళ్‌లో ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ విఎన్‌ఆర్ సినిమా గ్రాండ్‌గా రిలీజ్ చేస్తోంది. లీడ్ యాక్టర్స్ ఇంటెన్స్ యాక్షన్ మోడ్‌లో కనిపించిన రిలీజ్ డేట్ పోస్టర్ చాలా ఎట్రాక్టివ్‌గా వుంది.

నటీనటులు: లూయిస్ కూ, సమ్మో కామ్‌బో హంగ్, రిచీ, రైటర్స్: కిన్‌యీ ఔ, తైలీ చాన్, విఎన్‌ఆర్, దర్శకత్వం: సోయ్ చీయాంగ్ తెలుగు, తమిళ్ రిలీజ్: విఎన్‌ఆర్ సినిమా పీఆర్వో: వంశీ శేఖర్.



# ఎమోషన్స్ మూవీ 'గాంధీ తాత చెట్టు'

ప్రముఖ దర్శకుడు సుకుమార్ బండ్రెడ్డి తనయురాలు సుకృతి వేణి బండ్రెడ్డి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం గాంధీ తాత చెట్టు. పద్మావతి మల్లాది దర్శకురాలు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, గోపీ టాకీస్ సంస్థలు సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి శ్రీమతి తబితా సుకుమార్ సమర్పకురాలు. నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, శేష సింధురావు నిర్మాతలు. ఇప్పటికే ఈ చిత్రం పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శింపబడి ఎన్నో అవార్డులు కైవసం చేసుకుంది. ఉత్తమ బాల నటిగా సుకృతి వేణి కూడా పురస్కారం పొందారు. కాగా ఈ చిత్రాన్ని జనవరి 24న ప్రపంచవ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకురాలు పద్మావతి మల్లాదితో జరిపిన ఇంటర్వ్యూ ఇది. **మీ నేపథ్యం?** నేను హైదరాబాద్‌లో పుట్టి పెరిగాను. నేను చదివే స్కూల్‌కు మా అమ్మే ప్రిన్సిపాల్. స్కూల్‌తో పాటు ఇంట్లోనే తన్నులు తినేదాన్ని. పీజీ పూర్తిచేసిన తరువాత చంద్రశేఖర్ యేలేటి దగ్గర రచన విభాగంలో పనిచేశాను. రాధేశ్యామ్‌కు కూడా రచయితగా పనిచేశాను. ఆ సమయంలోనే మహానటి సినిమాకు రైటర్‌గా పనిచేసే అవకాశం వచ్చింది. చూసి చూడగానే సినిమాకు డైలాగ్స్ రాశాను. అమ్ము అనే సినిమాకు కూడా పనిచేశాను. బృంద అనే వెబ్ సీరిస్‌కు రచయితగా వర్క్ చేశాను. **గాంధీ తాత చెట్టు చిత్ర కథ మీలో ఎలా చిగురించింది?** నా స్నేహితుడు చెట్టుకు, మనిషికి లవ్‌స్టోరీ రాస్తే బాగుంటుంది అనడంతో నాకు ఆ ఐడియా బాగా నచ్చింది. నాకు కూడా స్వతహాగా పచ్చదనం, చెట్లు అంటే చాలా ఇష్టం. ఈ లైన్‌కు నేను బాగా కనెక్ట్ అయ్యాను. మొక్కల గురించి తదుపరి తరం వాళ్లకు చెప్పాలనే సంకల్పంతో ఈ కథ రాసుకున్నాను. ఒక అమ్మాయి అహింసవాదంతో ఊరిని, చెట్టును ఎలా కాపాడింది? అనేది కథ ఇది. పూర్తి సందేశంతోపాటు కమర్షియాలిటి ఉన్న సినిమా. తప్పకుండా అందరి హృదయాలకు హత్తుకుంటుంది. ఇది కేవలం అవార్డ్ సినిమా కాదు. అందరికి నచ్చే కమర్షయాలిటీస్, ఎమోషన్స్ ఉన్న సినిమా. **సినిమా చిత్రీకరణ ఎక్కడ చేశారు?** మొదట నా కథ నేపథ్యానికి తగిన వరల్డ్ క్రియేట్ చేద్దామని నిజామాబాద్‌కు వెళ్లాను. నిజామాబాద్ ఫ్రెండ్ ఫామ్‌లో నా కథకు కావాల్సిన చెట్టు దొరికింది. చెరుకు తోట ఉన్న ఊరు రంగంపేట అనే ఊరిలో చిత్రీకరణ కూడా చేశాం. నా కథ 1947లో గాంధీగారు చనిపోయినప్పుడు తాత నాటిన చెట్టుతో ప్రారంభమవుతుంది. **పీరియాడికల్ నేపథ్యం ఎందుకు సెలక్ట్ చేసుకున్నారు?** నేను కథ రాసుకున్నప్పుడే నేను పదవ తరగతి చదువుతున్న టైమ్‌లో కథ నడుస్తున్న నేపథ్యాన్ని ఎంచుకున్నాను. ఈ సినిమా చిత్రీకరణ చాలా నేచురల్‌గా జరిగింది. ఈ చిత్రీకరణ జరుగుతున్న రెండో రోజే తబితా సుకుమార్ సమర్పణలో చేద్దామని ఆమె డిసైడ్ చేసుకున్నారు.


దర్శకురాలు మల్లాది పద్మ


కీర్తి సురేష్ నయా లుక్


# 'ప్రేమంటే' గ్రాండ్ లాంచ్

ఎక్సయిటింగ్ లైనప్‌తో అలరించబోతున్న ప్రియదర్శి, రానా దగ్గుబాటి, జాన్వీ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్ రావు క్రేజీ కొలాబరేషన్‌లో సినిమా చేస్తున్నారు. ట్యాలెంట్ యాక్టర్ ఆనంది, ప్రముఖ యాంకర్ సుమ కనకాల ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌తో నవనీత్ శ్రీరామ్ డైరెక్టర్‌గా డెబ్యు చేస్తున్నారు. ప్రతిష్టాత్మక టైమ్స్ పవర్ ఉమెన్ 2024 అవార్డు గ్రహీతగా గుర్తింపు పొందిన తర్వాత జాన్వి నారంగ్ ఫస్ట్ ప్రొడక్షన్ వెంచర్ ఇది. నారాయణ్ దాస్ నారంగ్ ఆశీస్సులతో, ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పి బ్యానర్లపై నిర్మిస్తున్నారు, స్పిరిట్ మీడియా దీనిని సమర్పిస్తోంది. మేకర్స్ ప్రేమంటే అనే టైటిల్‌ను విడుదల చేశారు, రెండు టీ కప్పులు టెర్రస్‌పై వుంచి, ప్రశాంతమైన నగర రాత్రి వాతావరణాన్ని కలిగి ఉన్న ఎట్రాక్టివ్ పోస్టర్‌ను విడుదల చేశారు, థ్రిల్‌యూ ప్రాప్తిరస్తు అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్ ఎక్సయిటింగ్ సినిమా ఎక్స్ పీరియన్స్ చూస్తోంది. మూవీ టీం, ప్రత్యేక అతిథుల సమక్షంలో పూజా కార్యక్రమంతో ఈ చిత్రం ఘనంగా ప్రారంభ మైయింది. రానా క్లాప్ ఇవ్వగా, సందీప్ రెడ్డి వంగా ముహూర్తపు షాట్ కోసం కెమెరాను స్విచ్ ఆన్ చేశారు. సునీల్ నారంగ్, భరత్ నారంగ్, అభిషేక్ నామా, సుధాకర్ రెడ్డి, రామ్ మోహన్ రావు, జనార్దన్ రెడ్డి, విజయ్‌కుమార్, శ్రీధర్ మూవీ లాంచింగ్ ఈవెంట్‌లో పాల్గొన్నారు. ఈ చిత్రం త్వరలో సెట్స్ పైకి వెళ్లనుంది. సునీల్, భరత్ నారంగ్ మార్గ దర్శకత్వంలో జాన్వి నారంగ్ కంటెంట్‌బేస్డ్ సినిమా ప్రపంచంలోకి తన ప్రయాణాన్ని ప్రారంభించనుంది. ఆమె మొదటి ప్రాజెక్ట్ అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే ఒకఉత్తేజకరమైన ఎంటర్‌టైనర్. ఇండస్ట్రీ పవర్‌హౌస్ రానా దగ్గుబాటి సపోర్ట్ పొందడం ఆమెకు లక్, అతని నిర్మాణ అనుభవం, అసాధారణమైన స్క్రిప్ట్ చాయిస్ ఈ చిత్రానికి గొప్ప వాల్యూని జోడిస్తున్నాయి. ట్యాలెంటెడ్ టెక్నిషియన్స్ ఈ చిత్రానికి పని చేస్తున్నారు. విశ్వనాథ్ రెడ్డి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తున్నారు, అన్వర్ అలీ ఎడిటర్. నటీనటులు: ప్రియదర్శి, ఆనంది, సుమ కనకాల.



# ప్రముఖ నటుడు రాజ్‌కుమార్ మృతి

తెలుగు చిత్ర పరిశ్రమలో విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ నటుడు విజయ రంగరాజు అలియాస్ రాజ్ కుమార్ కన్నుమూశారు. చెన్నైలో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో విజయ రంగ రాజు గుండెపోటుతో మరణించారు. వారం క్రితం హైదరాబాద్‌లో ఒక సినిమా షూటింగ్‌లో విజయ రంగరాజు గాయపడ్డారు. ట్రీట్మెంట్ కోసం ఆయన చెన్నై వెళ్లి అక్కడే హాస్పిటల్‌లో గుండెపోటుతో మరణించారు. ఇతనికి ఇద్దరు కూతుళ్లు. ఎక్కువగా విలన్, సహాయ పాత్రలు పోషించారు. ఆయన అశోక చక్రవర్తి, స్టేట్ రౌడీ భైరవ ద్వీపం వంటి చిత్రాల్లో నటించి మెప్పించారు. ఐతే, యజ్ఞం సినిమాతో ఆయనకు మంచి గుర్తింపు వచ్చింది. యజ్ఞం చిత్రంలో హీరోగా గోపీచంద్ నటించగా విలన్ పాత్రలో విజయ రంగరాజు నటించాడు. తమిళ, మలయాళ చిత్రాల్లో కూడా ఆయన నటించారు. అలాగే, వెయిట్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ లో కూడా ఈయనకు ప్రవేశం ఉంది. మా విజయ రంగరాజు మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోహార్తులైన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.



# 'కన్నప్ప' ఫస్ట్ లుక్ పోస్టర్

విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా 'కన్నప్ప' సినిమా భారీ ఎత్తున రూపొందుతోన్న సంగతి తెలిసిందే. అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్ ఫ్యాక్టరీ బ్యానర్లో మోహన్ బాబు భారీ ఎత్తున నిర్మిస్తున్నారు. ప్రతీ సోమవారం కన్నప్ప నుంచి ఒక అప్డేట్ వస్తోంది. ఇప్పటివరకు రిలీజ్ చేసిన పోస్టర్‌లు, రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సోమ వారం శివుడిగా నటించిన అక్షయ్ కుమార్ పాత్రకు సంబంధించిన అప్డేట్ ఇచ్చారు. శివుడిగా అక్షయ్ కుమార్ పాత్ర ఎలా ఉండబోతోందో ఈ పోస్టర్‌తో చూపించారు. శివ తాండవం చేస్తున్నట్టుగా ఈ పోస్టర్‌లో కనిపిస్తోంది. ఇలాంటి ఓ అద్భుతమైన సినిమాలో భాగమైనందుకు ఆనందంగా ఉందని, శివుని ఆశీస్సులతో ఆడియెన్స్ ముందుకు ఏప్రిల్ 25న రాబోతోన్నా మంటూ అక్షయ్ కుమార్ తన సోషల్ మీడియాలో రిలీజ్ చేసిన ఈ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంటోంది. కన్నప్ప చిత్రంలో మోహన్ లాల్, ప్రభాస్, మోహన్ బాబు, శరత్ కుమార్, బ్రహ్మానందం, కాజల్ అగర్వాల్, ప్రీతి ముకుందన్ ఇలా ఎంతో మంది భారీ తారాగణం నటించింది. ఈ సినిమా కు ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. ఏప్రిల్ 25న ఈ చిత్రాన్ని సమ్మర్ కానుకగా భారీ ఎత్తున రిలీజ్ చేయబోతోన్నారు.



21-1Pg5.qxd:21-1Pg5.qxd 01/01/01 8:57 AM Page 1



# కుమారుడు పోషణ బాధ్యత తల్లికే సొంతం

## అతుల్ సుభాష్ ఆత్మహత్య కేసులో సుప్రీం ఆదేశాలు



**న్యూఢిల్లీ, జనవరి 20:** తన భార్య తనను మానసిక వేధింపులకు గురిచేస్తోందని 40 పేజీల లేఖ రాసి ఆత్మహత్య చేసుకున్న బెంగళూరు టెకీ అతుల్‌సుభాష్ ఏకైక కుమారుడు ఆతనిభార్య నికితా సింఘానియాతోనే ఉంటాడని సుప్రీంకోర్టు ప్రకటించింది. జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ ఎస్సీ శర్మల బెంచ్ ఈకేసును విచారించి సోమవారం తీర్పు వెలువరించింది. సుభాష్ తల్లి అంజుదేవి దాఖలుచేసిన పిటిషన్‌ను విచారించారు. తమ మనవడిని తమకు అప్పగించాలని, వారు ఎక్కడ దాచి ఉంచింది కూడా చెప్పడంలేదని, గోప్యంగా ఉంచుతున్నారని కోరుతూ పిటిషన్ దాఖలుచేసారు. అలాగే చిన్నారితో వీడియో లింక్‌లో మాట్లాడిన తర్వాత కోర్టు సింఘానియా న్యాయవాదిని ఈ బాలుడిని తమముందు హాజరుపరచాలని చెప్పారు. ఇదిలా ఉండగా పిటిషనర్లు ఒక వారం రోజులు వ్యవధి ఇస్తే సమగ్ర అఫిడవిట్ దాఖలు చేస్తామని కోరారు. అయితే జస్టిస్ నాగరత్న ఆ విజ్ఞప్తిని తిరస్కరించారు. ఇదొక హెబియస్‌కార్పస్ పిటిషన్ అని మేం పిల్లాడినిమాదాలనుకుంటున్నామని, ముందు ఆతడిని కోర్టు ముందు హాజరుపరచాలని ఆదేశించి మరో తేదీన ఈ కోర్టు విచారణచేస్తుందని అన్నారు. అనేకసార్లు విచారణల్లో బెంచ్ ఆ బాలుడిని చూపించాలని ఆదేశించింది. అంతకుముందు ఇదే నెలలో సింఘానియా కోర్టుకు పిటిషన్ చెపుతూ బోర్డింగ్ స్కూలు విద్యార్థి తనకుమారుడుని హర్యానాలోని ఫరీదాబాద్ స్కూలులో చదువుకుంటున్నాడని తెలిపింది. అతుల్‌భార్య సింఘానియా అరెస్టు తర్వాత అతుల్ తల్లితండ్రులు అంజుదేవి, పవన్‌కుమార్‌లు తమ మనవడిని తమకు అప్పగించాలని డిమాండ్ చేసారు. సింఘానియాకు కానీ ఆమె కుటుంబీకులు కానీ తమ మనవడి వివరాలు తెలియకుండా గోప్యంగా ఉంచుతున్నారని వాదించారు. అయితే సింఘానియా మాత్రం తన కుమారుడు తన మేనమామ సుశీల్ సింఘానియా వద్ద ఉన్నాడని తెలిపింది. ఆతర్వాత ఎక్కడ ఉన్నాడో కూడా చెప్పకపోవడంతో కర్ణాటక,ఉత్తరప్రదేశ్, హర్యానా రాష్ట్రాల పోలీస్‌శాఖలనుబాలుడి ఆచూకీతో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. తన బామ్మతో బాలుడు కనీససమయం కూడా గడపలేదని కోర్టు అంగీకరించింది. అయితే ఈకేసులో బాలుడు పిటిషనర్ నానమ్మ చెంతనే ఉండాలని లేదని జస్టిస్ నాగరత్న చెప్పారు. అంతేకాకుండా సరైన దిగువకోర్టులో బాలుడి కస్టడీ కోసం పిటిషన్ వేసుకోవాలని సూచించారు. 2019లో అతుల్ సుభాష్, నికితా సింఘానియాల పెళ్లి అయింది. 2020లో కుమారుడు జన్మించాడు. 2021లో సింఘానియా దంపతులు బెంగళూరుకు మారిపోయారు. 2022లో సుభాష్‌పై ఆమె కుటుంబ కలహాల కోర్టులో కేసులు నమోదు చేసారు. రెండేళ్ల తర్వాత సుభాష్ తన బెంగళూరు ఫ్లాట్‌లోనే గత ఏడాది డిసెంబరు 9న చనిపోయాడు. 81నిమిషాల వీడియో, 24 పేజీల సూసైడ్‌నోట్ రాసి చనిపోయిన అతుల్ సింఘానియా ఆమె కుటుంబం తనపై తప్పుడు కేసులు నమోదు చేసిందని, తనపైనా, తన తల్లిదండ్రులపైన కేసులు వేసి మూడు కోట్లు డిమాండ్ చేస్తోందని వాదించారు. ఇలాంట "కేసుల్లో న్యాయవ్యవస్థ కూడా మహిళల పక్షపాతిగా మారుతోందని, చట్టాలను దుర్వినియోగం చేస్తున్నారని, మహిళల రక్షణకున్న చట్టాలను ఇతర మార్గాల్లో దుర్వినియోగపరుస్తున్నారని వాదించారు.



## పరిహారం సొమ్ము వద్దన్న ఆర్జీకర్ మృతురాలి తల్లిదండ్రులు

**కోల్‌కతా, జనవరి 20:** ఆర్జీకర్ ఆసుపత్రిలో పిజివైద్యవిద్యార్థిని హత్యాచారంకేసులో ఏకైక నిందితుడు సంజయ్‌రాయ్‌కు జీవితఖైదు శిక్ష విధించిన న్యాయస్థానం హతురాలి కుటుంబానికి 17 లక్షలరూపాయలు పరిహారంగా చెల్లించాలని ఆదేశించింది. అయితే మృతురాలి తల్లితండ్రులు తమకు ఎలాంటి పరిహారం వద్దని కోర్టుకు నివేదించారు. న్యాయమూర్తి అనిర్బన్‌దాస్ ఈ కేసును విచారించి సీల్దాకోర్టులో సోమవారం తీర్పును వెలువరించారు. యావజ్జీవఖైదు శిక్షను విధించడంతోపాటు మృతురాలి కుటుంబానికి రూ.17లక్షలు చెల్లించాలని ఆదేశించారు. అయితే ఈకేసు అత్యంత అరుదైన కేసులు వంటి కోవలోకిరాదని అందువల్లనే మరణశిక్షను విధించాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. తీర్పు వెలువరించే సమయంలో కోర్టుహాలులో ఉన్న మృతురాలి తల్లితండ్రులు తమకు ఎలాంటిపరిహారం వద్దని న్యాయం కావాలని అన్నారు. జడ్జి స్పందిస్తూ తాను ఇప్పటికే ఉత్తర్వులు జారీచేసానని, వారికి ఇష్టమైన సమయంలో ఈ సొమ్మును వినియోగించుకోవచ్చని, అయితే ఈ పరిహారం హత్యాచారం జరిగినందుకు ఇచ్చింది కాదని, న్యాయపరంగా ఉన్న అంశాలను పరిగణనలోనికి ఇచ్చినదని అన్నారు. అయితే నిందితుడిపై నమోదయిన అభియోగాలు రుజువు అయ్యాయని అందువల్లనే అతడిని సాక్ష్యాల ఆధారంగానే దోషిగా తేల్చినట్లు తెలిపారు. ప్రాసిక్యూషన్ నిందితుడికి మరణశిక్షే సరైనదని వాదించింది. సమాజంలో న్యాయంపై ఉన్న విశ్వాసాన్ని పెంపొందించేందుకు ఇలాంటి నిందితులకు మరణశిక్ష వేయాలని కోరారు. అయితే ఈకేసు అత్యంత అరుదైన కేసుల కేటగిరీలోకి రాదని అలాంటి కేసులకు మరణశిక్ష విధించడం జరుగుతుందని జడ్జి తిరస్కరించారు.



## శబరిమల అయ్యప్ప ఆలయం మూసివేత!

### వెల్లడించిన ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు

**తిరువనంతపురం, జనవరి 20:** కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయంలో మండలపూజ, మకరవిళక్కు వార్షిక పూజలు వైభవంగా ముగిశాయి. దీంతో సోమవారం ఉదయం ఆలయాన్ని మూసివేసినట్లు ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు అధికారులు వెల్లడించారు. పందలం రాజకుటుంబ ప్రతినిధి త్రికేట్టునాళ్ రాజరాజ వర్మ అయ్యప్ప దర్శనం చేసుకున్న తర్వాత సోమవారం ఉదయం 6.30 గంటలకు ఆలయాన్ని మూసివేశామని పేర్కొన్నారు. ఈ సీజన్‌లో 53 లక్షల మందికిపైగా భక్తులు అయ్యప్ప స్వామి వారిని దర్శించుకున్నారని తెలిపారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. రెండునెలల పాటు జరిగే మండల, మకరవిళక్కు వార్షిక పూజల కోసం నవంబర్ 15న అయ్యప్ప ఆలయాన్ని పూజారులు తెరిచారు. మండలపూజ అనంతరం డిసెంబర్ 26న గుడిని మూసివేశారు. 41 రోజుల పాటు సాగిన పూజల్లో లక్షలాది మంది భక్తులు పాల్గొన్నారు. నాలుగు రోజుల విరామం తర్వాత డిసెంబర్ 30న సాయంత్రం 4 గంటలకు మళ్లీ ఆలయాన్ని తెరిచారు. ఈ సీజన్‌లో అయ్యప్ప భక్తులు పోటెత్తారు. రోజుకు లక్షలాది మంది భక్తులు అయ్యప్పను దర్శించుకున్నారు. మొత్తం 53 లక్షల మందికిపైగా భక్తులు అయ్యప్ప దర్శనం చేసుకున్నట్లు టిడిబి తెలిపింది. సోమవారం ఉదయం 5 గంటలకు ఆలయాన్ని తెరిచి, తూర్పు మండపంలో గణపతి హోమం చేశామని, ఆ తర్వాత మేల్శాంతి అరుణ్‌కుమార్ నంబూద్రి అయ్యప్ప విగ్రహానికి విభూతాభిషేకం నిర్వహించి, దానిని రుద్రాక్షలతో అలంకరించారని వెల్లడించారు. హరివరాసనం పారాయణం తర్వాత మేల్శాంతి ఆలయ దీపాలను ఆర్పి గర్భగుడిని అధికారికంగా మూసివేశారని చెప్పారు. అనంతరం ఆలయ తాళాలను రాజకుటుంబ సభ్యుడికి అప్పగించామని తెలిపారు.

# ప్రియుడిని హతమార్చిన యువతికి మరణశిక్ష

## కేరళ కోర్టు సంచలన తీర్పు



**తిరువనంతపురం, జనవరి 20:** తన చెలికాడికి కూల్‌డ్రింక్‌లో విషం ఇచ్చి హత్యచేసిన నేరం రుజువుకావడంతో 24 ఏళ్ల మహిళకు కేరళ కోర్టు సోమవారం మరణశిక్ష విధించింది. గ్రీష్మ అనే మహిళ తనతో ఉన్న 23 ఏళ్ల ప్రియుడు షారోన్‌రాజ్‌ను అంతంచేయాలనినిర్ణయించుకుని ఈ ఘాతుకానికి పాల్పడింది. వారి మధ్యఉన్న బంధం తెంచుకోడానికి ప్రియుడిని అంతమొందించడమే ఏకైకమార్గంగా ఆమె భావించింది. స్థానిక కోర్టు గ్రీష్మ ఆమె మేనమామలను దోషులుగా నిర్ధారించింది. ఈకేసులో నిందితురాలి వయసును చూసి క్షమించాల్సిన అవసరం లేదని నేర తీవ్రత దృష్ట్యా వారికి మరణశిక్ష విదించాల్సి వస్తోందని అలాగే ఆమె విద్యాపరమైన ఉన్న తలక్ష్యాలను కూడా పరిగణనలోనికి తీసుకోలేమని వెల్లడించింది. అయితే అంతకుముందు ఎలాంటి నేరచరిత్రలేకపోయినా ఆమె తల్లి తండ్రులకు ఒక్కతే కుమార్తె అని చూసినా కూడా నేర తీవ్రతముందు అవన్నీ పరిగణనలోనికి తీసుకోలేమని న్యాయమూర్తి అన్నారు. క్రమానుగతంగా సాక్ష్యాలు, శాస్త్రీయ ఆధారాలను చూపించి నేరం రుజువుపరిచింది. కేరళలో అతిపిన్న వయసులో మరణశిక్ష పడిన మొట్టమొదటి ఖైదీగా గ్రీష్మ నిలిచింది. బాధితురాలి న్యాయవాది మాట్లాడుతూ సాక్ష్యాలను కోర్టు అంగీకరించిందని తాను కోర్టులో వాదనలు వినిపిస్తున్న సమయంలోనే గుర్తించానని, కోర్టు సాక్ష్యాలను విశ్వసించిందని, అయితే ఈ తీర్పు అత్యంత అరుదైన కేసుగా పరిగణించి శిక్షను తగ్గించాలని కోరామన్నారు. అంత తీవ్రస్థాయి తీర్పు బాధితురాలికి అవసరంలేదని మరణశిక్షను జీవితఖైదుగా మార్చాలని కోరినట్లు తెలిపారు. అయితే నేరం చేసిన తీరును పరిగణనలోనికి తీసుకుంటే నిందితురాలికి మరణశిక్షే కరెక్టని ప్రత్యేక పబ్లిక్‌ప్రాసిక్యూటర్ విఎస్ వినీత్‌కుమార్ తెలిపారు. 2022లో గ్రీష్మ తన బాయ్‌ఫ్రెండ్‌కు ఒక ఆయుర్వేదిక్ టానిక్‌లో విషం కలిపి తాగించింది. 11రోజుల తర్వాత అన్ని అవయవాలు దెబ్బతిని చనిపోయినట్లు తేలింది. రాజ్ తనతో ఉన్న బంధాన్ని తెంచుకునేందుకు ఇష్టపడకపోవడంతోనే ఈదుశ్చర్యకు పాల్పడింది. తమిళనాడుకు చెందిన ఒక వ్యక్తితో తన పెళ్లి కుదిరిందని అయినా కూడా రాజ్ తన వెంటపడుతుండటంతో ఈ దురాగతానికి పాల్పడింది. పారాసిటమాల్ మాత్రలు పండ్లరసంలో కలిపి తాగించేందుకు ప్రయత్నించింది. అయితే ప్రియుడు ఆ రసం రుచి లేకపోవడంతో తాగడానికి నిరాకరించాడు. తిరువనంతపురం జిల్లాలోని పరస్సల గ్రామానికి చెందిన రాజ్ బిఎస్సీ రేడియాలజీ విద్యార్థి. ఈకేసులో గ్రీష్మ ఐపిసిలోని హత్య, హత్యకు కుట్ర, నమ్మకద్రోహం వంటి అభియోగాల కింద శిక్షార్హురాలని ప్రాసిక్యూషన్ వాదించింది. సాక్ష్యాలు ధ్వంసం చేసేందుకు కూడా యత్నించిందని మరో సెక్షన్ పెట్టారు. నిందితురాలి తల్లిని కూడా కస్టడీలోకి తీసుకున్నప్పటికీ ఆధారాలు సాక్ష్యాలు లేనందున ఆమెను విడుదల చేసారు.



## డొనాల్డ్ ట్రంప్ డిన్నర్‌లో నీతా అంబానీ చీరె ప్రత్యేకతలు!

**వాషింగ్టన్, జనవరి 20:** డొనాల్డ్ ట్రంప్ ప్రమాణస్వీకారం కార్యక్రమానికి హాజరయ్యేందుకు దేశవిదేశాల నుంచి అతిరథమహారథులు వాషింగ్టన్‌కు తరలివచ్చారు. వారికోసం ట్రంప్ ప్రత్యేక డిన్నర్ ఏర్పాటు చేశారు. ఈ విందుకు రిలయన్స్ సంస్థ అధినేత ముఖేష్ అంబానీతో పాటు ఆయన భార్య నీతా అంబానీ హాజరయ్యారు. అయితే ఈ డిన్నర్‌లో నీతా అంబానీ ధరించిన చీరె అందరినీ ఆకర్షించింది.

కాంచీపురం నేతతో నలుపు రంగు చీరలో నీతా అంబానీ మెరిసిపోయారు. అలాగే బ్లాక్ కలర్ ఫ్లవర్ బ్లౌజ్‌తోపాటు శతాబ్దాల నాటి ఆభరణాలను సైతం ఆమె ధరించారు. ప్రముఖ కళాకారుడు బి.కృష్ణమూర్తి ఈ చీరెను నేశారు. అలాగే బ్లౌజ్‌ను ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ మనీష్‌మల్హోత్రా డిజైన్ చేశారు. చెవులు, మెడ, చేతికి పచ్చని పూసలు, రాళ్లతో పొదిగిన ఆభరణాలను ఆమె ధరించారు.

అలాగే చేతి మణికట్టుకు సైతం పచ్చని రాయితో చేసిన ఆభరణాన్ని ధరించి.. ఈ డిన్నర్‌లోనే నీతా అంబానీ మెరిసిపోయారు. మొత్తం స్వదేశీ వస్తువులను ఇలా ధరించడం ద్వారా నీతా అంబానీ భారత్‌పై ఉన్న తన అనుబంధాన్ని మరింత ధృడపరుచుకొన్నారు.

ట్రంప్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఈ నెల 18న ముకేష్ అంబానీ దంపతులు అమెరికాకు చేరుకున్నారు. తర్వాత ట్రంప్‌ను కలిసి.. ఈ దంపతులు శుభాకాంక్షలు తెలిపారు. అందుకు సంబంధించిన ఫొటోలు, విడియోలు మీడియా, సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ట్రంప్ సారథ్యంలో భారత్, అమెరికా దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు కొత్త పుంతలు తొక్కుతాయన ముకేష్ అంబానీ ఆశాభావం వ్యక్తం చేశారు.

## జెఎంఎం ఉపాధ్యక్షురాలిగా కల్పనా సోరెన్



**గాండీ(జార్ఖండ్), జనవరి 20:** గాండీ ఎమ్మెల్యే ముఖ్యమంత్రి హేమంత్‌సోరెన్ సతీమణి కల్పనాసోరెన్‌ను పార్టీ ఉపాధ్యపదవికి నియమితులవుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లోజరిగే పార్టీ జాతీయ కన్వెన్షన్‌లోనే సోరెన్ ఈనిర్ణయం ప్రకటిస్తారని అంచనా. కల్పన కూడా పార్టీ బాధ్యతలు స్వీకరించి మరింత పటిష్టం చేయాలన్న ఉత్సాహంతో ఉన్నారు. ఈ కన్వెన్షన్‌లో జెఎంఎం ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన రికార్డుస్థాయి మెజార్టీని మరింతపెంచేదిశగా చర్చలు కూడా జరపాలని నిర్ణయించింది. జెఎంఎం 34స్థానాలను గెలిచిన సంగతి తెలిసిందే. బీహార్,అసోం, ఒడిశా, బెంగాల్, ఛత్తీస్‌ఘర్, తమిళనాడునుంచి వచ్చే ప్రతినిధులు కూడా ఈసారి కన్వెన్షన్‌లో పాల్గొంటారని పార్టీప్రతినిది ఒకరు తెలిపారు. జెఎంఎం గతంలో 2021లో కన్వెన్షన్ నిర్వహించింది. కొవిడ్‌కారణంగా నామమాత్రంగానే ఈ సదస్సును పూర్తిచేసుకుంది. అయితే ఈసారి భారీస్థాయిలో నిర్వహించాలని నిర్ణయించింది. దీనివల్ల పార్టీ ఇతర రాష్ట్రాల్లో విస్తరించే అవకాశంకూడా ఉంటుందని పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. అయితే పార్టీ కన్వెన్షన్ రాంచీలోనా లేక దుంకాలోనా అన్నది నిర్ధారణకాలేదు. స్టార్ క్యాంపెయి నర్‌గా కల్పనా సోరెన్ ఈసారి ఎన్నికల్లో వందకుపైగా ర్యాలీల్లో ప్రసంగించారు. ఇండియా కూటమి విజయంలో ఆమె కూడా కీలకపాత్రపోషించారు. పార్టీ వెల్లువలాంటి విజయానికి ఆమె కీలకంగా నిలిచారు. అందుకోసమే ఇపుడు పార్టీలో ఆమెకు క్రియాశీలక భూమిక ఇవ్వాలని నిర్ణయించారు. పార్టీ ఉపాధ్యక్షపదవికి ఆమెను నామినేట్ చేస్తారని అంచనా. అంతకుముందే కల్పనా సోరెన్ రాష్ట్ర మహిళా శిశు అభివృద్ధిసంక్షేమకమిటీకి ఛైర్మన్‌గా నియమితులయ్యారు. స్పీకర్ రవీంద్ర నాథ్ ఆధ్వర్యంలో మొత్తం 25 హౌస్‌కమిటీలు కూడా ఏర్పాటుచేసారు. ఇండియాకూటమి ప్రచారంలో కూడా జార్ఖండ్ ఝుకేగానహీ ఇండియా రుకేగా నహీ అన్ననినాదాన్ని బహుముఖ ప్రచారంలోకి తెచ్చారు.

# భారత్ ఆర్మీకి చెందిన డేర్‌డెవిల్స్ టీమ్ సరికొత్త రికార్డు..



**న్యూఢిల్లీ, జనవరి 20:** ఈ నెల 26న జరిగే 76వ గణతంత్రదినోత్సవాలకు దేశ రాజధాని నగరంలోని కర్తవ్యపథ్ ముస్తాబవుతోంది. ఈ వేడుకలకు విదేశీ ప్రముఖులతో పాటు పారాలింపిక్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు, ఉత్తమ పనితీరు కనబరచిన గ్రామాల సర్పంచ్‌లు, చేనేత కళాకారులు, అటవీ వన్యప్రాణి సంరక్షులు ఇలా దాదాపు 10,000 మంది ప్రత్యేక అతిథులను కేంద్రం ఆహ్వానించింది. ఇక గణతంత్ర వేడుకల్లో భాగంగా భారత ఆర్మీ ఇప్పటికే పలు విన్యాసాలు చేస్తోంది. ఈ క్రమంలో భారత ఆర్మీకి చెందని డేర్‌డెవిల్స్ టీమ్ సరికొత్త రికార్డు సృష్టించింది. కదులుతున్న బైక్స్‌పై అత్యంత ఎతైన మానవ పిరమిడ్‌ను నిర్మించి ప్రపంచ రికార్డు సృష్టించింది. తద్వారా అసాధారణమైన ఫీట్‌ను సాధించింది. ఏడు మోటార్ సైకిళ్లపై 40 మంది 2 కిలోమీటర్ల మేర ప్రయాణించడం ద్వారా ఈ ఘనతను అందుకుంది. ఆర్మీలోని మోటార్ సైకిల్ రైడర్ డిస్‌ప్లే టీమ్‌ను 'డేర్ డెవిల్స్' అని పిలుస్తారు. ఈ టీమ్‌కు సుదీర్ఘ చరిత్ర ఉంది. అంతేకాదు తమ ప్రదర్శనలతో అంతర్జాతీయ ప్రశంసలు కూడా అందుకుంది. ఈటీమ్ ఇప్పటికే ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, లిమ్కా బుక్ ఆఫ్‌రికార్డ్స్ సహా 33ప్రపంచ రికార్డులను సొంతం చేసుకుంది. 1934 నుంచి ఇప్పటి వరకు డేర్‌డెవిల్స్ టీమ్ గణతంత్ర దినోత్సవ పరేడ్‌లు, ఆర్మీడే పరేడ్‌లు సహా ప్రతిష్టాత్మక కార్యక్రమాల్లో దాదాపు 1,600 మోటార్ సైకిల్స్ ప్రదర్శనలు ఇచ్చి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.



## భయపెడుతోన్న మౌంట్‌ఇబు అగ్నిపర్వతం 20 రోజుల వ్యవధిలో 1000 సార్లు విస్ఫోటం!

**జకార్తా, జనవరి 20:** ఇండోనేసియా ప్రజలను మౌంట్ ఇబు అగ్నిపర్వతం వణికిస్తోంది. ఒక్క జనవరి నెలలోనే వెయ్యిసార్లు విస్ఫోటం చెందిందని ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. రానున్న రోజుల్లో దీని తీవ్రత మరింత ఎక్కువగా ఉండొచ్చన్న హెచ్చరికల నేపథ్యంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలను తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. నార్త్ మలుకు ప్రావిన్స్‌లోని హల్మహేరా ద్వీపంలోని మౌంట్ ఇబు జనవరి నుంచి విస్ఫోటం చెందుతూనే ఉంది. ఇప్పటివరకు దాని నుంచి గాలిలోకి 0.3 కి.మీ. వరకు బూడిద ఎగసిపడింది. తాజాగా ఆదివారం 1.5కి.మీ. మేర పైవరకు బూడిద కనిపించింది. మౌంట్ ఇబు అబ్జర్వేషన్ పోస్ట్ వరకు శబ్దం వినిపించిందని ఇండోనేసియా జియోలాజికల్ ఏజెన్సీ వెల్లడించింది. ఇక ఒక్క ఆదివారమే 17సార్లు అగ్నిపర్వతం బద్దలైందని తెలిపింది. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా చుట్టుపక్కల ఆరు గ్రామాల్లోని మూడు వేల మంది గ్రామస్థులు ఖాళీ చేయాలని అధికారులు ఆదేశాలు ఇచ్చారు. ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే పలువురు గ్రామస్థులు ఖాళీ చేయాలని అధికారులు ఆదేశాలు ఇచ్చారు. ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే పలువురు గ్రామస్థులు అధికారుల హెచ్చరికలను పాటించేందుకు నిరాకరిస్తున్నారు. తమ పంటలను మధ్యలో వదిలి వచ్చేయడానికి వారు సిద్ధంగా లేరు. అయితే అధికారులు మాత్రం వారికి నచ్చజెబుతున్నారు. ఇండోనేసియాలోని క్రియాశీలక అగ్నిపర్వతాల్లో మౌంట్ ఇబు కూడా ఒకటి. అది గత జూన్ నుంచి మరింత క్రియాశీలకంగా మారింది.



## ఐకమత్యం, లౌకికవాదం వైపే ఎన్సీపి

### మహారాష్ట్ర డిప్యూటీ సిఎం అజిత్ పవార్

**ముంబయి, జనవరి 20:** లౌకిక రాజకీయాలకు తమ పార్టీ కట్టుబడి ఉందని రాష్ట్రంలో మతపరమైన విద్వేషాలను వ్యాప్తి చేసే ప్రయత్నాలను సహించబోమని మహారాష్ట్ర డిప్యూటీ సిఎం, ఎన్సీపి చీఫ్ అజిత్ పవార్ అన్నారు. సోమవారం ఆయన జల్నాలో జిల్లా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన సారథ్యంలోని ఎన్సీపిలో కళంకిత వ్యక్తులకు చోటు ఉండదని తేల్చి చెప్పారు. మహారాష్ట్ర ఎప్పుడూ ప్రగతిశీల ఆలోచనలు, సామాజిక సామరస్యానికి నిలయం. ఎన్సీపి ఐక్యమత్యం, లౌకికవాదం వైపే నిలబడుతుంది. వివిధ వర్గాల్లో విద్వేష బీజాలను నాటే వారిని, విభజన రాజకీయాల్లో పాల్గొనేవారిని మేం సహించం, కళంకిత వ్యక్తులను మన పార్టీలో చేర్చుకోవద్దు అని పార్టీ శ్రేణులను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న మాఝీ లడ్కీ బెహన్ యోజన ఆర్థికంగా వెనుకబడిన మహిళల కోసమే. ఆదాయపు పన్ను చెల్లించే వారు సైతం నెలవారీ నగదు బదిలీ పథకం ప్రయోజనాలను పొందుతున్నారు. తమకు తాముగా వారంతా ఆ ప్రయోజనాన్ని వదులుకోవాలి. అర్హులైన లబ్ధిదారులు వచ్చే నెల నుంచి రూ.1500 చొప్పున అందుకుంటారు అని అన్నారు. ఇవిఎంలపై విపక్షాల ఆరోపణలు అర్థంలేనివని కొట్టిపారేసిన అజిత్ పవార్ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు.



## తెరపైకి మాయావతి రెండో మేనల్లుడు

**లక్నో, జనవరి 20:** బహుజన్ సమాజ్ పార్టీ అధినాయకురాలు, యూపి మాజీ ముఖ్యమంత్రి మాయావతి తన రెండో మేనల్లుడు ఇషాన్ ఆనంద్ (26)ను రాజకీయ తెరపైకి తెచ్చారు. రెండు రోజుల కిందట లక్నోలో జరిగిన బిఎస్పీ సమావేశంలో ఇషాన్‌ను ఆమె లాంఛనంగా పార్టీ నాయకులకు పరిచయం చేశారు. దీంతో పార్టీలో ఇషాన్ క్రియాశీలక పాత్ర పోషిస్తారనే ఊహాగానాలు ఊపందుకొన్నాయి. తన 69వ పుట్టిన రోజు వేడుకల మరుసటిరోజు జనవరి 16న మాయావతి పార్టీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పరిచయం చేసిన ఇషాన్ లండన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ వెస్ట్‌మినిస్టర్‌నుంచి న్యాయవిద్య అభ్యసించారు. ఇషాన్ అన్న ఆకాశ్ ఆనంద్ ఇప్పటికే బిఎస్పీ జాతీయ కన్వీనర్‌గా ఉన్నారు. ఇటీవలి హర్యానా అసెంబ్లీ ఎన్నికల బాధ్యతలను పర్యవేక్షించిన ఆకాశ్ ప్రస్తుతం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచార పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఆకాశ్, ఇషాన్ ఇద్దరూ మాయావతి సోదరుడైన ఆనంద్‌కుమార్ సంతానం.

## నిర్లక్ష్య డ్రైవింగ్‌తో 35 మంది బలి

# చైనా వృద్ధుడికి మరణశిక్ష అమలు

**బీజింగ్, జనవరి 20:** చైనాలో ఇటీవల ఓ వ్యక్తి నిర్లక్ష్యంగా కారు నడిపి 35 మంది ప్రాణాలు పొట్టన బెట్టుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో నిందితుడికి మరణశిక్ష పడగా న్యాయస్థానం ఆదేశాల మేరకు అతడికి శిక్ష అమలు చేశారు. మరో కేసులో ఓ యువకుడికీ ఇదే విధంగా మరణశిక్ష అమలు చేసినట్లు చైనా అధికారిక మీడియా సిసిటివి వెల్లడించింది. చైనాకు చెందిన ఫాన్ వీకియూ (62) అనే వ్యక్తి గతేడాది నవంబరు 11న ఝుహాయ్ నగరంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ బయట నిర్లక్ష్యంగా కారు నడిపాడు. అక్కడ వ్యాయామం చేస్తున్న వారిపై దూసుకెళ్లిన ఘటనలో 35 మంది మరణించగా మరో 43 మంది గాయపడ్డారు. తర్వాత కారులో తనను తాను కత్తితో పొడుచుకుని ప్రాణాలు తీసుకునేందుకు యత్నించాడు. కోమాలోకి వెళ్లిన అతడిని ఆస్పత్రిలో చేర్చారు. ఇటీవలే విడాకులు తీసుకున్నాడని, భార్యతో జరిగిన ఆస్తి పంపకంలో అసంతృప్తికి గురవడంతోనే అతడు ఈ ఘోరానికి పాల్పడ్డాడని ప్రాథమిక విచారణలో తేలింది.


ఈ కేసుపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఈ ఘటన అత్యంత ఘోరమైనదిగా పేర్కొంటూ నిందితుడికి మరణశిక్ష విధించింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు అతడికి మరణశిక్ష అమలు చేసినట్లు చైనా అధికారిక మీడియా వెల్లడించింది. చైనాలో ఇటువంటి దారుణాలు అరుదే అయినప్పటికీ గతేడాది అక్కడ ఈ తరహా ఘటనలు వరుసగా చోటుచేసుకోవడం గమనార్హం. జియాంగ్సు ప్రావిన్సులో గత నవంబరులో ఓ యువకుడు కత్తులతో దాడికి పాల్పడిన ఘటనలో 8 మంది మృతి చెందగా 17 మంది గాయపడ్డారు. ఈ కేసులో స్థానిక న్యాయస్థానం నిందితుడికి మరణశిక్ష విధించింది. పాఠశాల పూర్వ విద్యార్థి అయిన ఈ 21 యేళ్ల యువకుడికి కూడా మరణశిక్ష అమలు చేశారు.

## 'ప్రస్తుత తీర్పు సంతృప్తికరంగా లేదు' మమతా బెనర్జీ



**కోల్‌కతా, జనవరి 20:** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన ఆర్జీకర్ ఆసుపత్రి వైద్యురాలిపై హత్యాచారం కేసులో దోషి సంజయ్‌రాయ్‌కి న్యాయస్థానం జీవిత ఖైదు విధించిన సంగతి తెలిసిందే. దీనిపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించారు. ఈ తీర్పుపై తాను సంతృప్తి చెందలేదని అన్నారు. జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనకు సంబంధించిన కేసులో దోషికి మరణశిక్ష విధించాలని మేమంతా డిమాండ్ చేశాం. కానీ, అలా జరగలేదు. ఈ కేసును బెంగాల్ పోలీసుల నుంచి బలవంతంగా సిబిఐకి బదిలీ చేశారు. ఒకవేళ ఈ కేసు దర్యాప్తు బెంగాల్ పోలీసుల చేతుల్లోనే ఉంటే దోషికి మరణశిక్ష పడేలా శాయశక్తులా ప్రయత్నించేవారు. అసలు విచారణ ఎలా జరిగిందో తెలియదు. రాష్ట్ర పోలీసులు విచారించిన ఇలాంటి అనేక కేసుల్లో దోషులకు మరణశిక్ష పడింది. ప్రస్తుత తీర్పు సంతృప్తికరంగా లేదు అని విలేకరుల ఎదుట సిఎం మమతా పేర్కొన్నారు. కాగా గతేడాది ఆగస్టు 9వ తేదీ రాత్రి ఆర్జీకర్ సెమినార్ రూమ్‌లో ఒంటరిగా నిద్రిస్తున్న జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన ప్రకంపనలు సృష్టించింది. ఈ కేసు బెంగాల్ పోలీసుల నుంచి సిబిఐకి బదిలీ అయింది. దీనిలో భాగంగా విచారణ అనంతరం ప్రత్యేక కోర్టుకు అభియోగాలు సమర్పించింది. ప్రధాన నిందితుడు సంజయ్‌రాయ్‌పేరును మాత్రమే చార్జిషీట్‌లో చేర్చింది. ఆసుపత్రి ఆవరణలోని సిసిటివిలో నమోదైన దృశ్యాల ఆధారంగా సంజయ్‌ను ఆగస్టు 10న కోల్‌కతా పోలీసులు అరెస్ట్ చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిని దోషిగా తేల్చింది. శిక్ష ఖరారు చేయడానికి ముందు సంజయ్ తన వాదనలు వినిపించాడు. తాను ఏ నేరం చేయలేదని ఏ కారణం లేకుండానే తనను ఇందులో ఇరికించారని అన్నాడు. తాజాగాకోర్టు అతడికి జీవిత ఖైదును విధించింది.

## సైఫ్‌పై దాడి కేసు..కోర్టులో ఇద్దరు న్యాయవాదుల గొడవ



**ముంబై, జనవరి 20:** బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్‌పై దాడి చేసిన వ్యక్తిని ముంబై పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం మధ్యాహ్నం ముంబై మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ముందు నిందితుడిని హాజరుపరిచారు. ఈ సందర్భంగా కోర్టులో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. నిందితుడు షెహజాద్ మహమ్మద్ తరఫున వాదించేందుకు ఇద్దరు లాయర్లు గొడవ పడ్డారు. దీంతో న్యాయమూర్తి వారిద్దరి మధ్య సయోధ్య కుదిర్చారు. ఇంతకూ ఏం చేశారంటే.. సైఫ్ అలీఖాన్‌పై కత్తితో దాడి చేసిన కేసులో నిందితుడు షరీఫుల్ ఇస్లాం షెహజాద్ మహమ్మద్ రోహిల్లా అమీన్ ఫకీర్ (30)ను ఆదివారం తెల్లవారుజామున అరెస్టు చేశారు. బంగ్లాదేశ్‌కు చెందిన అతడిని థాణేలో అటవీ ప్రాంతంలో ఉన్న ఒక లేబర్ క్యాంప్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి ముంబైకి తరలించారు. అనంతరం భారీ బందోబస్తు నడుమ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. నిందితుల బోనులో నిలబడి ఉన్న షెహజాద్‌ను.. పోలీసులపై ఏమైనా ఫిర్యాదులు ఉన్నాయా అని అంటూ న్యాయమూర్తి ప్రశ్నించారు. దానికి నిందితుడు వ్యతిరేకంగా సమాధానం ఇచ్చాడు. ఈ క్రమంలో షెహజాద్ వద్దకు వెళ్లిన ఓ లాయరు.. అతని తరఫున తాను వాదిస్తానంటూ వకాలత్ పత్రంపై సంతకం చేస్తున్నాడు. అంతలో మరో న్యాయవాది కూడా నిందితుని వద్దకు వెళ్లి తాను వకాల్తా పుచ్చుకుంటానంటూ సంబంధిత పత్రాలపై సంతకం కోసం ప్రయత్నించాడు. దీంతో ఇద్దరు లాయర్లు కోర్టు హాలులోనే వాదులాడుకున్నారు. దీంతో జోక్యంచేసుకున్న న్యాయమూర్తి.. ఇద్దరూ ఒకటీమ్‌గా అతని తరఫున వాదనలు వినిపించవచ్చని తెలిపారు. దానికి ఆ ఇద్దరు న్యాయవాదులు కూడా సమ్మతించారు. కాగా, నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపర్చగా ఐదు రోజుల పోలీసు కస్టడీకి పంపిందని, ఈ దాడి వెనుక అంతర్జాతీయంగా ఏదన్నా కుట్ర ఉందా అన్న కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. బంగ్లాదేశ్ నుంచి ఐదు నెలల క్రితం భారత్‌కు అక్రమంగా వచ్చిన నిందితుడు తన పేరును విజయ్‌దాస్‌గా మార్చుకున్నాడు. తర్వాత హౌస్ కీపింగ్ పనులు చేసేవాడు. ఆ ఇల్లు సైఫ్‌అలీ ఖాన్‌దని తనకు తెలియదని, కేవలంచోరీ కోసమే వచ్చినట్లు పోలీసువర్గాలు వెల్లడించాయి.

21-1Pg6exHMNWJQE.qxd:21-1Pg6exHMNWJQE.qxd 01/01/01 9:23 AM Page 1



# మామండూరు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

## ఇద్దరు మృతి.. మరో నలుగురికి గాయాలు..

**రేణిగుంట జనవరి 20 ప్రభాతవార్త** తిరుమల శ్రీవారిని దర్శించుకుని కారులో ఆనందంగా తమ ఊరికి తిరిగి వెళుతున్న ఓ కుటుంబం పై విధి చిన్నచూపు చూసింది. ట్రావెల్స్ బస్సు రూపంలో మృత్యువు వెంటాడింది. వారు ప్రయాణిస్తున్న కారు ట్రావెల్స్ బస్సును ఢీకొంది ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డ సంఘటన సోమవారం తిరుపతి జిల్లా రేణిగుంట మండలం రేణిగుంట కోడూరు హైవే మార్గంలో మామండూరు కుక్కల దొడ్డి మధ్య చోటుచేసుకుంది. వివరాలు ఇలా తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువు కు చెందిన సందీప్ షా (35), అతని భార్య అంజలీదేవి (31), కుమార్తెలు లిఖితాషా(12), సోనాలిషా(9), కుమారుడు రుద్ర ప్రతాప్ షా (6) సందీప్ షా స్నేహితుడు నరేష్ లు కారులో గురువారం తిరుమల శ్రీవారి దర్శనానికి బయలుదేరారు. శ్రీవారి దర్శనం ముగించుకొని అదే కారులో సోమవారం పటాన్ చెరువుకు బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న కారు మామండూరు దాటి కుక్కల దొడ్డి సమీపిస్తుండగా దారిపై ఉన్న కోతులను తప్పించబోయి ఎదురుగా వస్తున్న ట్రావెల్స్ బస్సు ను కారు ఢీకొంది. ఈ సంఘటనలో కారు ముందు భాగం నుజ్జయింది.


రోడ్డు ప్రమాద దృశ్యం

కారు డ్రైవ్ చేస్తున్న సందీప్ షా, అతని భార్య అంజలీదేవి అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న వారంతా తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న

రేణిగుంట అర్బన్ పోలీసులు సంఘటన స్థలం చేరుకున్నారు. అర్బన్ ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో పోలీసులు ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్ లో చికిత్స నిమిత్తం ఆసుపత్రులకు తరలించారు. రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు సంఘటన స్థలం చేరుకొని ప్రమాదం జరిగిన స్థితిగతులను పరిశీలించారు.



# మహాశివరాత్రికి లేజర్ అందాలు: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**శ్రీకాళహస్తి,జనవరి 20 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో వచ్చే నెల 21 నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది అలంకారాలతో పాటు ప్రత్యేకంగా లేజర్ లైటింగ్ అందాలతో నిర్వహించుటకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు. గతం కన్నా భిన్నంగా శివరాత్రి నిర్వహించాలన్నది లక్ష్యంగా వివరించారు. గతంలో మహాశివరాత్రి పర్వదినాన వాయులింగేశ్వరుని కన్నా ఓ నాయకుడే స్వామిగా వ్యవహారించారన్నారు. ఈ ఏడాది స్వామి దర్శనానికి ప్రాధాన్యత ఇవ్వటానికి అధికారులకు ఆదేశించామన్నారు. ఇక మహాశివరాత్రి పర్వదినాన వచ్చిన ప్రతిభక్తుడు సత్వర , సుదర్శనం కోసం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మహాశివరాత్రి తరువాత మాస్టర్‌ప్లాన్‌కు ప్రణాళిక రూపొందించామన్నారు. ఈ నెల 22న కలెక్టర్, ఎస్‌పిలతో సమావేశం ఏర్పాటు చేసామని సుధీర్‌రెడ్డి వివరించారు. లేజర్ అందాలు ప్రత్యేకం: మహాశివరాత్రి సందర్భంగా 13 రోజుల పాటు భక్తులకు కనువిందు చేయటానికి అత్యాధునికి సంకేతిక పరిజ్ఞానంతో పట్టణమంతా ఆకట్టుకునే రీతిలో లైజర్ లైటింగ్ అందాలను రూపకల్పన చేస్తున్నట్లు సుధీర్‌రెడ్డి వివరించారు. ఆదివారం రాత్రి ప్రయోగాత్మకంగా పట్టణంలో పరిశీలించామన్నారు. రాజగోపురం పైన శివపార్వతుల ప్రతిష్టలా, అలాగే కైలాసగిరి పర్వత పంక్తుల్లో ఏర్పాటు చేసిన శివపార్వతుల విగ్రహాలపై ప్రత్యేక లైటింగ్‌ను పరిశీలించామన్నారు. చాలా అద్భుతంగా ఉందని ఎంఎల్‌ఏ అభిప్రాయపడ్డారు. ఇక ఈ ఏడాది సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎంఎల్‌ఏ వివరించారు. ఉమ్మడి రాష్ట్రాల నుంచి పేరెన్నిక గన్న కళాకారుల కార్యక్రమాలను ఏర్పాటు చేసామన్నారు. అంతేకాక తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర ముఖ్యమంత్రులను కూడా ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఆదేశాలతో ఆహ్వానించనున్నట్లు వివరించారు. రాష్ట్రం నుంచి నారాలోకేష్;డెప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. రాజగోపురం పక్కనే ఆకట్టుకునేటట్లు సాంస్కృతిక వేదికను ఏర్పాటుకు ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించినట్లు వివరించారు.

# సామాన్యభక్తులకు సంతృప్తికరంగా వైకుంఠద్వార దర్శనం

## - పదిరోజులు 6.83 లక్షల మంది భక్తులకు అవకాశం

**తిరుమల,జనవరి 20ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోపల మోక్షమార్గం వైకుంఠద్వారాన్ని పదిరోజులపాటు 6,83,304 మంది భక్తులకు సంతృప్తికరంగా టిటిడి అధికారులు దర్శనం చేయించారు. పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలు అనంతరం ఆదివారం అర్ధరాత్రి ద్వారాలను మూసివేశారు. రాజ్యాంగహో దాలోని ప్రముఖులతోబాటు విఐపిలు, సామాన్యభక్తులకు చిన్నపాటి అసౌకర్యం కలగకుండా వారికి నిర్ధేశించిన సమయంలో ప్రశాంతంగా...తక్కువ సమయంలో వెంకన్న వైకుంఠద్వార దర్శనం కల్పించడంలో ఈ ఏడాది టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాధ, ఆలయ వర్గాలు కంకణబద్దులై అంకితభావంతో పనిచేశారు. జనవరి 10వతేదీ నుండి 19వరకు పదిరోజులపాటు విఐపి బ్రేక్ దర్శనాలకు సంబంధించి పరిమితంగానే జారీచేశారు. ఆన్‌లైన్‌లో 19,500 శ్రీవాణి బ్రేక్ దర్శన టిక్కెట్లు(మహాలఘు దర్శనమే) ,1.40లక్షలు ప్రత్యేక ప్రవేశ దర్శన టిక్కెట్లు, ఆఫ్‌లైన్‌లో సామాన్యభక్తులకు పదిం రోజులకు 4.50లక్షల ఎస్‌ఎస్‌డి టైమ్‌స్లాట్ టోకెన్లు ,దాతలు 8వేల టిక్కెట్లతో దర్శనం చేయించారు. పదిరోజులపాటు వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి తిరుమల తిరుపతి దేవస్థానం కల్పించిన సౌకర్యాలు భక్తులను సంతోషం కలిగించాయి. పదిరోజులు తిరుమలకు వచ్చి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కుబడుల రూపంలో హుండీ కానుకలు ఆదాయంవచ్చింది.

# పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌ను ప్రారంభించిన డిజిపి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో జనవరి 5, ప్రభాతవార్త** రాష్ట్ర డి.జి.పి సిహెచ్. ద్వారకాతిరుమలరావు పోలీస్ క్వార్టర్స్ శ్రీరాంపురం రోడ్డులో నూతనంగా నిర్మించిన పెట్రోల్ బంక్, జిల్లా పోలీస్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలీస్ పెరేడ్ గ్రౌండ్ సోమవారం ప్రారంభించారు. అనంతరం పోలీసు గ్రౌండ్ పరిశీలించారు. ఆయనకు ఏలూరు రేంజ్ ఐ.జి వి.జి అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ స్వాగతం పలికారు. ప్రజలకు రక్షణ కల్పించాలని అధికాలకు డిజిపి సూచించారు. దీనిలో అడిషనల్ ఎస్‌ఎపి న్ బి ఎం మురళీకృష్ణ , లా అండ్ ఆర్డర్ ఆడిషనల్ ఎస్పి అల్లూరి వెంకట సుబ్బరాజు, క్రైమ్స్ అడిషనల్ ఎస్పి ఎల్. అర్జున్, ఎల్ చెంచి రెడ్డి, బి. రామకృష్ణ, ఇన్స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.



# అద్భుతరీతిలో దుర్గమ్మకు నృత్యనీరాజనం

**ఇంద్రకీలాద్రి, జనవరి 20, ప్రభాతవార్త :** దుర్గమ్మవారికి సోమవారం తణుకుకు చెందిన నండూరి రాధిక, రాగరవళి కూచిపూడి నృత్యకళాక్షేత్రంకు చెందిన కళాకారులు త్రితిక, క్యాతి, రోషిణి, సహస్ర, హిమజ, తేజస్విని, హిరణ్మయ్, ఉతిస్తా, చంద్రిక, శ్రుతిక, నవీనా, అపూర్వ, పూజ, ప్రజ్ఞ, నరేష్, అంజలిలు మీనాక్షి పంచరత్నం, కంజదళాయతాక్ష, శివాష్టకం, కాలభైరవాష్టకం, తక్కువేమి మనకు, శ్యామలేమీనాఓఇ, బాగ్యదలక్ష్మి బారమ్మ, నమఃశివాయతే, శివతాండవస్తోత్రం, అయిగిరి నందిని, దుర్గాచాలీసా, భోశంభో, చంద్రచూడ, బ్రహ్మాంజలి, గరుడగమన, కూచిపూడి నృత్యం అందించి ఆహుతల మన్ననలందుకున్నారు. వారికి దుర్గమ్మవారి ప్రసాదం, మెమెంటోలను, సర్టిఫికెట్లను డిప్యూటి ఇఒ ఎం రత్నరాజు అందించి సత్కరించారు.

# యంగ్ ఇండియా ప్రాజెక్ట్ ఆర్కిటెక్ట్ నరీందర్ సింగ్ బేడి కన్నుమూత

**అనంతపురం, జనవరి 20, (ప్రభాతవార్త బ్యూరో)** ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎన్నో సేవా, అభివృద్ధి కార్యక్రమాల్లో కీలకంగా వ్యవహరించిన యంగ్ ఇండియా ప్రాజెక్ట్ ఆర్కిటెక్ట్ నరేందర్ సింగ్ బేడి (85) సోమవారం పెనుకొండలోని (శ్రీ సత్యసాయి జిల్లా) తన ఇంట్లో తుది శ్వాస విడిచారు. ఆయన భార్య సోంజా తో పాటు కుమారులు రాజీవ్, సంజయ్, వారి భార్యలు ఆస్ట్రిడ్ , షెల్లీ, కుమార్తె తారా, ఆమె కుటుంబం డొమినిక్, లూకాస్ , బుల్బుల్ మనవరాళ్ళు అర్జున్, మలిక, రోహన్ ఉన్నారు అని నరేంద్ర సింగ్ బీడీ భార్య సోంజా మేరీ పై విధంగా తెలియజేశారు.. అదేవిధంగా అసియన్ ఫ్రాటెర్నా ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ వై.వి. మల్లా రెడ్డి ఒక సందేశంలో మృతుల కుటుంబానికి సంతాపం తెలిపారు. నరీందర్ సింగ్‌ను ఎన్జీఓ రంగానికి మార్గదర్శకులలో ఒకరిగా మల్లారెడ్డి అభివర్ణించారు. "దివంగత నరీందర్ బేడి పెనుకొండ సమీపంలో కొత్త చొరవను ప్రారంభించడానికి ముందు కొంతకాలం లిడిగి వ్యవస్థాపకుడు విసెంట్ ఫెర్రర్‌తో కలిసి పనిచేశారు" అని ఆయన తెలిపారు. ఒక సందేశంలో నరేంద్ర సింగ్ బీడీ సతీమణి సోంజా ఇలా అన్నారు: "బుల్బుల్ అని ప్రేమగా పిలువబడే నరీందర్ సింగ్ బేడి మరణానికి సంబంధించిన హృదయ విదారక వార్తను మేము తీవ్ర దుఃఖంతో పంచుకుంటున్నాము". బుల్బుల్ జూలై 19, 1939న జన్మించారని , సోమవారం (ఈరోజు) జనవరి 20 తేది ఉదయం 8:30 గంటలకు మరణించారని ఆమె చెప్పారు. ఆయన ఇంట్లోనే ఉన్నారని, నిద్రలోనే ప్రశాంతంగా మరణించారని ఆమె చెప్పారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు అంత్యక్రియలు జరుగుతాయని, అందువల్ల నివాళులు అర్పించాలనుకునే వారు జనవరి 21 మంగళవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల మధ్య బేడి ఇంటికి రావచ్చని ఆమె చెప్పారు.

# దేశంలోనే మొదటిసారి డిజిటల్ హెల్త్ అండ్ ప్రెసిషన్ మెడిసన్ సెంటర్ ఏర్పాటు అపోలో యూనివర్సిటీ ఘనత


డిజిటల్ హెల్త్ అండ్ ప్రెసిషన్ మెడిసన్ సెంటర్ ఏర్పాటుపై ఒప్పందాలు చేసుకుంటున్న అపోలో, లీసెస్టర్ యూనివర్సిటీ ఛాన్సలర్లు, వైస్ ఛాన్సలర్లు

**చిత్తూరు, జనవరి 20 ప్రభాతవార్త:** చిత్తూరు అపోలో యూనివర్సిటీ, అపోలో హాస్పిటల్స్ దేశంలోనే ప్రత్యేక ఘనత సాధించింది. అపోలో యూనివర్సిటీ, అపోలో హాస్పిటల్స్ లీసెస్టర్ విశ్వవిద్యాలయం చిత్తూరు అపోలో విశ్వవిద్యాలయ క్యాంపస్‌లో డిజిటల్ హెల్త్ అండ్ ప్రెసిషన్ మెడిసన్ సెంటర్(సిడిహెచ్‌పిఎం) ఏర్పాటు చేయడానికి భాగస్వామ్యం కుదుర్చుకుంది. డిజిటల్ హెల్త్, ప్రెసిషన్ మెడిసిన్ కోసం ప్రపంచ కేంద్రంగా తీర్చిదిద్దడానికి ఈ ఆధునాతన పరిశోధనా కేంద్రం రెండు సంస్థల నైపుణ్యం, వనరులను ఒకే ప్రదేశానికి తీసుకురానుంది. సిడిహెచ్‌పిఎం సెంటర్ దేశంలోనే చిత్తూరు కేంద్రంగా విధులు నిర్వహిస్తుంది. అలాగే లీసెస్టర్ విశ్వవిద్యాలయంలోని కేంద్రం లీసెస్టర్‌లోని గ్లెన్‌ఫీల్డ్ హాస్పిటల్‌లోని బిహెచ్‌ఎఫ్ కార్డియోవాస్కులర్ రీసెర్చ్ సెంటర్‌లో ఏర్పాటు కానుంది. ఈ కేంద్రం సహ డైరెక్టర్లుగా లీసెస్టర్ విశ్వవిద్యాలయంలోని కార్డియాలజీ ప్రొఫెసర్, ప్రొఫెసర్ సర్ నీలేష్ జె.సమాని, అపోలో విశ్వవిద్యాలయంలోని అనుబంధ ఫ్యాకల్టీ, అపోలో హాస్పిటల్స్ చీఫ్ మెడికల్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ డాక్టర్ సుజోయ్ కర్ వ్యవహరిస్తారు. అపోలో యూనివర్సిటీ ఛాన్సలర్, అపోలో హాస్పిటల్స్ వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి సోమవారం లీసెస్టర్ విశ్వవిద్యాలయం, అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ల సమక్షంలో డిజిటల్ హెల్త్ అండ్ ప్రెసిషన్ మెడిసన్ సెంటర్‌ను చిత్తూరు అపోలో యూనివర్సిటీ వేదికగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అపోలో యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి మాట్లాడుతూ అపోలో యూనివర్సిటీ ఆరోగ్యానికి ఎల్లప్పుడు అనుకూలంగా వుంటుందని, సెంటర్ ఫర్ డిజిటల్ హెల్త్ అండ్ ప్రెసిషన్ మెడిసన్ ఆ నమ్మకంపై ఆధారపడి రూపుదిద్దుకుందన్నారు. ఈ విధానంతో తీవ్రమైన, దీర్ఘకాలిక ఆరోగ్య పరిస్థితులకు తగినట్లుగా వ్యాధి అంచనా, నివారణ, రోగ నిర్ధారణ, నిర్వహణను మెరుగుపరచడం ద్వారా ఆరోగ్య సంరక్షణ డెలివరీని మార్చాలని తాము కోరుకుంటున్నట్లు వివరించారు.

# త్వరలో రైల్వే గార్డు నియామకాలకై నోటిఫికేషన్

**గుంతకల్లు రైల్వే,జనవరి 20,ప్రభాతవార్త** తెలుగు రాష్ట్రాలలోని దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో ఖాళీగా ఉన్న గార్డు(ట్రైన్ మేనేజర్)పోస్టులను పదోన్నతుల కోటాకు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. జోన్ పరిధిలోని హైదరాబాద్, సికింద్రాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ డివిజన్‌లలో పదోన్నతుల కోటాలోని 250గార్డు పోస్టుల భర్తీ చేయనున్నట్లు తెలిపారు.

# రాష్ట్రంలో తగ్గిన నేరాలు, ఆధునిక టెక్నాలజీ డ్రోన్స్ తో నియంత్రణ

### ఆయుధ భాండాగారన్ని ప్రారంభించిన డిజిపి ద్వారక తిరుమలరావు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, జనవరి 20(ప్రభాతవార్త):** వార్షిక తనిఖీల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు సోమవారం కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో క్రైమ్ రేటు తగ్గిందని, నేరాలు అదుపులో ఉన్నాయని అన్నారు. ఆధునిక టెక్నాలజీ డోన్స్ కెమెరాలతో నేరాలను నియంత్రించగలుగుతున్నామని చెప్పారు. అనంతరం జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆయుధ భాండాగారము ను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తో కలిసి ప్రారంభించారు. అనంతరం కాకినాడ ఆర్టీసీ డిపో ను సందర్శించారు. గ్యారేజ్ లో ఏర్పాటుచేసిన సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కండక్టర్స్ ఎన్ జే రావు, విఎన్ మూర్తి లకు ప్రశంస పత్రాలు అందజేశారు.

# అక్టోబర్ 2 నాటికి డంపింగ్ యార్డుల్లో 85 లక్షల టన్నుల వ్యర్థాల తొలగింపు: కొమ్మారెడ్డి పట్టాభిరామ్

**విజయవాడ జనవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి:** గత ప్రభుత్వం డంపింగ్ యార్డుల్లో వదిలేసిన 85 లక్షల టన్నుల వ్యర్థాలను శుభ్రం చేయించి స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని సాకారం చేస్తామని రాష్ట్ర స్వచ్ఛాంధ్ర సంస్థ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. చెత్తపై పన్ను వేసిన గత వైకాపా ప్రభుత్వం డంపింగ్ యార్డులను గాలికి వదిలేసిందని ఆరోపించారు. ఆ మేరకు ఆయన సమాచార పత్రికను విడుదల చేసారు. సీఎం చంద్రబాబు మైదుకూరులో ప్రారంభించిన స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఒకేరోజున 9557 మెట్రిక్ టన్నుల చెత్త తొలగించాం. నెలలో మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొంటామని 474427 మంది ప్రతిజ్ఞ చేశారు అని వివరించారు. గత ఆరు నెలల్లో డంపింగ్ యార్డుల్లో 54% వ్యర్థాలను శుభ్రం చేయించాం. మిగిలిన 46.59 లక్షల టన్నులను అక్టోబరు 2 నాటికి పూర్తి చేయిస్తాం. ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నెలకో అంశం ఎంపిక చేసి 12 నెలల్లో 12 కార్యక్రమాలు అమలు చేయనున్నాం. అన్ని పట్టణాల్లోనూ 1406 మిలియన్ లీటర్ల మురుగునీటిని శుద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించాం. ఘన వ్యర్థాల సమస్య పరిష్కారానికి రాజమహేంద్రవరం నెల్లూరు రాయలసీమలో మూడు విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటు కానున్నాయి. అని పట్టాభిరామ్ వివరించారు. నేను నివాసం ఉంటున్న కాలనీ నుంచే జీరో వేస్ట్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తా. ఎక్కడికక్కడే తడి, పొడిగా విభజించి యాజమాన్య కార్యక్రమాలు చేపడతాం. ఆ తరువాత ఇదే విధానాన్ని మిగిలిన కాలనీల్లోనూ అమలు చేయిస్తాం. పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణపై పర్యవేక్షణ కోసం త్వరలో కమాండ్ కంట్రోల్ కేంద్రం ప్రారంభిస్తాం. సమస్యలపై ప్రజల నుంచి సమాచారం తెలుసుకోడానికి యాప్ కూడా సిద్ధం చేస్తున్నాం. డ్రోన్లను వినియోగిస్తాం. ఇళ్ల నుంచి చెత్త సేకరణకు ఎలక్ట్రికల్ ఆటోలు ప్రవేశపెడుతున్నాం. ప్రజారోగ్యం , పారిశుద్ధ్య సమస్యపై పిల్లలకు విద్యార్థి దశలోనే అవగాహన కల్పించేందుకు మంత్రి లోకేశ్ సహకారంతో విద్యా సంస్థల్లో ప్రతి వారం బోధించేలా ఏర్పాట్లు చేస్తున్నాం అని పట్టాభిరామ్ తెలిపారు.

# అనంతపురంలో పర్యటించిన ఏకసభ్య కమిషన్ రాజీవ్‌రంజన్‌మిశ్రా


రాజీవ్‌రంజన్‌మిశ్రాకు పూలమొక్క అందచేస్తున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కమార్

**అనంతపురం కలెక్టరేట్, జనవరి 20 ప్రభాతవార్త** సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ఎస్‌సిల ఉప వర్గీకరణ ఏకసభ్య కమీషన్ రాజీవ్‌రంజన్‌మిశ్రా (రిటైర్డ్ ఐఏఎస్) అనంతపురం జిల్లా పర్యటనకు విచ్చేశారు. సోమవారం అనంతపురం నగరంలోని ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఎస్‌సిల ఉపవర్గీకరణ ఏకసభ్య కమీషన్ రాజీవ్‌రంజన్‌మిశ్రాను అనంతపురం కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్, జిల్లా ఎస్‌పి జగదీష్, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కలు, పుష్పగుచ్చాలు అందచేసి ఘనస్వాగతం పలికారు. అనంతరం నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని రెవెన్యూ భవనంలో సాంఘిక సంక్షేమశాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎస్‌సి ఉప కులాల వర్గీకరణకు సంబంధించి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్, ఉమ్మడి అనంతపురం జిల్లా అధికారులతో ఎస్‌సిల ఉప వర్గీకరణ ఏకసభ్య కమీషన్ రాజీవ్‌రంజన్‌మిశ్రా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకసభ్య కమీషన్ రాజీవ్‌రంజన్‌మిశ్రా మాట్లాడుతూ షెడ్యూల్ కులాల ఉపవర్గీకరణకు సంబంధించి ఆయా శాఖల వారిగా పూర్తి సమాచారాన్ని త్వరితగతిన కమీషన్‌కు సమర్పించాలన్నారు. ఈ విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని పూర్తి సమాచారాన్ని సకాలంలో సమర్పించాలన్నారు.

# కుటుంబం గౌరవంగా బతకాలంటే ఆర్థిక సమస్యలు ఉండకూడదు: సిఎం చంద్రబాబు



**విజయవాడ,జనవరి20ప్రభాతవార్తప్రతినిధి:**కుటుంబం గౌరవంగా బతకాలంటే ఆర్థిక సమస్యలు ఉండకూడదని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఇక్కడ కుటుంబమంటే తెలుగువారమంతా అనే అంశాన్ని నొక్కి చెబుతున్నానన్నారు. యువత ఎప్పుడూ భవిష్యత్ దిశగా ఆలోచించాలని చెప్పారు. సంపద సృష్టించడం కష్టం కాదన్నారు. దావోస్ పర్యటనలో భాగంగా తెలుగు పారిశ్రామికవేత్తలు, ప్రవాసాంధ్రులతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2047 నాటికి తెలుగువాళ్లు గొప్పగా ఉండాలనేదే తన లక్ష్యమని అదేవిధంగా ప్రత్యేక గుర్తింపు రావాలని తెలిపారు. తెలుగువాళ్లు అనేక కష్టాలుపడి ఈ స్థాయికి వచ్చారని ఉక్రెయిన్‌లో సమస్య వచ్చినప్పుడు ప్రవాసాంధ్రులు బాగా పని చేశారని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ఎక్కడికి వెళ్లినా మీరు మూలాలు మరిచిపోకూడదు. ఆరోజు ఇంజినీరింగ్ కాలేజీలు తేవడం వల్లే మీరంతా చదువుకున్నారు. ఎంతో పోరాడి మైక్రోసాఫ్ట్ సెంటర్‌ను హైదరాబాద్‌లో పెట్టించా. మనరాష్ట్ర యువతలో నైపుణ్యాలు పెంచేందుకు కృషి చేస్తున్నాం. ప్రవాసాంధ్రులను ఎలా ప్రోత్సహించాలో అనే దిశగా ఆలోచన. నిరంతర శ్రమ వల్లే తెలుగువాళ్లు అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నారు. 2004లో కొత్త ప్రభుత్వం వచ్చినా ఐటీ భవనాలు కూల్చలేదు. గత ఐదేళ్లలో మాత్రం అన్ని రంగాలనూ ధ్వంసం చేశారు. వర్క్ ఫ్రం హోమ్ కల్చర్ వేగంగా పెరుగుతోందిఖి అని చంద్రబాబు వెల్లడించారు.

# తొలిరోజే పెట్టుబడిదారులతో వరుస సమావేశాలు

## - స్విస్ కంపెనీలతో భేటీ - పెట్టుబడులకు ఆహ్వానం

**విజయవాడ, జనవరి 20,ప్రభాతవార్తప్రతినిధి:** వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సుకు దావోస్ వెళ్లిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం తొలిరోజు పర్యటనలో వరుసగా వివిధ దేశాల. స్విస్ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులతో సమావేశాలు నిర్వహించారు. జ్యూరిచ్‌లోని హిల్టన్ హోటల్‌లో స్విట్జర్లాండ్‌లోని భారత అంబాసిడర్ మృధుల్ కుమార్‌తో సమావేశంలో చర్చించిన అంశాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్రానికి స్విట్జర్లాండ్ నుంచి పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై వారు నిశితంగా యోచన చేసారు. ఈ క్రమంలో నెస్లే, ఏబీబీ, నోవార్టీస్ వంటి దిగ్గజ కంపెనీలతో సహా ఇప్పటివరకు 350కు పైగా స్విట్జర్లాండ్ కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెట్టాయని, మరిన్ని కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాయని మృధుల్ కుమార్ సీఎం చంద్రబాబుకు వివరించారు. , ఆంధ్రప్రదేశ్‌లో ఫార్మాస్యుటికల్స్, మెడికల్ డివైజ్‌లు, టెక్నికల్ టెక్స్‌టైల్స్, రైల్ కాంపోనెంట్ వంటి తయారీ రంగంలో విస్తృతంగా అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. ఏపీ, స్విట్జర్లాండ్ యూనివర్సిటీలు.. ఏపీలో ఏర్పాటు చేస్తున్న స్కిల్లింగ్, ఏఐ యూనివర్సిటీకి కలిసి పనిచేసేలా చూడాలని మృధుల్ కుమార్‌కు ముఖ్యమంత్రి చెప్పారు. వర్క్ ఫ్రం హోం విధానంలో స్విట్జర్లాండ్‌కు కావాల్సిన సేవలను అందించేందుకు అన్నిరంగాలకు చెందిన నైపుణ్య యువత ఏపీలో ఉన్నారని తెలిపారు. స్విట్జర్లాండ్ కంపెనీల సీఈవోలతో భేటీ తమ భేటీ అనంతరం మృధుల్ కుమార్ స్విట్జర్లాండ్‌కు చెందిన నాలుగు ప్రముఖ సంస్థల సీఈవోలు, ఇతర ముఖ్యులను సీఎం చంద్రబాబుతో సమావేశపరిచారు. మెకానికల్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సంస్థ అయిన స్విస్‌మెన్స్ సెక్రటరీ జనరల్ రౌల్ కెల్లర్, పాలిమర్ ప్రాసెసింగ్ రంగానికి చెందిన ఓర్లికాన్స్ సీఈవో మార్కస్ టకే, హై క్వాలిటీ ఇండస్ట్రియల్ కాంపోనెంట్స్ అండ్ కస్టమ్ ఇంజినీర్డ్ సొల్యూషన్స్ సంస్థ అయిన ఆంగ్స్ట్ ఫిస్టర్స్ సీఈవో ఎరిచ్ స్మిడ్, టెక్స్‌టైల్స్ రంగానికి చెందిన స్విస్ టెక్స్‌టైల్స్ హెడ్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ ఎక్స్‌టెర్నల్ ఎఫైర్స్ జార్న్ వాన్ డెర్ క్రోన్‌కు రాష్ట్రంలో పెట్టుబడులకు గల విస్తృత అవకాశాలను ముఖ్యమంత్రి వివరించారు. నైపుణ్యం కలిగిన మానవ వనరుల లభ్యతతో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రోత్సాహకాలను వినియోగించుకునేందుకు ఏపీకి రావాలని ఆహ్వానించారు.

# రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తున్న టిడిపి

### వైఎస్సార్సీ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

**నెల్లూరు, జనవరి 20, ప్రభాతవార్త-వైద్యం** టీడీపీ కూటమి ప్రభుత్వం మంత్రి లోకేష్ రచించిన రెడ్ బుక్ పేరుతో రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగిస్తుందని వైసీపీ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం నెల్లూరు జిల్లా కేంద్రంలోని సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో తెలుగుదేశం వాళ్ల దాడిలో గాయాలపాలై చికిత్స పొందుతున్న ముత్తుకూరు మండల బీట్-2 ఎంపీటీసీ సభ్యులు వెంకటేశ్వర్లును పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని గోవర్ధన్‌రెడ్డి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కాకాణి గోవర్ధన్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి నిత్యం దాడులు, విధ్వంసాలు ప్రజలని అన్ని రకాల ఇబ్బందులకు గురి చేస్తూ, విధ్వంస పాలనకి శ్రీకారం చుట్టడం జరిగిందని మండిపడ్డారు. రాష్ట్ర, జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల మీద దాడులు చేయడం, వాళ్ల ఆస్తులు ధ్వంసం చేయడం, వాళ్ల భూములను ఆక్రమించడం ప్రశించిన వారి మీద గౌర్జన్యం చేయడం అరాచకాలను అడ్డుకున్న వ్యక్తులపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. దాడిలో వెంకటేశ్వర్లుకు తల మీద నాలుగు కుట్లు పడ్డాయి. తీవ్రమైనటువంటి రక్తస్రావం జరిగిందని, తొంటె విరిగిపోయిందని, రోజు డాక్టర్లు దానికి సర్జరీ చేయాలని చెప్పడం బాధాకరంగా ఉందన్నారు. ఆదివారం సాయంకాలం దాడి జరిగితే ఉదయం వచ్చి పోలీసులు విచారించారు తప్ప, ఇంత వరకు నిందితుడ్ని అదుపులోకి తీసుకోలేదని విమర్శించారు. పోలీసులు తెలుగుదేశం పార్టీ నాయకులు ఎం చెప్తే అది చేస్తున్నారు తప్ప చట్టబద్ధంగా వ్యవహారించడం లేదని ఆరోపించారు.

# ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికే ప్రజా దర్బార్

## - రోడ్లు భవనాల మంత్రి జనార్ధన్‌రెడ్డి

**సచివాలయం,జనవరి 20,ప్రభాతవార్త :** ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి ప్రజా దర్బార్ కార్యక్రమం తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తుందని మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి తెలిపారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో ప్రజాదర్బార్‌లోపాల్గొన్న మంత్రి పై విధంగా తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిశీలించి, ఆయా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కరూ ్నలు జిల్లా ఓర్వకల్లుకు చెందిన మహిళలు, బాలమ్మ, లక్ష్మీదేవీలకు చెందిన వ్యవసాయ భూ ములను ఆన్‌లైన్‌లో రెవెన్యూరికార్డుల నుంచి తొలగించడంపై మంత్రి దృష్టికి తీసుకురాగా కరూ ్నల్ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కరించాలి ్సందిగా ఆదేశించిన మంత్రి తిరుపతి అర్బన్ రెవెన్యూ మండలం మంగళం రెవెన్యూగ్రామంలో ఎస్ శ్యామలాదేవి కి చెందిన స్థలంలో ప్రహరీ గోడను వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అనుచరులు దౌర్జన్యంగా ధ్వంసం చేయగా బాధితుడు కోర్టుకెళ్ళి ఇంజక్షన్ ఆర ్డర్ తెచ్చుకున్న తర్వాత కూడా వారి ఆగడాలు ఆపకపోవడంతో బాదితులు మంత్రి దృష్టికి తీసుకురాగా...తిరుపతి జిల్లా పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడి..దౌర్జన్యానికి పాల్పడిన వారిపై కేసు నమోద చేయాల్సిందిగా ఆదేశించిన మంత్రి... అనంతపురం అర్బన్ లో ఎం సునీత కు చెందిన స ్థలంలో కొంతమంది అక్రమంగా గుడిసెలు నిర్మించుకోగా వాటిని తొలగించాలి ్సందిగా సదరు మహిళ మంత్రి దృష్టికి సమస్యను తీసుకువచ్చారన్నారు.

# తిరుపతిలో టిటిడి హృదయాలయం ఏర్పాటుచేయాలి

## - కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్




**తిరుపతి,జనవరి 20ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ టిటిడి ఆధ్వర్యంలో తిరుపతిలో గుండెజబ్బుల (హృదయాలయం)ఆస్పత్రి ఏర్పాటు చేయాలని మాజీకేంద్రమంత్రి, సీనియర్ కాంగ్రెస్ నేత డాక్టర్ చింతామోహన్ డిమాండ్ చేశారు. వయసుతో సంబంధం లేకుండా పలురకాలుగా గుండెజబ్బులతో ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య అధికంగా ఉందన్నారు. అంతేగాక క్యాన్సర్ ఆస్పత్రిని ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేయాలన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లో ఉన్న క్యాన్సర్ ఆస్పత్రి తెలంగాణకు పోయిందని, తమిళనాడు అడయార్‌లో ఉందని, ఆంధ్రప్రదేశ్‌లో తిరుపతిలో ఎందుకు ఏర్పాటుచేయరని ఆయన ప్రశ్నించారు. స్విమ్స్ ఆస్పత్రిని టిటిడి ధార్మికసంస్థ నిర్వహిస్తోందని, అక్కడ పేదరోడుల నుండి ఓపిలకు, వైద్యానికి డబ్బులు వసూలుచేయడం మంచిదికాదన్నారు. ధార్మికసంస్థలో డబ్బుకు ప్రాధాన్యత ఇవ్వకూడదని, ధర్మానికి ప్రాధాన్యతనివ్వాలని ఆయన సూచించారు. సోమవారం టిటిడి పరిపాలన భవనం వద్ద టిటిడి ఉద్యోగుల ఇళ్ళస్థలాలు, వారి సమస్యలు, స్విమ్స్ ఆస్పత్రి నిర్వహణ తదితరచ వాటిపై కాంగ్రెస్ శ్రేణులతోకలసి నిరసన తెలిపారు.

21-1P-g7exHMNWJQE.qxd:21-1P-g7exHMNWJQE.qxd 01/01/01 9:22 AM Page 1






నాచారం డిపిఎస్‌లో ట్రాఫిక్ చిల్డ్రన్ పార్కు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపి ఈటల, ఎమ్మెల్యే బిఎల్ఆర్ తదితరులు

## రహదారి భద్రతే కాదు.. బాధ్యత కూడా అందరిదీ

### నాచారం డిపిఎస్‌లో చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్కును ప్రారంభించిన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**హైదరాబాద్ (నాచారం), జనవరి 20, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు రోడ్డు మీద బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పేర్కొన్నారు. నాచారం ఢిల్లి పబ్లిక్ స్కూల్ ఆవరణలో నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్, తెలంగాణ ప్రభుత్వంతో కలిసి చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్నెస్ పార్కు ప్రారంభోత్సవానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, రవాణామంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, డిపిఎస్ సంస్థ నిర్వాహకులు, చైర్మన్ మల్కా కొమ రయ్య, డైరెక్టర్ పల్లవి, సీఈవో, డైరెక్టర్ యశస్వి మల్కా, డైరెక్టర్ త్రిభువన, సీనియర్ ప్రిన్సిపల్, డైరెక్టర్ సునీతా రావు తదితరులు కలిసి సోమవారం ప్రారం భించారు. గవర్నర్ మాట్లాడుతూ ఇది కేవలం భద్రత కాదు, 'రోడ్ బాధ్యత' అని చెప్పారు. ప్రతి ఒక్కరూ రోడ్డు మీద బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు స్కూళ్లలో చేపట్టడం చాలా ముఖ్యమని, ఒక జీవితాన్ని కూడా రక్షించగలిగితే అది స్ఫూర్తిదాయకమని చెప్పారు. డిపిఎస్ నాచారం పాఠశాల ఈ కార్యక్రమం ద్వారా ఎంతో మంచి పని చేస్తున్నదని ఆయన ప్రశంసించారు. జై జవాన్, జై కిసాన్ నినాదాలతో పాటుగా జై విజ్ఞాన్, జై కిసాన్ డిపిఎస్ విద్యార్థులు ట్రాఫిక్ పార్క్ కార్యకలాపాలను ప్రత్యక్షంగా ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు.

**ట్రాఫిక్ పార్కు ప్రతి పాఠశాలలో అవసరం: మంత్రి పొన్నం**

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ప్రతి స్కూల్లో నిర్వహించాలన్నారు. విద్యార్థులు తమ కుటుంబాలల్లో ఈ అవగాహన కార్యక్రమాన్ని విస్తరించడానికి ప్రయత్నించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపి ఇటల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు సురభి వాణిదేవి, పట్నం మహేందర్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, స్కూల్ చెర్మన్ మల్కా కొమురయ్య, జిల్లా కలెక్టర్ గౌతమ్, స్థానిక కార్పోరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి రవాణా శాఖ ఉన్నతాధికారులు ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు బివి రాఘవులు

## ఒకే ఓటు, ఒకే ఎన్నిక విధానంతో ప్రాంతీయ పార్టీలకు ముప్పు

### రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి చట్టం తేవాలి

### సిపిఎం కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర. రాష్ట్ర విధానాలతో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ప్రజాస్వామ్య పరిరక్షణకై పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో సోమవారం సిపిఎం కార్మిక, కర్షక నూతన భవానిన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎన్నో ఉద్యమాలు, త్యాగాల ద్వారా లేబర్ చట్టాలను సాధించుకుంటే వాటిని కుదించి నాలుగు చట్టాలు తీసుకరావడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. కేంద్రం తీసుకవచ్చే చట్టాలను తిప్పికొట్టడానికి కార్మికులు కలిసికట్టుగా ఉద్యమాలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒకే ఓటు ఒకే ఎన్నిక విధానాన్ని తీసుకరావడానికి ప్రయత్నిస్తుందని దీంతో ప్రాంతీయ పార్టీలకు ముప్పు వాటిల్లుతుందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి చట్టం తేవాలన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి అవసరమైతే కోర్టు వెళ్తాం లేదంటే నిరంతరం పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం పూర్తిగా రైతు వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. రాష్ట్రంలో పాలన గాడి తప్పివదన్నారు. దేశంలో, రాష్ట్రంలో అత్యాచారాలు, అక్రమాలు పెరిగిపోతున్నాయన్నారు.



తిరుపతి తొక్కిసలాట ఘటనలో గాయపడిన జిల్లెలగూడ పోరెడ్డి బుచ్చమ్మకు రూ.2 లక్షల చెక్కును అందజేస్తున్న టిటిడి ధర్మకర్తలు పనబాక లక్ష్మి, నన్నూరి నర్సి రెడ్డి

## తిరుపతి తొక్కిసలాట బాధితురాలికి నష్టపరిహారం రూ. 2 లక్షలు అందజేత

**హైదరాబాద్ (సరూర్‌నగర్), జనవరి 20, ప్రభాతవార్త:** తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం కోసం టిటిడి వారు తిరుపతిలో ఏర్పాటు చేసిన టోకెన్ల జారీ కేంద్రం వద్ద ఈ నెల 8వ తేదీన రాత్రి జరిగిన తొక్కిసలాటలో గాయపడిన హైదరాబాద్ నగర శివార్లలోని జిల్లెలగూడకు చెందిన బాధితురాలు పోరెడ్డి బుచ్చమ్మకు రూ.2 లక్షల నష్టపరిహారం చెక్కును టిటిడి అందజేసింది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుపతిలో టోకెన్ల జారీ కేంద్రం వద్ద జరిగిన తొక్కిస లాటలో 6 మంది దుర్మరణం చెంది 51 మంది గాయపడిన సంగతి అందరికీ తెలిసిందే. అయితే గాయపడిన బాధితుల్లో మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడకు చెందిన పోరెడ్డి బుచ్చమ్మ ఉన్నారు. ఆనాడు జరిగిన తొక్కిసలాటలో ఆమె గాయపడి అక్కడ చికిత్స కూడా తీసుకున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తలైన కేంద్ర మాజీమంత్రి పనబాక లక్ష్మి, నన్నూరి నర్సిరెడ్డి సోమవారం జిల్లెలగూడలోని ఓల్డ్ వెంకటేశ్వర కాలనీలో ఉంటున్న బుచ్చమ్మ నివాసానికి వచ్చి టిటిడి తరపున రూ.2 లక్షల చెక్కును అందజేశారు.

# అన్నప్రసాదంలో అదనంగా మసాల వడ - ప్రయోగాత్మకంగా వడ్డింపు!

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** "అన్నం పరబ్రహ్మస్వరూపం"గా భావిస్తూ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం విచ్చేస్తున్న లక్షలాదిమంది భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా, శుచిగా అన్నప్రసాదాలు అందిస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానం చాలాకాలం తరువాత అదనపు మెనూగా మసాల వడ వడ్డించాలని నిర్ణయించింది. ఈ మెనూను ఫిబ్రవరి 4వతేదీ రథసప్తమి పర్వదినం నుండి భక్తులకు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో చేర్చాలని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు గత పాలకమండలి సమావేశంలోనే నిర్ణయించారు. ప్రస్తుతం రెండురోజులుగా 5వేల వరకు మసాలవడలు తయారుచేసి భక్తులకు మెనూలో అందిస్తున్నారు. ఇప్పటికే తిరుమలలో నిరంతరాయంగా ఉదయం 9గంటల నుండి రాత్రి 11గంటల వరకు వెంగమాంబ అన్నప్రసాద భవనంలో నాణ్యమైన అన్నంతోబాటు సాంబారు, రసం, మజ్జిగ, చక్కెరపొంగలి, తాళింపు(కర్రీ)ని రుచికరంగా వడ్డిస్తున్న విషయం తెలిసిందే. రోజువారీగా తిరుమలకు లక్షమందివరకు భక్తులు చేరుకుంటున్నా 80వేలమంది భక్తులు ఇష్టదైవం వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్నారు. అయితే ఒకలక్షనుండి 1.20లక్షలమంది వరకు భక్తులు ప్రతిరోజూఅన్నప్రసాదాలు స్వీకరిస్తున్నట్లు టిటిడి అధికారుల గణాంకాలు. ఈ నేపథ్యంలో దాతలు కూడా అన్నప్రసాదం ట్రస్ట్‌కు విరివిగా విరాళాలందిస్తున్నారు. ప్రస్తుతం 2వేలకోట్లరూపాయలపైగానే ఎస్వీ అన్నప్రసాదంట్రస్టుకు నిధులు డిపాజిట్లురూపంలో ఉన్నాయి. దీనిద్వారా వచ్చే వడ్డీతోనే ప్రతిరోజూ తిరుమలలో భక్తులకు నాణ్యమైన రుచికరంగా, శుచిగా అన్నప్రసాదాలు అందిస్తుండటం విదితమే. గత ఆరునెలల్లో వెంగమాంబ అన్నప్రసాదం భవనంలో కూడా వంటసామాగ్రి, పాత్రలు, యంత్రాలను పాతవాటిని తొలగించి కొత్తవి ఏర్పాటుచేయించారు. అంతేగాక టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ప్రముఖ చెఫ్‌ల సూచనలు తీసుకుని అన్నప్రసాదాలను ఎంతో నాణ్యతగా తయారుచేయించి భక్తులకు అందిస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తరువాత ఏర్పాటైన టిటిడి ధర్మకర్తలమండలి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, సభ్యులు, టిటిడి అధికారులు భక్తుల నుండి అభిప్రాయ సేకరణ చేపట్టి అన్నప్రసాదం మెనూలో మార్పులు చేస్తున్నారు. తాజాగా ఉల్లిపాయలు, వెల్లుల్లిలేకుండా మసాలవడలు ఐదవరకంగా భక్తులకు మెనూలో చేర్చాలని నిర్ణయించారు. ఆ దిశగా కార్యాచరణ సిద్దం చేశారు. సోమవారం సాయంత్రం ప్రయోగాత్మకంగా



అన్నప్రసాదం భవనంలో భోజనంతోబాటు మసాలవడలు క్యాటరింగ్ సిబ్బంది తయారుచేసి భక్తులకు వడ్డించారు. ఇవీ రుచికరంగా ఉన్నట్లు భక్తుల నుండి సంతృప్తికర అభిప్రాయం వ్యక్తమైంది. ఈ నూతన మెనూను ఫిబ్రవరి 4వతేదీ రథసప్తమిన టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు చేతులమీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే తిరుమలకు వచ్చిన ప్రతి భక్తుడు అన్నప్రసాదాలను భక్తివిశ్వాసంతో స్వీకరిస్తున్నారు.

# బియ్యంతోపాటు నిత్యావసరాల సరఫరాకు కసరత్తు

### ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్

**హైదరాబాద్, జనవరి 20,ప్రభాతవార్త:** చౌకధరల దుకాణంలో రేషన్ బియ్యం తో పాటు నిత్యావసర సరుకులు కూడా పేదలకు సరఫరా చేసేందుకు పౌరసరఫరాల శాఖ కసరత్తు చేస్తున్నదని బిఆర్ఎస్ సన్నాసులు అభివృద్ధి, సంక్షేమం అంటే ఏంటో చూడండని విప్ రామచంద్ర నాయక్‌అన్నారు. సోమవారం సిఎల్పీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం, హామీలు సమపాళ్లలో అమలు చేస్తూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందుకు తీసుకుపోతుందని ఆయన చెప్పారు. బిఆర్ఎస్ నేతలు ప్రజలను పక్కదారి పట్టించేందుకు తోక తెగిన నక్కల్ల గాయి చేస్తున్నారని దుయ్యబట్టారు. పదేళ్లలో ఏ ఒక్క కుటుంబానికి రేషన్ కార్డులు, పెన్షన్ ఇచ్చారా..? అని ఆయన నిలదీశారు.

బిఆర్ఎస్ పాలనలో దేశంలో నే ఆత్మహత్యల్లో తెలంగాణ అగ్రభాగాన ఉన్నప్పుడు హరీష్ రావు, కేటీఆర్ నోరు మెదపలేదని విమర్శించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేశారని దుయ్యబట్టారు. మిమ్మల్ని ప్రజలు నమ్మబోరు అని జోస్యం చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ నేతలను గ్రామాల నుంచి ప్రజలు తరిమి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వం తీసుకున్న ప్రతి కార్యాచరణకు అడ్డంకులు సృష్టించి రాద్ధాంతం చేస్తున్నారని ఆవేదన చెందారు.

# కృష్ణా జలాల వాటాల్లో తెలంగాణకు కెసిఆర్, హరీశ్‌రావు వల్లే అన్యాయం

### కెఆర్‌డబ్ల్యుటి-2 అంశంపై హరీశ్‌రావు చిల్లర రాజకీయాలు

### నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 20, ప్రభాతవార్త:** కెసిఆర్ పాలనలో కృష్ణా జలాల నీటి వాటాల్లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగిందని నీటిపారుదల శాఖ, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ పోతిరెడ్డి పాడు, రాయసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు విషయంలో కేసీఆర్ కళ్లు మూసుకుని ఉన్నారని దుయ్యబట్టారు..కృష్ణ ట్రిబ్యునల్ లో అంశపై హరీష్ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. హరీష్ రావు దుర్మార్గపు మాటలు మాట్లాడుతున్నారని ఆవేదనచెందారు. అధికారంలో ఉండి బిఆర్ఎస్ మోసం చేసింది ఇప్పుడు మేము మన ప్రాంతానికి దక్కాల్సిన నదిజలాల వాట సాధించడానికి ప్రయత్నం చేస్తుంటే అడ్డుకుంటున్నారని అయనఅన్నారు. ఆంధ్రప్రదేశ్ కృష్ణాబెసిన్ ఆవలకు పంపే నీటికి ఆమోదం తెలపుతూ మన గొంతును కోస్తూ ఇక్కడి అవసరాలను కాలరాజేసి ఆంధ్రావారి మెప్పుకోసం వారికి 515టిఎంసిల నీటిని దారాదత్తం చేస్తూ కేసీఆర్ హరీష్ రావు లిఖిత పూర్వకంగా సంతకాలు పెట్టారని ఆయన విమర్శించారు.

మన తెలంగాణకు సహజ న్యాయసూత్రాల ప్రకారం 70శాతం నీటివాటా రావాల్సి ఉండగా కేవలం 298 టిఎంసి కి సంతకాలు చేసిన డాక్యుమెంట్స్ ఉన్నాయి ఆయన తెలిపారు. కృష్ణాజలాలలో ఇంత తక్కువ వాటా పొందడానికి ఆమోదం తెలపడం వల్ల వారికి కలిగిన ఆర్థిక ప్రయోజనం ఏమిటోకానీ తెలంగాణ గడ్డకు నీరు దక్కకుండా పోయిందని ఆవేదన చెందారు. కొత్త రేషన్ విషయంలో ప్రతిపక్షాల దుష్ప్రచారం చేస్తున్నారు పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ అన్నారు .అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ రేషన్ కార్డులు ఇస్తామని ఆయన తెలిపారు. రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ నిరంతరం జరుగుతుంది. ఆహార భద్రత చట్టం తెచ్చింది కాంగ్రెస్ పార్టీనే మంత్రిప్రస్తుతం 90లక్షల కార్డులు 2 కోట్ల 80 వేల మంది ఉన్నారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో 60వేలు మాత్రమే రేషన్ కార్డులు ఇచ్చారు. ప్రజా పాలన, ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు పరిశీలన చేస్తున్నాం. లిస్ట్ లో పేర్లు రాని వాళ్లు ప్రజావాణి, గ్రామ సభల్లో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు.

# బిసిలకు పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

### ఫిబ్రవరి 6, 7వ తేదీల్లో ఢిల్లీలో ఒబిసి జాతీయ సదస్సు: ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, జనవరి 20, ప్రభాతవార్త:** బి.సిలకు పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ బిసి వర్గాల డిమాండ్‌పై ఫిబ్రవరి 6,7వ తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమం ఏర్పాటు చేసి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, ఒరిస్సా తదితర రాష్ట్రాల నుండి వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, బిసి అగ్రనేతలు పెద్ద ఎత్తున పోల్గొంటారని తెలిపారు. ఈ ఛలో ఢిల్లీ కార్యక్రమానికి సంబం ధించిన వాల్ పోస్టర్‌ను సోమవారం నగరంలో ఆర్. కృష్ణయ్య విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి బోను దుర్గా నరేశ్, గుజ్జ కృష్ణ అధ్యక్షత వహించారు. ఆ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లా డుతూ అన్ని రాజకీయ పార్టీలు బి సి లను ఓటు బ్యాంకుగా వాడు కుం టున్నారు. 75 సంవ త్సరాల కాలంలో 121 సార్లు రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో పెట్టారు కానీ బీసీలకు రాజ్యాధికారం లో వాటా కల్పించడానికి పార్లమెం టులో బీసీ బిల్లు పెట్టలేదు' అని అన్నారు. బిసిల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను 25 శాతం నుంచి 50 శాతం పెంచాలని, త్వరలో జరుపబోయే జనాభా గణనలో కులాల వారి లెక్కలు తీయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న ఎంపి ఆర్.కృష్ణయ్య, చిత్రంలో జాతీయ నాయకుడు గుజ్జ కృష్ణ, ఎపి సంఘం అధ్యక్షుడు బోను దుర్గానరేశ్‌యాదవ్ తదితరులు

# మైనింగ్ అనుమతులు రద్దు చేయాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

### మైలారం గ్రామస్తుల ఆందోళన

### పోలీసులతో వాగ్వాదం.. పురుగుమందు డబ్బాలతో హెచ్చరిక

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 20, ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా బాల్మూర్ మండలం మైలారం గ్రామంలోని సర్వే 121 లోని భూమిలో క్వర్జ్ తవ్వకాలకు కేటాయించిన మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. గ్రామంలోని సర్వే నంబర్ 121 లో 120 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో గుట్టగా ఉన్న 35 ఎకరాలను క్వార్జ్ తవ్వకాల కోసం మైనింగ్ శాఖ కొందరికి అనుమతులు ఇచ్చింది. కొద్ది రోజుల నుంచి అక్కడ తవ్వకాల ప్రక్రియ మొదలైంది. కాగా మైనింగ్ వలన ప్రకృతి సహజ సంపదతో పాటు.. తమ భూములు, ఇల్లు దెబ్బతినే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం నుంచి రిలే నిరాహారదీక్షలు చేపట్టాలని పిలుపునిచ్చారు. తమ నిరసనను పౌర హక్కుల నేతలు హరగోపాల్, గడ్డం లక్ష్మణ్‌ను ఆహ్వానించారు. అలాగే గ్రామంలోకి అధికారులు, మైనింగ్ నిర్వాహకులు రాకుండా గ్రామంలోని రోడ్డుపై ముళ్ల కంచె, రాళ్లు అడ్డుగాపెట్టి నిరసన వ్యక్తం చేశారు. సిఐ రవీందర్, ఎస్ఐ రమాదేవి గ్రామానికి వెళ్లి ప్రజలకు నచ్చ జెప్పే ప్రయత్నం చేసినా వినకపోవడంతో కొందరిని అక్కడి నుంచి తరలించారు. దీంతో కొంతమంది మహిళలు పురుగుమందు డబ్బాలు తీసుకొని ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పౌర హక్కుల సంఘం నేతలను వెల్దండ వద్ద పోలీసులు అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు.



షాద్‌నగర్ గ్రంథాలయ సభలో ప్రసంగిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

## ప్రతి ఇంట్లో గ్రంథాలయం ఉండాలి

### మంత్రి జూపల్లి కృష్ణారావు

### షాద్‌నగర్ గ్రంథాలయానికి రూ.5 లక్షలు కేటాయింపు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, జనవరి 20 :** సామాజిక మాధ్యమాలతో మంచి కన్నా చెడే ఎక్కువ జరుగుతున్నదని, సంస్కారంలేని విధానాలతో అనర్థాలు ఏర్పడుతు న్నాయని, వీటిని పారదోలాలంటే విద్యతోపాటు సంస్కారం నేర్పాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ గ్రేడ్-1 శాఖ గ్రంథాలయ నూతన అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ సభకు మంత్రి జూపల్లి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవ సభకు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, జిల్లా గ్రంథాలయాల చైర్మన్ మధు సూదన్‌రెడ్డి, స్థానిక మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, తదితరులు హాజరయ్యారు. అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా కె.మదన్‌మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్‌లుగా నక్క బాల్‌రాజ్, వీరేష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా క్యాసెట్ శ్రీను, తదితర సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. సభను ఉద్దేశించి మంత్రి జూపల్లి ప్రసంగిస్తూ సంస్కారం లేని జీవితం వ్యర్థమని, సమాజంలో చదువుకోకపోతే వినాశనం తప్పదని అన్నారు. ప్రతి గ్రామంలో గ్రంథాలయంతో పాటు ప్రతి ఇంట్లో కూడా ఒక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. షాద్‌నగర్ గ్రంథాలయానికి తన శాఖ ద్వారా రూ.5 లక్షలను కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా డాక్టర్ రామకృష్ణ సైతం ఒక లక్ష రూపాయలను విరాళంగా ప్రకటించారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ చరిత్రను సృష్టించగల సత్తా గ్రంథాలయాలదేనని అన్నారు. తెలంగాణ రాష్ట్ర చరిత్రను మార్చిన ఘనత గ్రంథాలయాలకు కూడా ఉందన్నారు. గ్రంథాలయాల్లో 75 ఏళ్ల పూర్తి చేసుకున్న రాజ్యాంగంపై పౌరులకు బోధించే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ పదవులు ముఖ్యం కాదని, సేవచేసే సత్తా ఉంటేనే పదవులు చేపట్టాలన్నారు.

# జీతాలు చెల్లించండి మహాప్రభో

### ఇఎన్‌సి జనరల్‌ను కలిసి గోడు వెళ్లబోసుకున్న ఎఇఇలు


**హైదరాబాద్, జనవరి 20, ప్రభాతవార్త:** అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా నీటిపారుదల శాఖ నియామకమై నాలుగు నెలలు గడుస్తున్నా మాకు జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థికపరంగా ఇబ్బందులకు గురువుతున్నామని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం జలసౌధలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ ప్రశాంత్‌పాటిల్, సిఎం సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, ఇఎన్‌సి అనిల్‌కుమార్‌ను కలిసి వేతనాలు రాకపోవడంతో పరాయి ఊళ్లలో నివాసం ఉంటూ అనేక బాధలు పడుతున్నాయమని, కనీసం ఇంటి అద్దెలు కూడా చెల్లించుకోలేకపోతున్నామని వివరించారు. ప్రసిడెన్షనల్ ఆర్డర్ ప్రకారం స్థానిక మల్టి జోనల్లలో మాకు పోస్టింగ్ ఇవ్వాలని వారు కోరారు. రాష్ట్రపతి ఉత్తర్వులకు భిన్నంగా ఇతర జోన్‌లో పోస్టింగ్ ఇవ్వడంతో పేఅండ్‌అకౌంట్స్ డిపార్టుమెంట్ అకౌంట్స్ విభాగం సాకుగా చూపుతూ తొలుత జీతాలు నిలిపివేసింది.

రాష్ట్ర ఆర్థిక శాఖ కూడా ఏ నిర్ణయం తెలుపక జిడిఎకు వివరణ కోసం పంపి మా జీతాలపై ఏ నిర్ణయం ప్రకటించకత్రిశంకు స్వర్గంలో నిలిపిందని వారు ఆవేదన చెందారు.. యువ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల నియా మకాలు ఉత్తర్వులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు సమక్షంలో సెప్టెంబర్ మూడో వారంలో జల సౌధలో పెద్ద ఎత్తున కార్యక్రమం చేసి ఇచ్చారు. నాలుగు నెల లకు పైగా గడుస్తున్నా, జీతాలు రాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొత్తగా రిక్రూట్ అయిన ఎఇఇ లను వెంటనే రాష్ట్రపతి ఉత్తర్వులను అనుసరించి వాళ్ళ స్థానిక మల్టి జోన్లలో పోస్టింగ్ లు ఇచ్చి వాళ్ల జీతాలను తొందరగా వాళ్ళకి విడుదల చేయాలని హైదరాబాదు ఇంజనీర్ల సంఘం. అద్యక్షులు రాపోలు రవీందర్, జనరల్ సెక్రటరీ చక్రధర్ డిమాండ్‌చేశారు. ఎఇఇలకు జీతాలు ఇవ్వాలని పలు సార్లు ప్రభుత్వానికి కూడా విన్నపాలు చేసినము, కానీ కొత్త ఎఇఇ లకు మాత్రం ఇబ్బందులు తప్పట్లేదని ఆవేదన చెందారు. ఇకనైనా వాళ్ళ స్థానిక మల్టి జోన్ లకు పంపి భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు కూడా తీసుకోవాలి అని ప్రభుత్వాన్ని కోరుతున్నాం అని వర్కింగ్ ప్రెసిడెంట్ లు కె రాజశేఖర్, వి రామకృష్ణ, ఆర్ సత్య నారాయణ గౌడ్ ఒక ప్రకటనలో సంతకాలుచేస్తూ డిమాండ్‌చేశారు. నిలిచిపోయిన నాలుగు నెలల జీతాలు వెంటనే చెల్లించాలని కోరారు.

# ఎఫ్‌టిఎల్ నిర్ధారణతోనే సమస్యలకు పరిష్కారం

### నాలుగైదు నెలల్లో ఆ ప్రక్రియ పూర్తి చేస్తాం : హైడ్రా కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్, జనవరి 20, ప్రభాతవార్త:** నగరంతోపాటు ఒఆర్ఆర్ పరిధిలోని చెరువుల ఫుల్ ట్యాంక్ లెవెల్ (ఎఫ్‌టిఎల్) నిర్ధారణ పూర్తయితే చాలావరకు సమస్యలు పరిష్కారమోతాయని హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్ తెలిపారు. నాలుగైదు నెలల్లో ఒఆర్ఆర్ పరిధిలోని అన్ని చెరువులకు ఎలాంటి సందేహాలకు ఆస్కారం లేకుండా ఎఫ్‌టీఎల్ నిర్ధారణ పూర్తిచేసి భవిష్యత్తులో చెరువుల కబ్జాకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో కమిషనర్ నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు మొత్తం 89 ఫిర్యాదులను తీసుకున్నారు. చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల కబ్జాపై వచ్చిన ఫిర్యాదులను అక్కడికక్కడే క్షుణ్ణంగా పరిశీలించి.. గూగుల్ మ్యాప్స్‌తో పాటు సర్వే ఆఫ్ ఇండియా, ఎన్ ఆర్ ఎస్ సీ(నేషనల్ రిమోట్ సెన్సింగ్) ఇమేజీలను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఫిర్యాదుదారులకు చూపించి అందులో వాస్తవాలను వాకబు చేశారు. గతంలో ఆయా చెరువులు, ప్రభుత్వ స్థలాలు, పార్కులు ఎలా ఉండేవి.. హైడ్రా వచ్చిన తర్వాత ఎలా ఉన్నాయనేది గూగుల్ మ్యాప్స్, ఎన్ఆర్ఎస్ సీ ఇమేజీలను పరిశీలిస్తామన్నారు. హైడ్రా వచ్చిన తర్వాత వెలసిన నిర్మాణాలను అనుమతులు లేకుంటే కూల్చివేస్తామన్నారు. అమీన్‌పూర్ చుట్టూ అనేక ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలోఆమున్సిపాలిటీ పరిధిలో పూర్తి స్థాయి సర్వే చేయిస్తామని తెలిపారు. అలాగే మేడ్చల్ జిల్లా నిజాంపేట మున్సిపాలిటీ పరిధిలోనే మేడికుంట చెరువు 45 ఎకరలా పరిధిలో ఉండేదని.. క్రమేణ కబ్జాలు జరిగి చెరువు కుంచించుకుపోయిందని అక్కడ నివాసం ఉన్న వృద్ధ దంపతులు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. మేడ్చల్ జిల్లా మల్కాజిగిరి నియోజకవర్గంలోని డిఫెన్స్ కాలనీలో ప్రజావసరాలకు కేటాయించిన వెయ్యి గజాల స్థలాన్ని స్థానిక ప్రజాప్రతి నిధి కబ్జా చేసుకుంటూ వస్తున్నారని డిఫెన్స్ కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. అలాగే మూసాపేటలోని ఆంజనేయనగర్ రోడ్డు నంబరు 9లో 2 వేల గజాల పార్కు స్థలం కబ్జాకు గురి అవుతోందని.. అడ్డుకున్న తమపై దాడికి దిగుతున్నారని స్థానికంగా ఉండే భార్యాభర్తలు వచ్చి ఫిర్యాదు చేశారు. అమీన్ పూర్‌లోని 193 సర్వే నంబర్లో ఉన్న తన భూమిని వైసీపీ మాజీ ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి, రమేష్ ఇద్దరు కలిసి కబ్జా చేశారని బాధితురాలు హైడ్రా కమిషర్‌కు ఫిర్యాదు చేశారు. అధికా రాన్ని అడ్డుపెట్టుకుని మాజీ ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి దౌర్జన్యాలు చేశాడని.. అందుకు సంబంధించిన అన్ని ఆధా రాలు హైడ్రాకు సమర్పించానని ఆమె పేర్కొన్నారు.




ఫిర్యాదుదారుడు తెచ్చిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ రంగనాథ్

21-1pg10.qxd:21-1pg10.qxd 01/01/01 9:00 AM Page 1



# టీమిండియా ఎంపికలో వార్



## జట్టు సెలెక్షన్‌లో ఆధిపత్య పోరు

### గంభీర్, రోహిత్ మధ్య తారస్థాయికి విభేదాలు

**న్యూఢిల్లీ:** ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీకి భారత్ జట్టును ఇటీవల ప్రకటించింది. అయితే ఈ టీమిండియా ఎంపిక వెనుక పెద్ద వార్ నడిచిన విషయం వెలుగులోకి వచ్చింది. ప్రధానంగా భారత్ జట్టు ఎంపిక విషయలో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ మధ్య ఒకరిపై ఒకరు ఆధిపత్యం చూపించే ప్రయత్నం చేయడంతో ఇరువురి మధ్య మనస్పర్థలు తారాస్థాయికి చేరుకున్నాయని క్రికెట్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆస్ట్రేలియా పర్యటన నుండి కెప్టెన్ రోహిత్ శర్మ, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ మధ్య మంచి సమన్వయం లేకపోగా, విబేధాలు మరింత తారాస్థాయికి చేరుకున్నాయి. ఇప్పుడు మరోసారి రోహిత్, గంభీర్ మధ్య గొడవ వార్తలు తెరపైకి వస్తున్నాయి. శనివారం ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ, ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్ కోసం జట్టు భారత జట్టును ప్రకటించారు. అయితే ఇద్దరు ఆటగాళ్లకు సంబంధించి కెప్టెన్ రోహిత్ శర్మ, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్, కోచ్ గౌతమ్ గంభీర్ మధ్య ముంబైలో సుదీర్ఘ సమావేశం జరిగింది. ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపికైన జట్టులో యువ ఓపెనర్ శుభ్‌మాన్ గిల్‌కు కీలక బాధ్యతలు అప్పగించారు. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ అతన్ని వైస్ కెప్టెన్‌గా నియమించింది. అయితే, గిల్‌ను వైస్ కెప్టెన్‌గా చేయడానికి గౌతమ్ గంభీర్ అనుకూలంగా లేడని దీనిపై గుర్రుగా ఉన్నట్లు వెల్లడైంది. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యాను వన్డే వైస్ కెప్టెన్‌గా నియమించాలని పట్టు పట్టినట్లు తెలుస్తోంది. కానీ అతనికి కెప్టెన్ రోహిత్, సెలెక్టర్ల సపోర్ట్ దొరకలేదు. రెండున్నర గంటల పాటు జరిగిన సమావేశం తర్వాత రోహిత్, అగార్కర్ ఎవరికి వారే చివరకు తమకు నచ్చినట్లుగానే వ్యవహరించడం విశేషం. దీనిపై ఇరువురి మధ్య వార్ జరిగిన తదుపరి చివరకు శుభ్‌మాన్ గిల్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించడం జరిగింది. గతేడాది జరిగిన టి20 ప్రపంచ కప్‌లో హార్దిక్ పాండ్యా జట్టుకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. రోహిత్ ఈ ఫార్మాట్ నుంచి రిటైర్ అయినప్పుడు, కెప్టెన్సీని హార్దిక్‌కు అప్పగిస్తారని అనిపించింది. కానీ అది జరగలేదు. ముంబైకి చెందిన సూర్యకుమార్ యాదవ్ టీమిండియా టి20 కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. గంభీర్ కూడా సామ్సన్‌ను జట్టులో ఉంచాలని అనుకుని గట్టి ప్రయత్నం చేశాడు. ఛాంపియన్స్ ట్రోఫీకి సంజు సామ్సన్‌ను వికెట్ కీపర్‌గా ఎంపిక చేయాలని ప్రధాన కోచ్ గంభీర్ స్పష్టం చేశాడు. కానీ రోహిత్, అగార్కర్ ఎంపిక రిషబ్ పంత్ అని, అందుకే సంజును విస్మరించి అతనిని పక్కన పెట్టడం జరిగింది. గత సంవత్సరం సంజు సామ్సన్ ఓపెనర్‌గా ఆడుతూ, భారతదేశం తరపున వరుసగా రెండు సెంచరీలు సాధించడం ద్వారా సంచలనం సృష్టించాడు. తరువాత అతను మాట్లాడుతూ కోచ్ గంభీర్ తనకు చాలా సహాయం చేశాడని, అతనిపై నమ్మకం పెట్టుకున్నారని చెబుతున్నారు. అంతకుముందు, టి20 ప్రపంచ కప్‌లో సామ్సన్ కూడా జట్టులో భాగమయ్యాడు. కానీ అతనికి ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశం రాలేదు.



## వరల్డ్ ఆర్చరీలో సురేఖకు రజతం

**న్యూఢిల్లీ:** నిమ్ ఆర్చరీ టోర్నీలో భారత్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ పతకాల వేట కొనసాగుతోంది. ఇండోర్ ప్రపంచ సిరీస్‌లో భాగంగా ఫ్రాన్స్‌లో జరిగిన ఈ టోర్నమెంట్‌లో సురేఖ రజత పతకాన్ని సొంతం చేసుకుంది. ఇందులో మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో సురేఖ రెండో స్థానంలో నిలిచింది. హోరా హోరీగా సాగిన ఫైనల్ పోరులో ఆమె ఒక్క పాయింట్ తేడాతో ఓటమిపాలైంది. తుది పోరులో సురేఖ 146-147 తేడాతో కొలంబియాకు చెందిన అలెగ్జాండ్రా ఉస్క్వియానో చేతిలో పోరాడి పరాజయం చవిచూసింది. ఈ మ్యాచ్‌లో ప్రపంచ నాలుగో ర్యాంకర్ సురేఖ తడపడింది. 28-30, 29-30తో తొలి రెండు సెట్లలో వెనుకబడింది. మూడో సెట్లో 30-29తో మళ్లీ పుంజుకున్నప్పటికీ మరల నాలుగో సెట్లో 29-30తో నిలవడం దెబ్బతీసింది. చివరి సెట్‌కు ముందు ఓవరాల్‌గా 116-119తో నిలిచిన సురేఖ ఆఖరి సెట్లో 30-28తో రెండు పాయింట్లు ఎక్కువగానే సాధించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఒక్క పాయింట్ తేడాతో ప్రపంచ 14వ ర్యాంకర్ అలెజాండ్రా టైటిల్‌ను సొంతం చేసుకుంది. దీంతో సురేఖ రెండో స్థానంతో సరిపెట్టుకుని రజత పతకాన్ని కైవసం చేసుకుంది.

## మహిళల తొలి వన్డేలో..
## వెస్టిండీస్ సూపర్ విక్టరీ



**న్యూఢిల్లీ:** బంగ్లాదేశ్ మహిళల క్రికెట్ జట్టుతో జరిగిన తొలి వన్డేలో వెస్టిండీస్ సూపర్ విక్టరీ సాధించింది. ఈ మ్యాచ్‌లో 9 వికెట్ల తేడాతో పర్యాటక బంగ్లాదేశ్ జట్టు ఓటమిపాలైంది. ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) ఛాంపియన్‌షిప్-2025లో భాగంగా బంగ్లాదేశ్ మహిళల క్రికెట్ జట్టు వెస్టిండీస్‌లో పర్యటిస్తోంది. ఈ పర్యటనలో ఇరు జట్లు మూడు వన్డేలు, మూడు టి20లు ఆడనున్నాయి. వన్డే సిరీస్‌లో భాగంగా సెయింట్ కిట్స్‌లో తొలి మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో ఆతిథ్య వెస్టిండీస్, పర్యాటక బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. విండీస్ కెప్టెన్ హేలీ మాథ్యూస్ ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టి తమ జట్టు విజయంలో ప్రధాన పాత్ర పోషించాడు. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసింది. బంగ్లాదేశ్ ఇన్నింగ్స్‌లో షర్మిన్ అక్తర్ (42), ముర్షిదా ఖాతూన్ (40), శోభన మోస్తరీ (35), షోమా అక్తర్ (29) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. ఫర్జానా హక్ (10), కెప్టెన్ నిగర్ సుల్తానా (14), రబెయా ఖాన్ (1), నహిదా అక్తర్ (9), సుల్తానా ఖాతూన్ (2) విఫలమయ్యారు. విండీస్ బౌలర్లలో డియాండ్రా డొట్టిన్ 3 వికెట్లతో చెలరేగగా, ఆలియా అలెన్, హేలీ మాథ్యూస్ తలో 2, అఫీఫ్లెచర్ 1 వికెట్‌ను దక్కించుకున్నారు. అనంతరం బరిలోకిదిగిన వెస్టిండీస్ 31.4 ఓవర్లలో వికెట్ మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. కెప్టెన్ హేలీ మాథ్యూస్ అజేయ సెంచరీతో (93 బంతుల్లో 104 పరుగులతో నాటౌట్, 16 ఫోర్లు) విండీస్‌ను విజయతీరాలకు చేర్చింది. క్యియానా జోసఫ్ (79 బంతుల్లో 70 పరుగులు, 6 ఫోర్లు, 4 సిక్సర్లు) రాణించింది. మాథ్యూస్, జోసఫ్ తొలి వికెట్‌కు రికార్డు స్థాయిలో 163 పరుగులు జోడించారు. వన్‌డౌన్స్‌లో వచ్చిన షెర్మైన్ క్యాంప్‌బెల్ 14 పరుగులతో అజేయంగా నిలిచింది. క్వియానా జోసఫ్ వికెట్ రిబేయా ఖాన్‌కు దక్కింది. ఈ గెలుపుతో వెస్టిండీస్ 3 మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. కాగా ఇరు జట్ల మధ్య రెండో వన్డే ఈ నెల 21వ తేదీన జరగనుంది.





## టాటా స్టీల్ మాస్టర్స్ చెస్‌లో గుకేశ్, అర్జున్ డ్రా

**న్యూఢిల్లీ:** టాటా స్టీల్ చెస్ టోర్నమెంట్‌లో భారత్ స్టార్ గుకేశ్, అర్జున్ రెండో రౌండ్‌లో డ్రా చేసుకున్నాడు. స్లొవేనియాకు చెందిన వ్లాదిమిర్ ఫెదోసీవ్‌తో నెదర్లాండ్స్‌లోని విజ్క్ ఆన్ జీలో జరిగిన పోరులో గుకేశ్ పాయింట్ పంచుకున్నాడు. అలాగే ఇరిగేసి అర్జున్ రెండో రౌండ్‌ను డ్రాగా ముగించాడు. నెదర్లాండ్స్‌కు చెందిన అనీశ్ గిరితో జరిగిన గేమ్‌లో అర్జున్ పాయింట్ సంపాదించాడు. కాగా తొలి రౌండ్‌లో ఇరిగేసి అర్జున్ నిలువరించి అతనిపై పెంటేల హరికృష్ణ గెలిచాడు. ఇక ఆరంభంలో జరిగిన రౌండ్లో నెగ్గిన గుకేశ్ వ్లాదిమిర్ ఫెదోసీవ్‌తో జరిగిన రెండో రౌండ్‌ను డ్రా చేసుకున్నారు.

## మహిళల అండర్ 19 వరల్డ్ కప్‌లో..
# నైజీరియా సంచలన విజయం



### న్యూజిలాండ్‌పై 2 పరుగుల స్వల్ప తేడాతో గెలుపు

**న్యూఢిల్లీ:** క్రికెట్‌లో హిస్టరీలో సంచలన విజయం నమోదైంది. వరల్డ్ క్రికెట్‌లో అత్యంత పటిష్ఠమైన న్యూజిలాండ్ జట్టును పసికూన నైజీరియా ఓడించింది. మహిళల అండర్ 19 వరల్డ్‌కప్-2025లో భాగంగా సోమవారం న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో నైజీరియా అమ్మాయిల జట్టు 2 పరుగుల స్వల్ప తేడాతో నెగ్గి చరిత్ర సృష్టించింది. మలేసియా వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో సోమవారం న్యూజిలాండ్ నైజీరియా జట్లు తలపడ్డాయి. అయితే ఈ మ్యాచ్‌కు వర్షం తీవ్ర అంతరాయం కలిగించింది. దీంతో 20 ఓవర్లు సాగాల్సిన ఆటను నిర్వాహకులు ఇరువైపులా 13 ఓవర్లకు కుదించారు.
తొలుత బ్యాటింగ్ చేసిన నైజీరియా మహిళల జట్టు 13 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 65 పరుగులు చేసింది. అనంతరం స్వల్ప లక్ష్య ఛేధనకు దిగిన న్యూజిలాండ్ 13 ఓవర్లు ఆడి 6 వికెట్లు నష్టానికి 63 పరుగుల స్కోర్‌కే పరిమితమైంది. అయితే చివరి 6 బంతుల్లో కివీస్ విజయానికి 9 పరుగులు అవసరమయ్యాయి. ఆ సమయంలో లిలియన్ ఉదేహ్ బంతి అందుకుంది. ఆఖరి ఓవర్ అద్భుతంగా బౌలింగ్ చేసి తన జట్టుకు చరిత్రాత్మక విజయం అందించింది. కాగా, అండర్ 19 టీ20 వరల్డ్‌కప్ హిస్టరీలో నైజీరియా జట్టుకు ఇదే తొలి విజయం కావడం విశేషం.

## అదానీ కేసులో వాదనలకు న్యాయ సంస్థలు రెడీ



**ముంబై, జనవరి 20:** అదానీగ్రూప్ ఇటీవల అమెరికాలో తనపై వచ్చిన ఆరోపణలను న్యాయబద్ధంగా ఎదుర్కొనేందుకు సిద్ధమైంది. ఈమేరకు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్, ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ ఆఫ్ న్యూయార్క్ దాఖలు చేసిన సివిల్, క్రిమినల్ కేసులను నిర్వహించడానికి కిర్క్లాండ్ అండ్ ఎల్లిస్, క్విన్ ఇమ్మాన్యుయేల్ ఉర్కుహార్ట్ అండ్ సుల్లివాన్ ఎల్ఎల్‌పి అనే న్యాయసంస్థలను అదానీగ్రూప్ నియమించింది. అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ సోలార్ ఎనర్జీ కాంట్రాక్టులు దక్కించుకునేందుకు భారత ప్రభుత్వ అధికారులకు 250 మిలియన్ డాలర్లకుపైగా లంచాలు చెల్లించిందన్న ఆరోపణలున్నాయి. దాంతో అమెరికాలోని పెట్టుబడిదారులు కూడా ఎజిఇఆర్‌ఎల్‌లో ఇన్వెస్ట్ చేయడంతో కంపెనీపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి అమెరికాలోని ఎస్ఇసి, ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ ఆఫ్ న్యూయార్క్ ప్రాథమిక దర్యాప్తు జరిపి సివిల్, క్రిమినల్ కేసులు పెట్టింది. వాటిని ఎదుర్కొనేందుకు అదానీ గ్రూప్ తాజాగా రెండు సంస్థలను నియమించింది. ఇవి కంపెనీపై వచ్చిన ఆరోపణలపై న్యాయబద్ధంగా అక్కడి కోర్టుల్లో సమాధానం చెప్పనున్నాయి. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఇసిఐ) నుంచి కాంట్రాక్టులు పొందడానికి ఎజిఇఎల్‌కు అనైతికంగా సాయపడడానికి భారత అధికారులకు లంచం ఇచ్చారనే ఆరోపణలు వచ్చాయి. దాంతో అదానీ గ్రూప్ వ్యవస్థాపకుడు గౌతమ్ అదానీ, ఆయన బంధువు సాగర్ అదానీ, ఇతర ఎగ్జిక్యూటివ్‌లపై 2024 నవంబరు 21న అమెరికా అధికారులు అభియోగాలు మోపారు. ఈ ఆరోపణలు ఉన్నప్పటికీ గౌతమ్ అదానీ, సాగర్ అదానీ, సీనియర్ ఎగ్జిక్యూటివ్ వినీత్ ఎస్ జైన్‌లపై యుఎస్ ఫారిన్ కరప్షన్ ప్రాక్టీసెస్ యాక్ట్ (ఎఫ్‌సిపిఎ) ఉల్లంఘనలకు సంబంధించి అభియోగాలు మోపలేదని ఎజిఇఎల్ నొక్కి చెప్పింది. షికాగోలో ప్రధాన కార్యాలయం ఉన్న కిర్క్‌లాండ్‌అండ్‌ఎల్లిస్ అధికంగా వాణిజ్య వివాదాలు, మేధో సంపత్తి వ్యాజ్యాలు, వైట్-కాలర్ కేసుల్లో ప్రత్యేకత కలిగి ఉంది.

## భారత్ ఆర్థిక వ్యవస్థ పైపైకి

**న్యూఢిల్లీ, జనవరి 20:** కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) నిర్వహించిన ఒక సర్వే భారత ఆర్థిక వ్యవస్థకు సంబంధించి వివరాలను వెల్లడించింది. సర్వే నివేదిక ప్రకారం, ప్రస్తుత ఆర్థిక వాతావరణం ప్రైవేట్ పెట్టుబడులకు అనుకూలంగా ఉందని 75% కంపెనీలు భావిస్తున్నాయి. భౌగోళిక- రాజకీయ అనిశ్చితులు, అంతరాయం కలిగించిన సరఫరాల ద్వారా ఎదురయ్యే సవాళ్లు ఉన్నప్పటికీ, భారతదేశంలో పెట్టుబడుల పట్ల ఈ సానుకూల సెంటిమెంట్ అలాగే ఉంది. సర్వేలో పాల్గొన్న 70శాతం కంపెనీలు 2026లో పెట్టుబడులు పెట్టనున్నాయని, అందుకే రాబోయే కొద్ది త్రైమాసికాల్లో ప్రైవేట్ పెట్టుబడులు పెరిగే అవకాశం ఉందని సిఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీతెలిపారు. ప్రైవేట్ రంగంలో పెట్టుబడులు, ఉపాధి, వేతన ధోరణులలో వృద్ధిని అంచనా వేయడానికి సిఐఐ పరిశ్రమ సర్వేను ప్రారంభించింది.



ఆర్థిక వృద్ధితో పాటు ఉద్యోగాల కల్పన కూడా ఇటీవలి విధాన చర్చలలో కేంద్రంగా ఉంది. 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని దాదాపు 97శాతం సంస్థలు భావిస్తున్నాయని సర్వే ప్రాథమిక ఫలితాలు చూపిస్తున్నాయి. సర్వేలో పాల్గొన్న 79శాతం కంపెనీలు గత మూడేళ్లలో తమ శ్రామిక శక్తిని పెంచుకున్నట్లు తెలిపాయి. 2025-25 ఆర్థిక సంవత్సరంలో ఆశించిన ఉపాధివృద్ధికి సంబంధించిన ప్రశ్నపై, దాదాపు 97శాతం కంపెనీలు ఉపాధిని పెంచుతాయని భావిస్తున్నట్లు సూచించాయి. 42 నుంచి 46శాతం సంస్థలు ఉపాధిలో 10నుంచి 20శాతం పెరుగుదలను సూచించాయి. 31శాతం నుంచి 36శాతం మంది ఉద్యోగాలు 10శాతం పెరిగే అవకాశం ఉందని చెప్పారు. సిఐఐ యొక్క సర్వే నివేదిక ప్రకారం వచ్చేయేడాది తయారీ, సేవా రంగాలలో ప్రత్యక్ష ఉపాధి వృద్ధి 15 నుంచి 22శాతం ఉండవచ్చు. అయితే పరోక్ష ఉపాధి వృద్ధి 14శాతంఉండవచ్చు. సీనియర్ మేనేజ్‌మెంట్ పోస్టుల భర్తీలో సవాళ్లను కూడా సర్వే వెల్లడించింది. సీనియర్ మేనేజ్‌మెంట్ స్థానాలనుభర్తీ చేయడానికి ఒకటి నుంచి 6 నెలల మధ్య సమయం పడుతుందని సర్వే చేసిన చాలాసంస్థలు నివేదించాయి. రెగ్యులర్, కాంట్రాక్టు కార్మికులకు ఖాళీలను భర్తీ చేయడానికి తక్కువ సమయం అవసరం.

## లంచం ఆరోపణలపై మోతీలాల్ ఓస్వాల్ స్పందన




**ముంబై, జనవరి 20:** మోతీలాల్ ఓస్వాల్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ కల్యాణ్ జ్యుయెలర్స్‌లో పెట్టుబడులకు సంబంధించి సోషల్ మీడియా వేదికగా లంచం ఆరోపణలు ఎదుర్కొంటుంది. వీటిపై కంపెనీ స్పందించింది. ఆ ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. ఇవి నిరాధారమైనవని, దురుద్దేశపూరితమైనవని, పరువు నష్టం కలిగించేవిగా పేర్కొంది. కల్యాణ్ జ్యుయెలర్స్‌లో గణనీయమైన పెట్టుబడులు పెట్టడానికి ఎంఒఎఎంసి అధికారులు లంచం తీసుకున్నట్లు సోషల్ మీడియాలో ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ పుకార్లు కల్యాణ్ జ్యుయెలర్స్ షేరు గణనీయంగా పతనం కావడానికి కారణమైంది. ఇది గత రెండు వారాల్లో సుమారు 37శాతం క్షీణించింది. ఈ తరుణంలో కంపెనీ స్పందించింది. ఈ ఆరోపణలను ఖండిస్తూ మోతీలాల్‌ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఒక ప్రకటన విడుదల చేసింది. స్వార్థ ప్రయోజనాలున్న వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా తమ ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పింది. ఇటీవల వచ్చిన లంచం ఆరోపణలు కూడా ఇందులో భాగమేనని స్పష్టం చేసింది. వీటిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపింది. సమగ్రతకు, అత్యున్నత ప్రమాణాలు నిర్వహించడానికి కంపెనీ నిబద్ధతతో ఉంటుందని పేర్కొంది. ఈ నిరాధార ఆరోపణల వల్ల దశాబ్దాలుగా సంస్థ, నాయకత్వం నిర్మించుకున్న మంచి పేరును చెడగొట్టడానికి స్వార్థ ప్రయోజనాలు ఉన్న వ్యక్తులు ప్రయత్నిస్తున్నారని తెలిపింది. విశ్వసనీయ, అధికారికంగా ధ్రువీకరించిన సమాచార వనరులపైనే ఆధారపడాలని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వాటాదారులందరినీ కోరింది.

## లక్ష్మీ డెంటల్ 23% ప్రీమియంతో లిస్టింగ్

**ముంబై, జనవరి 20:** సోమ వారం లక్ష్మీ డెంటల్ లిమిటెడ్ ఐపిఒ షేర్ మార్కెట్‌లో మంచి ఎంట్రీ ఇచ్చింది. 27 శాతం కంటే ఎక్కువ ప్రీమియంతో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్టింగ్ అయిన తర్వాత లక్ష్మీ డెంటల్ దాని ఐపిఒ ధర రూ. 428 నించి 33 శాతం పెరిగింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లక్ష్మీ డెంటల్ షేర్లు దాదాపు 27 శాతం ప్రీమియంతో ఒక్కో షేరుకు రూ.542 చొప్పున ట్రేడవుతున్నాయి. బిఎస్ఇలో ఈ స్టాక్ ఐపిఒ ధర కంటే 23.36 శాతం పెరుగుదలను సూచిస్తూ రూ.528 వద్ద ప్రారంభమైంది. లక్ష్మి డెంటల్ షేర్లు లిస్టింగ్ అయిన గంటలో మరో 6 శాతం లాభపడ్డాయి. షేర్లు ఒక్కో షేరుకు రూ. 428 ఐపీఓ ధర నుంచి 32.64 శాతం పెరిగి రూ.567.70 వద్ద ట్రేడవుతున్నాయి. ఇదిలా ఉండగా ఆ సమయంలో షేరు గరిష్టంగా రూ.584ను తాకింది. పబ్లిక్ ఆఫర్ కోసం బిడ్ వేయడానికి పెట్టుబడి దారులు మొగ్గు చూపడంతో లక్ష్మీ డెంటల్ ఐపిఒ 3రోజుల వేలం ప్రక్రియ ద్వారా బలమైన సబ్‌స్క్రిప్షన్ చూసింది. ఈ ఐపీఓకు మొత్తంగా 114 బిడ్లు వచ్చాయి. రిటైల్ ఇన్వెస్టర్లు మంచి ఆసక్తిని కనబరిచారు ఇంకా వీరికి కేటాయించిన షేర్ల కంటే 75 రెట్లు ఎక్కువ బిడ్ వేశారు. సంస్థాగత పార్టిసిపెంట్లలో క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్స్ వారి వాటా కంటే 110 రెట్లు ఎక్కువ ధరకు బిడ్ చేశారు. అధిక నికర విలువ కలిగిన నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్స్ రెండు గ్రూపులను అధిగమించారు, వీరికి కేటాయించిన షేర్ల కంటే దాదాపు 148 రెట్లు బిడ్ వేశారు. గ్రే మార్కెట్‌లో అద్భుతమైన స్పందన ఈ ఐపిఒ పెట్టుబడిదారుల నుండి అద్భుతమైన స్పందన పొందింది. అలాగే 114.42 సార్లు సబ్‌స్క్రిప్షన్ పొందింది. లిస్టింగ్ ముందు ఈఐపిఒ గ్రే మార్కెట్‌లో ట్రెండ్ అయ్యింది. అయితే లిస్టింగ్‌కు ఒక రోజు ముందు అంటే ఆదివారం దాని గ్రే మార్కెట్ ప్రీమియం రూ.145. అంటే, గ్రే మార్కెట్ ప్రకారం 33.88శాతం ప్రీమియంతో రూ.573 వద్ద లిస్ట్ చేసి ఉండవచ్చు. అయితే, లిస్టింగ్ జిఎంపి కంటే కొంచెం తక్కువ ప్రీమియంతో జరిగింది. కంపెనీ లోన్స్ తిరిగి చెల్లించడానికి ఐపిఒ నుండి వచ్చిన డబ్బులో కొంత భాగాన్ని ఉప యోగిస్తుంది. కొత్త మెషినరీ కొనుగోలుకు కూడా కంపెనీ కొంత మొత్తాన్ని వెచ్చిస్తుంది. అంతేకాకుండా, కంపెనీ దాని అనుబంధ కంపెనీలో కూడా పెట్టుబడి పెట్టనుంది. మిగిలిన మొత్తం సాధారణ కార్పొరేట్ ప్రయోజనాల కోసం కూడా ఉపయోగించబడుతుంది.




## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, జనవరి 20:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలకు తోడు, బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో బెంచ్‌మార్క్ సూచీలు రాణించాయి. ఇంట్రాడేలో దాదాపు 700 పాయింట్ల మేర సెన్సెక్స్ లాభపడగా, నిఫ్టీ 23,300 పాయింట్ల ఎగువన స్థిరపడింది. సెన్సెక్స్ ఉదయం 76,978.53 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 76,584.84- 77,318.94 పాయింట్ల మధ్య కదలాడింది. చివరికి సెన్సెక్స్ 545.11 పాయింట్ల లాభంతో 77,073.44 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 141.55 పాయింట్ల లాభంతో 23,344.75 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకం లో రూపాయి విలువ రూ.86.55 వద్ద నిలిచింది. కోటాక్ మహీంద్రా బ్యాంకు, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎన్‌టిపిసి, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. జొమాటో, అదానీ పోర్ట్స్, టిసిఎస్, మహీంద్రా అండ్‌మహీంద్రా, మారుతి సుజుకి వంటి షేర్లు నష్టాల్లో ముగి సాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ 80 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా, బంగారం ఔన్సు 2760 డాలర్ల వద్ద కొనసాగింది.



# వాణిజ్యం

## 'నో సిగ్నల్' ప్రసక్తే లేదు..

**ముంబై, జనవరి 20:** దేశంలో మొబైల్ సేవలు విస్తృతంగా అందుబాటులోకి వచ్చినప్పటికీ మారుమూల గ్రామాల్లో ఇప్పటికీ సిగ్నల్ సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయి. కొన్నిచోట్ల ఏదో ఒక నెట్‌వర్క్ సిగ్నల్ మాత్రమే వస్తుంది. వేరే నెట్‌వర్క్ సిమ్‌కార్డు వాడితే ఆ ఫోన్ మూగబోయినట్లే. ఒకపై మారుమూల ప్రాంతాల్లో ఇలాంటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు ఇంట్రా సర్కిల్ రోమింగ్ సేవలను తాజాగా కేంద్రం అందుబాటులోకి తెచ్చింది. బిఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్‌టెల్ సిమ్ కార్డులు వినియోగదారులు డిజిటల్ భారత్ నిధి కింద ఏర్పాటైన టవర్ల ద్వారా 4జి సేవలను పొందొచ్చు. దేశంలో గ్రామీణ, మారుమూల ప్రాంతాలకు టెలికం సేవలు అందించాలన్న ఉద్దేశంతో డిజిటల్ భారత్ నిధి కార్యక్రమాన్ని కేంద్రం తీసుకొచ్చింది. ఇంతకుముందు యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్‌గా దీన్ని వ్యవహరించే



వారు. దీన్నే డిజిటల్ భారత్ నిధిగా మార్పు చేశారు. ఇలా డిబిఎన్ నిధులతో ఏర్పాటైన టవర్లు, ఆయా టెలికం సర్వీసు ప్రొవైడరుకు చెందిన వినియోగదారులకే సేవలించేవి. ఈ నేపథ్యంలో టెలికం మంత్రి జ్యోతిరాధిత్య సింధియా ఇంట్రా సర్కిల్ రోమింగ్ సేవలను తాజాగా ప్రారంభించారు. డిబిఎన్ నిధులతో ఏర్పాటైన మౌలిక సదుపాయాలను పంచుకోవడానికి బిఎస్ఎన్ఎల్, ఎయిర్‌టెల్, రిలయన్స్ జియో ముందుకొచ్చినట్లు మంత్రి తెలిపారు. దీని వల్ల వేర్వేరు నెట్‌వర్క్‌కు వేర్వేరు టవర్ల అవసరం లేకుండా, ఒకే టవర్ ద్వారా ఆయా టెలికం సంస్థల వినియోగదారులు 4జి సేవలను పొందొచ్చని తెలిపారు. దేశవ్యాప్తంగా డిబిఎన్ నిధులతో ఏర్పాటైన టవర్లు దాదాపు 27 వేల టవర్లు ఉన్నాయని, 35,400 మారుమూల గ్రామాలు దీనివల్ల లబ్ధి పొందనున్నాయని చెప్పారు. కేవలం డిబిఎన్ నిధులతో ఏర్పాటైన టవర్ల వరకు మాత్రమే ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14